సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
19 వ వసంతంలోకి ...
visit us @ https://www.suryaepaper.com
శనివారం | 14 మార్చి 2026 | హైదరాబాద్
సంపుటి 19 | సంచిక 145
| పేజీలు 10+8 | వెల: రూ. 6.50
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...



APPSC,TSPSC
పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.

అనుగ్రహం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : ఉత్తరాయణం - శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం బహుళ పక్షం, ఏకాదశి పూర్తి, ఉత్తరాషాఢ తె.3.02, వర్జ్యం ఉ.9.48 నుంచి 11.32 వరకు
రాహుకాలం ఉ.9.00 నుంచి 10.30 వరకు దుర్ముహూర్తం ఉ.6.18 నుంచి 7.52 వరకు

## నష్టాల్లో స్టాక్ మార్కెట్‌లు


5 లో

● స్టాక్ మార్కెట్లో బ్లాక్ ఫ్రైడే.. ఒక్కరోజే రూ.10 లక్షల కోట్లు ఆవిరి! ● 1470 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్, 488 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ ● అన్ని రంగాల్లో అమ్మకాల ఒత్తిడి, మెటల్ షేర్లు భారీగా పతనం

## పానిక్ బుకింగ్స్ వద్దు

● దేశంలో వంటగ్యాస్ కొరత లేదు ● ప్రజలు ఆందోళన చెందొద్దని కేంద్రం విజ్ఞప్తి!


6 లో

## ఈశాన్యంలో బీజేపీతోనే శాంతి




6 లో

● కాంగ్రెస్‌వి అన్నీ స్వార్థంతో చేసుకున్న ఒప్పందాలే ● రెండు రోజుల అసోం పర్యటనలో ప్రధాని మోడీ ● రూ.4,570 కోట్లు విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం ● మూడు కొత్త రైలు సర్వీసులకు జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని మోడీ

ఈశాన్య రాష్ట్రాల్లో శాశ్వతంగా శాంతిస్థాపనకు బీజేపీ చర్యలు చేపట్టిందని, కానీ స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీ వివిధ ఒప్పందాలు చేసుకుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. బాంబు పేలుళ్లు, తుపాకీ కాల్పుల మోతలు గతంలో ఈశాన్య రాష్ట్రాల్లో వినిపించేవని, కానీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు వచ్చాక ఇక్కడి పరిస్థితి మారిపోయిందని ఆయన తెలిపారు. ఇప్పుడు అసోం రాష్ట్రం శాంతి, అభివృద్ధిలలో కొత్త అధ్యాయాన్ని లిఖిస్తోందన్నారు. అసోంలోని కోక్రఝర్ జిల్లాలో బీజేపీ ఏర్పాటు చేసిన బహిరంగ సభను ఉద్దేశించి గువహటి నుంచి ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. కోక్రఝర్‌లో జరిగే సభకు మోదీ వెళ్లాల్సి ఉండగా, అకస్మాత్తుగా వర్షం కురవడంతో ఆయన ప్రయాణానికి ఆటంకం కలిగింది. స్థానికుల భూములను చొరబాటుదారులకు కట్టబెట్టడం ద్వారా భారత జాతీయ భద్రతను కాంగ్రెస్ పార్టీ ప్రమాదంలోకి నెడుతోందని మోదీ విమర్శించారు.

## గ్యాస్ కొరత లేకుండా చూస్తాం


3 లో

● గందరగోళం వద్దు, కావలసినంత ఉంది ● గ్యాస్ సరఫరాపై అపోహలు పడకండి ● ఎలాంటి భయాందోళనకు గురి కావొద్దు ● బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత లేదు ● అపోహలను అడ్డు పెట్టుకుని బ్లాక్ చేస్తే ఉపేక్షించేది లేదు ● చర్యలు కఠినంగా ఉంటాయి ● జిల్లాలో సమన్వయ కమిటీలతో తక్షణం సమావేశం ఏర్పాటు చేయండి ● గ్యాస్ కొరత అంటూ జరుగుతున్న ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పి కొట్టాలి ● సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంతోటే ఈ దుస్థితి ● కలెక్టర్లు,ఎస్.పిలు,పోలీస్ కమిషనర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ

## త్వరలోనే ఇరాన్ లొంగిపోతుంది

### ఇరాన్ యుద్ధంపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు

దాదాపు రెండు వారాలుగా కొనసాగుతున్న ఇరాన్‌తో యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్ త్వరలోనే లొంగిపోతుందని పేర్కొన్నారు. రెండ్రోజుల క్రితం జీ7 నేతల వర్చువల్ భేటీలో ట్రంప్ పేర్కొన్నట్లు ఓ వార్త సంస్థ తెలిపింది.


6 లో

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన

● ఉభయసభల్లో తీర్మానం నోటీసులిచ్చిన విపక్షం
● ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను తొలగించాలంటున్న 'ఇండియా' కూటమి

## మాజీ డీజీపీ హెచ్‌జే దొర కన్నుమూత


3 లో

● అనారోగ్యంతో చికిత్స పొందుతూ నిమ్స్‌లో తుదిశ్వాస ● నక్సలిజంపై కఠిన చర్యల్లో కీలక పాత్ర ● గ్రేహౌండ్స్ దళాన్ని బలోపేతం చేసిన అధికారిగా గుర్తింపు

## హైదరాబాద్‌కు మరో 3 కొత్త రెగ్యులర్ రైలు సర్వీసులు

● హర్షం వ్యక్తం చేసిన కిషన్ రెడ్డి ● ప్రధాని, రైల్వేశాఖ మంత్రికి ధన్యవాదములు తెలిపిన కేంద్ర మంత్రి


2 లో

పెరుగుతున్న జనాభా, ఆయా మార్గాలలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా భారతీయ రైల్వే నూతన రైలు సర్వీసులను ప్రారంభిస్తూ ఉంటుంది. అందులో భాగంగా 2014 నుంచి ఇప్పటివరకు గత 12 సంవత్సరాల కాలంలో హైదరాబాద్ కేంద్రంగా భారతీయ రైల్వే 91 కొత్త రైలు సర్వీసులను ప్రారంభించిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి అన్నారు. ఈ రైళ్లన్నీ కూడా జంట నగరాల పరిధిలోని రైల్వేస్టేషన్ల నుంచే (హైదరాబాద్, సికింద్రాబాద్, కాచిగూడ, చర్లపల్లి టర్మినల్) ప్రారంభమవుతున్నాయని, కొత్త సర్వీసుల ప్రారంభంతో పాటుగా.. ఇప్పటికే నడుస్తున్న రైలు సర్వీసుల్లో.. పాత కోచ్ లను ఆధునీకరించి ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడానికి కూడా భారతీయ రైల్వే నిరంతరం కృషి చేస్తోందన్నారు.

## గ్యాస్ సిలిండర్ల పంపిణీలో ఇబ్బందులు వద్దు

● ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు, సివిల్ సప్లై అధికారులకు సీఎస్ ఆదేశం
● సిలిండర్ల సరఫరా, నిల్వలు, రవాణా, భవిష్యత్ అవసరాలపై సమగ్ర సమీక్ష


2 లో

రాష్ట్రంలో గృహ వినియోగదారులకు ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల పంపిణీలో ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు ఆదేశించారు. రాష్ట్రంలో ఎల్‌పీజీ నిల్వలు, వంట గ్యాస్ వినియోగదారులకు పంపిణీ ప్రస్తుత పరిస్థితులపై శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులు, సివిల్ సప్లై విభాగం అధికారులతో సీఎస్ కే. రామకృష్ణారావు సమీక్ష చేశారు.

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## ఆవిష్కరణలు, పెట్టుబడులకు గ్లోబల్ హబ్‌గా హైదరాబాద్

● ఐటి, ఎలక్ట్రానిక్స్ , ఫార్మా, డిఫెన్స్, ఏవియేషన్ పరిశ్రమలకు నగరం కీలక వేదిక ● ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో రాష్ట్రాన్ని తీర్చిదిద్దాం ● పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాలతో పాటు ఫార్మా, డిఫెన్స్, ఏవియేషన్ పరిశ్రమలకు కూడా నగరం కీలక వేదికగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. ఆవిష్కరణలకు, పెట్టుబడులకు గ్లోబల్ హబ్ గా ఎదుగుతోందని చెప్పారు. బ్రిక్స్ దేశాల్లో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులకు అనువైన వాతావరణం, ఆధునిక సాంకేతికతల ప్రభావంపై అధ్యయనం చేయడానికి విచ్చేసిన జర్మన్ ప్రతినిధి బృందం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును కలిసింది.



3 లో

## ఓబీసీలకు న్యాయమెప్పుడు.?

● దేశంలో 56 శాతం బీసీలు ● కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి ● బీసీల అభివృద్ధికై ప్రత్యేక మంత్రిత్వ శాఖ అవసరం ● అణగారిన వర్గాల అభివృద్ధికై చర్యలు చేపట్టండి ● జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య

దేశంలో 56శాతం గల బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. రాజ్యసభలో కృష్ణయ్య మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వానికి 58 కేంద్ర మంత్రిత్వ శాఖలు, 93 విభాగాలు ఉన్నాయి కానీ ఈ రోజు వరకు కేంద్ర స్థాయిలో ఒబిసిల సంక్షేమ అభివృద్ధిని చూసేందుకు ప్రత్యేక విభాగం లేదు. ఎస్సీ/ఎస్టీ/మైనారిటీ/మహిళలు వంటి అనేక సామాజిక వర్గాలకు మంత్రిత్వ శాఖలు ఉన్నాయి. క్రీడలు, సాంస్కృతిక కార్యకలాపాలు ఇతర తక్కువ ముఖ్యమైన వ్యవహారాలకు ప్రత్యేక మంత్రి విభాగాలు ఉన్నాయి.


2 లో




# హైదరాబాద్‌కు మరో 3 కొత్త రెగ్యులర్ రైలు సర్వీసులు

● హర్షం వ్యక్తం చేసిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ● ప్రధాని, రైల్వేశాఖ మంత్రికి ధన్యవాదములు తెలిపిన కేంద్ర మంత్రి



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: పెరుగుతున్న జనాభా, ఆయా మార్గాలలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా భారతీయ రైల్వే నూతన రైలు సర్వీసులను ప్రారంభిస్తూ ఉంటుంది. అందులో భాగంగా 2014 నుంచి ఇప్పటివరకు గత 12 సంవత్సరాల కాలంలో హైదరాబాద్ కేంద్రంగా భారతీయ రైల్వే 91 కొత్త రైలు సర్వీసులను ప్రారంభించిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి అన్నారు. ఈ రైళ్లన్నీ కూడా జంట నగరాల పరిధిలోని రైల్వేస్టేషన్ల నుంచే (హైదరాబాద్, సికింద్రాబాద్, కాచిగూడ, చర్లపల్లి టర్మినల్) ప్రారంభమవుతున్నాయని, కొత్త సర్వీసుల ప్రారంభంతో పాటుగా.. ఇప్పటికే నడుస్తున్న రైలు సర్వీసుల్లో.. పాత కోచ్ లను ఆధునీకరించి ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడానికి కూడా భారతీయ రైల్వే నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రస్తుతం కొన్ని మార్గాలలో ప్రయాణికుల నుంచి వచ్చిన డిమాండ్ కు అనుగుణంగా సేవలు అందిస్తున్న మూడు స్పెషల్ ట్రైన్స్‌ను.. రెగ్యులర్ ట్రైన్స్‌గా మారుస్తూ భారతీయ రైల్వే నిర్ణయం తీసుకుంది. దీనివల్ల రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు మేలు జరగనుంది. భారతీయ రైల్వే తీసుకున్న నిర్ణయంలో భాగంగా రైలు నం. 07191/07192 కాచిగూడ-మధురై-కాచిగూడ రైలును రైలు నం. 17165/17616 కాచిగూడ-ట్యుటికోరిన్-కాచిగూడ ఎక్స్ ప్రెస్ గా మార్చారు.

ఇకపై ఈ రైలు ప్రతి సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు కాచిగూడలో మొదలై మరుసటి రోజు మంగళవారం రాత్రి 10:45 గం.లకు కేరళ రాష్ట్రంలోని ట్యూటికోరిన్ కు చేరుకుంటుందన్నారు. అలాగే తిరుగు ప్రయాణంలో ట్యూటికోరిన్ నుంచి బుధవారం ఉదయం 7:45 గంటలకు మొదలై మరుసటిరోజు మధ్యాహ్నం 1:25 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. ఈ రైలు రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న షాద్ నగర్, జడ్చర్ల, మహబూబ్ నగర్, వనపర్తి రోడ్, గద్వాల, కర్నూల్ సిటీ, డోన్, గుత్తి, అనంతపురం, ధర్మవరం, కదిరి, మదనపల్లె రోడ్, పీలేరు, పాకాల, చిత్తూరు స్టేషన్ల మీదుగా ప్రయాణం సాగిస్తుందన్నారు.

రైలు నం. 07230/07229 హైదరాబాద్-కన్యాకుమారి-హైదరాబాద్ రైలును రైలు నం. 17069/17070 హైదరాబాద్-కన్యాకుమారి-హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ గా మార్చారు. ఈ రైలు గతంలోలాగే ప్రతి బుధవారం సాయంత్రం 5:20 గంటలకు హైదరాబాద్ లో బయలుదేరి శుక్రవారం తెల్లవారుజామున 2:30 గంటలకు తమిళనాడులోని కన్యాకుమారి చేరుకుంటుందన్నారు. అలాగే తిరుగు ప్రయాణంలో కూడా గతంలో లాగే ప్రతి శుక్రవారం తెల్లవారుజామున 5:15 గంటలకు కన్యాకుమారిలో బయలుదేరి శనివారం మధ్యాహ్నం 2:30 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ఈ రైలు రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న సికింద్రాబాద్, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి జంక్షన్, సత్తెనపల్లి, గుంటూరు జంక్షన్, తెనాలి జంక్షన్, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు జంక్షన్, రేణిగుంట జంక్షన్, తిరుపతి, పాకాల జంక్షన్, చిత్తూరు స్టేషన్ల మీదుగా ప్రయాణం సాగిస్తుందన్నారు.

రైలు నం. 07225/07226 చర్లపల్లి-షాలిమార్-చర్లపల్లి రైలును రైలు నం. 17065/17066 చర్లపల్లి-షాలిమార్-చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ గా మార్చారు. ఇకపై ఈ రైలు ప్రతి మంగళవారం ఉదయం 7:15 గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి మరుసటి రోజు బుధవారం ఉదయం 11:20 గంటలకు పశ్చిమబెంగాల్ షాలిమార్‌కు చేరుకుంటుందన్నారు.

అలాగే తిరుగు ప్రయాణంలో బుధవారం మధ్యాహ్నం 12:50 గం. లకు షాలిమార్ లో బయలుదేరి మరుసటి రోజు గురువారం సాయంత్రం 7 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. ఈ రైలు రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న కాజీపేట్, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, రాయనపాడు, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస స్టేషన్ల మీదుగా ప్రయాణం సాగిస్తుందన్నారు. మొత్తంగా 3 స్పెషల్ రైళ్లను రెగ్యులర్ సర్వీసులుగా మారుస్తూ భారతీయ రైల్వే తీసుకున్న నిర్ణయం పట్ల కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ.. ప్రధానమంత్రి మోదీ కి, రైల్వే శాఖమంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధికి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి చిత్తశుద్ధితో పని చేస్తోందని కిషన్ రెడ్డి అన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రానికి రూ. 36,286 కోట్ల రైల్వే బడ్జెట్ ను కేటాయించారని, ప్రస్తుతం రాష్ట్రంలో రూ. 47,984 కోట్ల రైల్వే పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

అంతేకాకుండా, రూ. 2,668 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 40 రైల్వేస్టేషన్లను అధునాతన సౌకర్యాలతో అమృత్ భారత్ రైల్వేస్టేషన్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు తద్వారా ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నట్లు తెలియజేశారు. ఇటీవలే దేశంలో ఏ రాష్ట్రానికి లేని విధంగా తెలంగాణ రాష్ట్రానికి 3 హైస్పీడ్ రైల్ కారిడార్లను మంజూరు చేశారని, ఈ హైస్పీడ్ రైల్ కారిడార్లు తెలంగాణ రాష్ట్ర సామాజిక, ఆర్థికాభివృద్ధిలో కీలకం కానున్నాయని అన్నారు. ప్రస్తుతం తెలంగాణ నుంచి 5 వందే భారత్ రైళ్లు, 4 అమృత్ భారత్ రైళ్లు సేవలు అందిస్తున్నాయని, రానున్న రోజులలో మరిన్ని అధునాతన రైళ్లు, రద్దీ ఉన్న మరిన్ని కొత్త మార్గాలకు రైలు సేవలను అందుబాటులోకి తీసుకురావటానికి కృషి చేస్తామని కిషన్ రెడ్డి తెలియజేశారు.

# మూసీ ప్రాజెక్ట్‌పై బీజేపీకి వ్యతిరేకత లేదు

● అక్కడ నివసిస్తున్న వారికి ముందుగా పునరావాసం కల్పించాలి ● అన్యాయంగా పేదల ఇల్లు కూలిస్తే బాధితులకు అండగా ఉంటాం
● పేదల ఇళ్లు కూల్చడాన్ని వ్యతిరేకిస్తాం ● యుద్ధం కారణంగా గ్యాస్ ఉత్పత్తులను బ్లాక్ చేస్తే కఠిన చర్యలు
● ప్రజలను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది ● బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: మూసి ప్రాజెక్టు అభివృద్ధిలో బిజెపికి ఎలాంటి వ్యతిరేకతలేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచందర్ రావు అన్నారు. బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. మూసీపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ పట్ల బీజేపీకి ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. మూసీ నది పునరుజ్జీవనం గానీ, మూసీ ప్రాజెక్టు గానీ బిజెపి ఎప్పుడూ వ్యతిరేకించలేదన్నారు. మూసీ నది హైదరాబాద్ నగరం నుంచి కృష్ణానదిలో కలిసే వరకు పరిశుభ్రంగా ఉండాలని, అందులో స్వచ్ఛమైన నీరు ప్రవహించాలని, ఆ నీరు రైతులకు సాగునీటిగా ఉపయోగపడాలని బీజేపీ స్పష్టంగా కోరుకుంటోందని తెలిపారు.

అయితే ఈ అంశంపై కాంగ్రెస్ నాయకులు పదేపదే తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి అయినా, మంత్రి పొన్నం ప్రభాకర్ అయినా భారతీయ జనతా పార్టీపై రకరకాల వ్యాఖ్యలు చేస్తున్నారని, కానీ మూసీ విషయంలో బీజేపీ వైఖరి మాత్రం మొదటి నుంచీ ఒకటే.. స్పష్టంగా చెబుతోందని అన్నారు. మూసీ నది తప్పకుండా పునరుజ్జీవనం కావాలని ఇప్పటికీ చెబుతున్నామని, కానీ 'గాంధీ సరోవర్' పేరుతో అక్కడ నివసిస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాల ఇళ్లను కూల్చడం అంగీకారయోగ్యం కాదన్నారు. మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ వంటి ప్రాంతాల్లో చట్టబద్ధంగా నిర్మించిన ఇళ్లను కూల్చాల్సిన అవసరం లేదని, ఆ ఇళ్లను కూల్చకుండా కూడా మూసీని శుద్ధి చేయవచ్చన్నారు. సబర్మతి నదిని ఉదాహరణగా చెబుతూ మాట్లాడేవారు అసలు అక్కడ ప్రాజెక్టు ఎలా జరిగిందో తెలుసుకోవాలని సూచించారు. ఒకప్పుడు సబర్మతి కూడా మూసీలా కాలుష్యంతో, దుర్వాసనతో ఉండేదని గుర్తుచేశారు. నరేంద్ర మోదీ గారు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నర్మదా నది నుంచి నీటిని సబర్మతికి మళ్లించి, నదుల అనుసంధానం చేసి, ముందుగా నది శుభ్రపరిచారని చెప్పారు.

అక్కడ నివసిస్తున్న పేద కుటుంబాలను ముందుగా పునరావాసం కల్పించి, ప్రత్యామ్నాయ గృహాలు ఇచ్చిన తర్వాతే ప్రాజెక్టు చేపట్టారని తెలిపారు. సుమారు 4 వేల కుటుంబాలకు ప్రత్యామ్నాయ గృహాలు ఇచ్చిన తర్వాతే అభివృద్ధి పనులు చేపట్టారని, ప్రజల జీవితం దెబ్బతినకుండా జరిగేదే నిజమైన అభివృద్ధి అన్నారు. మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలను నిరాశ్రయులను చేయడాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. అభివృద్ధి పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లు కూల్చడం అన్యాయం అన్నారు. గాంధీ సరోవర్ కోసం భూమి అవసరమైతే ప్రాజెక్టును రియలైన్ చేసుకోవచ్చని సూచించారు. ఒక్క ఇల్లు కూడా దెబ్బతినకుండా ప్రణాళిక రూపొందించాలని అన్నారు. గాంధీ విగ్రహం నిర్మించాలనుకుంటే వెయ్యి అడుగులైనా, రెండువేల అడుగులైనా ఆకాశాన్ని తాకేలా నిర్మించొచ్చని, దానికి బీజేపీకి ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు. కానీ పేదల ఇళ్లు కూల్చి వారి జీవనాధారాన్ని దెబ్బతీస్తే మాత్రం బీజేపీ తప్పకుండా వ్యతిరేకిస్తుందని హెచ్చరించారు. ముందుగా మూసీని శుద్ధిచేసి, ఆ తర్వాత అభివృద్ధి పనులు చేపట్టాలని, దానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. దేశంలో గ్యాస్, ఆయిల్, డీజిల్, పెట్రోల్ దొరకవని ప్రజల్లో భయం సృష్టించడం పూర్తిగా బాధ్యతారాహిత్యమని అన్నారు. రాహుల్ గాంధీ వంటి కాంగ్రెస్ నేతలు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. ప్రపంచంలో యుద్ధాలు, ఉద్రిక్తతలు ఉన్నప్పుడు వాటి ప్రభావం ప్రపంచవ్యాప్తంగా, భారతదేశంపైనా కనిపించవచ్చని, కానీ అదే పేరుతో దేశంలో కొరత వస్తుందని భయాందోళనలు సృష్టించడం సరికాదన్నారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. జైశంకర్ గారు, ప్రధాని నరేంద్ర మోదీ గారు సంబంధిత దేశాల నాయకులతో మాట్లాడి, భారతదేశానికి రావాల్సిన చమురు, గ్యాస్ సరఫరాలు హోర్ముజ్ జలసంధి ద్వారా అంతరాయం లేకుండా దేశానికి చేరేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. భారతదేశం ఒకే ప్రాంతంపై ఆధారపడదని, దాదాపు 40 శాతం ముడి చమురు ఇతర దేశాల నుంచీ వస్తోందని చెప్పారు. అందువల్ల దేశంలో గ్యాస్ సిలిండర్లు, పెట్రోల్, డీజిల్ కొరత ఉండదన్నారు. యుద్ధ పరిస్థితుల వల్ల రవాణాలో స్వల్ప ఆలస్యాలు ఉండొచ్చని, కానీ ఇంధన కొరత మాత్రం ఉండదని స్పష్టం చేశారు. ప్రపంచంలో ఎలాంటి పరిస్థితులు వచ్చినా భారత ప్రజలు వాటిని ఎదుర్కొనే శక్తి కలిగినవారని చెప్పారు. అలాంటి సమయంలో నాయకులు ప్రజల్లో ధైర్యం నింపాల్సిందే తప్ప, భయాందోళనలు కలిగించడం పెద్ద తప్పు అన్నారు. దేశంలో గృహ వినియోగ ఎల్పిజి, గ్యాస్ సరఫరాలో ఎలాంటి కొరత ఉండదని ప్రధాని ఇప్పటికే స్పష్టం చేశారని, సాధారణ ప్రజలకు ఇంధన సరఫరా నిరంతరం కొనసాగుతుందని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. అందువల్ల వాస్తవాలు తెలుసుకోకుండా ప్రజల్లో భయాందోళనలు కలిగించే వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని తెలిపారు.

# రాజ్యాంగాన్ని గౌరవించాలి బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలి

● బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాల్సిందే ● బీసీలకు ఇవ్వకుండా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఎలా ఇస్తున్నారు
● మాజీ డీజీపీ జె పూర్ణచంద్ర రావు



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతి ఉత్సవాలు బీసీ సమాజ్ అధ్యక్షుడు సంఘం సూర్యరావు అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ఆ సందర్భంగా మాజీ డిజిపి జే పూర్ణచంద్రరావు మాట్లాడుతూ రిజర్వేషన్ల వల్ల మెరిట్ దెబ్బతింటుందని దేశం వెనుకబడిపోతుందని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చే అగ్రవర్ణ నాయకులందరూ కవయిత్రి మొల్ల గురించి తెలిస్తే ఇలా మాట్లాడారని అన్నారు ఆమె 16వ శతాబ్దంలోనే కుమ్మరి కులంలో జన్మించి అసాధారణ ప్రతిభతో సంస్కృతము నుండి తెలుగులోకి రామాయణాన్ని రచించిన కవయిత్రి ప్రతిభ ను విస్మరించరాదన్నారు. రిజర్వేషన్ల వల్ల దేశం అధోగతి పాలవుతుంద న్నవాళ్లే నేడు ఈడబ్ల్యూఎస్ పేరిట రిజర్వేషన్లు పొందుతున్నారని ద్వంద్వ నీతి పనికిరాదన్నారు. వాస్తవానికి ముఖ్యమంత్రి ప్రధాన మంత్రుల పోస్టులకు రిజర్వేషన్లు ఉన్నాయన్నారు. అలాగే గొప్ప గొప్ప ఉద్యోగాల్లో అగ్రకులపు వాళ్లకే రిజర్వేషన్లు ఉన్నాయన్నారు. ఎన్నో ఏళ్లుగా వారా పదవుల్లో తిష్ట వేసి శాశ్వత రిజర్వేషన్ను కల్పించుకున్నారన్నారు. బహుజన కులాల వాళ్లందరూ తమ తమ సామాజిక వర్గాలలో మహనీయుల సేవలను త్యాగాలను కృషిని వెలుగులోకి తెచ్చి ఒక తాటిపైకి రావాలన్నారు ఆ దిశగా రాజ్యాధికారం వైపు నడవాలని పిలుపునిచ్చారు. బీసీ సమాజ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు విజయకుమార్ మాట్లాడుతూ కవయిత్రి మొల్ల,మల్లె లాగా తెల్లగా, స్వచ్ఛంగా ఉంటూ సువాసనలను వెదజల్లే రీతిగా సంస్కృతం నుండి తెలుగులోకి సరళమైన పదాలతో రామాయణాన్ని రచించిందని చెప్పారు. కుల వివక్ష, అంటరానితనం, మహిళలంటే చిన్న చూపు, మరెన్నో మూఢ నమ్మకాలు, ఆచారాలు ఉన్న కాలంలో జన్మించిన మొల్ల మాంబ వాటన్నిటికీ వ్యతిరేకంగా పోరాటం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు డాక్టర్ వెంకటేశ్వర్లు రిటైర్డ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటయ్య ఆలిండియా బహుజన్ సమాజ్ పార్టీ ఆంధ్రప్రదేశ్ నాయకులు లక్ష్మీనారాయణ నాయి, బీసీ సమాజ్ ఐటి విభాగం కె.వి ... కుమ్మర సంఘం యువజన విభాగం అధ్యక్షులు కొల్లూరి అర్జున్ శ్రీనివాస్ తదితరులు.. పాల్గొని జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఓబీసీలకు న్యాయమెప్పుడు.?

● దేశంలో 56శాతం బీసీలు ● కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి
● బీసీల అభివృద్ధికై ప్రత్యేక మంత్రిత్వ శాఖ అవసరం ● అణగారిన వర్గాల అభివృద్ధికై చర్యలు చేపట్టండి
● జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య



తెలంగాణ బ్యూరో/ప్రతినిధి: దేశంలో 56శాతం గల బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. రాజ్యసభలో కృష్ణయ్య మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వానికి 58 కేంద్ర మంత్రిత్వ శాఖలు, 93 విభాగాలు ఉన్నాయి కానీ ఈ రోజు వరకు కేంద్ర స్థాయిలో ఒబిసిల సంక్షేమ అభివృద్ధిని చూసేందుకు ప్రత్యేక విభాగం లేదు. ఎస్సీ/ఎస్టీ/మైనారిటీ/మహిళలు వంటి అనేక సామాజిక వర్గాలకు మంత్రిత్వ శాఖలు ఉన్నాయి. క్రీడలు, సాంస్కృతిక కార్యకలాపాలు ఇతర తక్కువ ముఖ్యమైన వ్యవహారాలకు ప్రత్యేక మంత్రి విభాగాలు ఉన్నాయి. ఇటీవల మత్స్య, సహకార శాఖ. ఇది సృష్టించబడింది, కానీ, జనాభాలో 56% ఉన్న బీసీ ల అభివృద్ధి కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయకపోవడం సమర్థనీయం కాదు. కేంద్ర స్థాయిలో 27% రిజర్వేషన్లు ఉపాధి మరియు విద్య మరియు స్థానిక సంస్థల ఎన్నికలలో అమలు చేయబడుతున్నాయి మరియు నేషనల్ బిసి కమిషన్ మరియు నేషనల్ బిసి కార్పొరేషన్ ఉన్నాయి మరియు బీసీ పార్లమెంటరీ కమిటీనికూడాఏర్పాటుచేశారు. పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్ల సబ్సిడీ రుణ పథకాలు మరియు అనేక రాష్ట్రాలు వంటి అనేక పథకాలు బీసీల అభివృద్ధి కోసం ఉద్దేశించిన వివిధ పథకాలు, కార్యక్రమాలను అమలు చేయడం, అందువల్ల వాటి సరైన అమలుకు పర్యవేక్షణ అవసరం. బీసీ రిజర్వేషన్లు, ఇతర సమస్యలపై అనేక చట్టపరమైన వివాదాలు ఉన్నాయి. బిసి రిజర్వేషన్లకు సంబంధించి అనేక సమస్యలు తరచుగా తలెత్తుతున్నాయి. ఈ సమయంలో ఈ వర్గాల అభివృద్ధికి ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయడం అత్యవసరం. ఇది మాత్రమే ఈ కమ్యూనిటీల అభివృద్ధికి ప్రత్యేక దృష్టిని ఆకర్షించగలదు. కాబట్టి కేంద్ర ప్రభుత్వంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి. స్థాయి. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు బీసీ లకు ప్రత్యేక విభాగం ఉంది, రాష్ట్రాలను పర్యవేక్షించడానికి మరియు సమన్వయం చేయడానికి, కేంద్ర ప్రభుత్వ స్థాయిలో బీసీ లకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ అవసరం. బీసీలకు సంబంధించిన అనేక సమస్యలు, వారి రిజర్వేషన్లు ఈ రోజుల్లో వెలుగుచూస్తున్నాయి. ఈ పరిస్థితులలో, కేంద్ర ప్రభుత్వంలో ఒక విభాగం. గత కొన్ని దశాబ్దాలుగా పెండింగ్లో ఉన్న ప్రత్యేక శ్రద్ధతో వేగవంతమైన అభివృద్ధి కోసం బీసీల అభివృద్ధి, అభ్యున్నతి కోసం స్థాయిని ఏర్పాటు చేయాలని కృష్ణయ్య పేర్కొన్నారు.


# బీసీ హక్కుల కోసం అవిశ్రాంతంగా పోరాడాలి

● బీసీలను ఐక్యం చేసేందుకు బీసీలు ముందుకు రావాలి ● బీసీటియు రాష్ట్ర అధ్యక్షులుగా బెల్లంకొండ రామ్మూర్తి ఎన్నిక ● బీసీ ఉపాధ్యాయుల హక్కుల కోసం రాజీలేని పోరాటం కొనసాగించాలి ● బీసీటియు రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జాజుల శ్రీనివాస్ గౌడ్



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: బీసీ ఉపాధ్యాయ సంఘం తెలంగాణ (బిసిటియు) రాష్ట్ర అధ్యక్షునిగా సూర్యాపేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు బెల్లంకొండ రామ్మూర్తి, అదనపు ప్రధాన కార్యదర్శిగా నిజామాబాద్ జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆర్ గోపాలకృష్ణ చారిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రకటించారు. బీసీ భవన్ లో బీసీ ఉపాధ్యాయ సంఘం బీసీటీయు రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది ఈ సమావేశానికి బిసిటియు రాష్ట్ర అధ్యక్షులు కొన్నెడ శంకర్ గౌడ్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా జాజుల శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బీసీ ఉపాధ్యాయ సంఘాన్ని రాష్ట్రవ్యాప్తంగా బలోపేతం చేయడంలో భాగంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని సమావేశంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షులు ప్రతిపాదించారు దీనితో బీసీ ఉపాధ్యాయ సంఘం లో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న సూర్యాపేట జిల్లాకు చెందిన బెల్లంకొండ రామ్మూర్తిని రాష్ట్ర అధ్యక్షునిగా, అదనపు ప్రధాన కార్యదర్శిగా నిజామాబాద్ జిల్లాకు చెందిన ఆర్ గోపాలకృష్ణ చారిని సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మొత్తం ఉపాధ్యాయులలో బీసీ ఉపాధ్యాయులు 60 శాతం ఉన్నారని, వారి హక్కుల కోసం, బీసీ ఉపాధ్యాయులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ల కోసం రాజీలేకుండా పోరాటశీ కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికైన నూతన రాష్ట్ర అధ్యక్షులుగా బిసిటియు రాష్ట్ర అధ్యక్షులు బెల్లంకొండ రామ్మూర్తి మాట్లాడుతూ బిసిటియు నీ పాఠశాల స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు బలోపేతం చేయడానికి త్వరలోనే అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాలను పర్యటించి నూతన కమిటీలను ఏర్పాటు చేసి బీసీటియును ఉపాధ్యాయ సంఘాలు అగ్రస్థానంలో నిలబెడతానని ఆయన తెలిపారు, బీసీ ఉపాధ్యాయులను యూనియన్లకు అతీతంగా సంఘటిత పరచడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించారు. ఆకునూరి మురళీ కమిటీ రిపోర్టు ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం.. ఇన్సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలి, పెండింగ్ లో ఉన్న 6 డిఎ లను వెంటనే విడుదల చేయాలి. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి. పిఆర్సీ ని 50 శాతం ఫిట్‌మెంట్‌తో వెంటనే అమలు చేయాలి. 2003 ఉద్యోగ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 ఆధారంగా మరియు రాష్ట్ర హై కోర్టు తీర్పును అమలు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని వర్తింపచేయాలి. బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి. మోడల్ స్కూల్, గురుకుల పాఠశాల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి. ఈ సమావేశంలో బిసి ఉపాధ్యాయ సంఘాల నేతలు మాడవీటి వినోద్, వీరప్ప, గోపాలకృష్ణ, రాధాకృష్ణ, నవీన్ గౌడ్, భాస్కర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్ విద్యార్థులకు గవర్నర్ శుభాకాంక్షలు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పరీక్షలను ఒత్తిడిగా భావించకుండా తమ జ్ఞానం మరియు ప్రతిభను చూపించే మంచి అవకాశంగా భావించాలని ముఖ్యంగా విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. పరీక్షల సమయంలో ప్రశాంతంగా ఉండి సమయాన్ని సక్రమంగా వినియోగించుకొని తమ అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించాలని, ఆత్మ విశ్వాసం విజయానికి ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు వెన్నుదన్నుగా నిలుస్తున్న తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులను ఆయన ప్రశంసించారు. పరీక్షలకు హాజరవుతున్న ప్రతి విద్యార్థి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

## గ్యాస్ సిలిండర్ల పంపిణీలో ఇబ్బందులు వద్దు

● ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు, సివిల్ సప్లై అధికారులకు సీఎస్ ఆదేశం
● సిలిండర్ల సరఫరా, నిల్వలు, రవాణా, భవిష్యత్ అవసరాలపై సమగ్ర సమీక్ష



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : రాష్ట్రంలో గృహ వినియోగదారులకు ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల పంపిణీలో ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు ఆదేశించారు. రాష్ట్రంలో ఎల్‌పీజీ నిల్వలు, వంట గ్యాస్ వినియోగదారులకు పంపిణీ ప్రస్తుత పరిస్థితులపై శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులు, సివిల్ సప్లై విభాగం అధికారులతో సీఎస్ కే. రామకృష్ణారావు సమీక్ష చేశారు. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ సరఫరా, నిల్వలు, రవాణా వ్యవస్థ, భవిష్యత్ అవసరాలు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా సి.ఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ రోజు వారి సమీక్ష, బ్లాక్ మార్కెటింగ్ లేకుండా చర్యలు, డిస్ట్రిబ్యూటరీలు, ఏజెన్సీల దగ్గర పోలీస్ నిఘా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.29 కోట్ల గృహ వినియోగదారుల కనెక్షన్లు ఉన్నాయని, ప్రస్తుత డిమాండ్ కు సరిపడా నిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఆసుపత్రులు, ప్రభుత్వ హాస్టళ్లు కు డిమాండ్ మేరకు ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల సరఫరా చేస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. గృహ వినియోగదారులకు ఎల్పీజీ సిలిండర్ల సరఫరా విషయంలో ఎలాంటి ఆందోళన చేందాల్సిన అవసరం లేదని ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, శాఖ అధికారులు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 810 డిస్ట్రిబ్యూటరీ కేంద్రాలు ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల సరఫరా చేస్తున్నాయని అన్నారు. వినియోగదారులకు సకాలంలో డెలివరీ జరిగేలా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు చర్యలు తీసుకోవాలని సి.ఎస్ ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమయానికి సరఫరా అందేలా సంబంధిత శాఖలతో సమన్వయం పెంచాలని సూచించారు. ఈ సమావేశంలో హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్, బీపీసిఎల్ మార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులు, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కేంద్ర రైల్వే శాఖ మంత్రికి లేఖ రాసిన ఎంపీ ఈటెల రాజేందర్



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కి మల్కాజిగిరి లోక్‌సభ సభ్యుడు ఈటల రాజేందర్ లేఖ రాశారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న బొల్లారం రైల్వే స్టేషన్ అభివృద్ధి అత్యవసరం. బొల్లారం రైల్వే స్టేషన్ ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులకు, ఉద్యోగులకు, విద్యార్థులకు పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు ముఖ్య కేంద్రంగా పనిచేస్తోందని ఈ లేఖలో తెలిపారు. హైదరాబాద్ ఉత్తర ప్రాంతాలను నగరంలోని ఇతర ప్రాంతాలతో కలిపే కీలక రవాణా కేంద్రంగా ఈ స్టేషన్ ఉందని పేర్కొన్నారు. అయితే ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న ప్లాట్‌ఫారమ్‌లు, వేచి ఉండే గదులు, టికెటింగ్ సదుపాయాలు, ఇతర ప్రయాణికుల సౌకర్యాలు తగినంతగా లేవని చెప్పారు. అందువల్ల ప్రయాణికుల భద్రత, సౌకర్యం కోసం స్టేషన్‌ను ఆధునీకరించడం అవసరమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద బొల్లారం రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ పథకంలో స్టేషన్‌ను చేర్చడం వల్ల ఆధునిక సౌకర్యాలు, మెరుగైన రాకపోకలు ఏర్పడి ప్రయాణికులకు మరింత సౌలభ్యం కలుగుతుందని తెలిపారు. అలాగే ఈ అభివృద్ధి వల్ల స్థానిక ప్రజలకు ప్రయోజనం కలగడమే కాకుండా హైదరాబాద్ ప్రాంతంలోని రైల్వే నెట్‌వర్క్ కూడా మరింత బలపడుతుందని పేర్కొన్నారు. కాబట్టి బొల్లారం రైల్వే స్టేషన్ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర రైల్వే మంత్రిని కోరారు.

## ముదిరాజ్ భవనాలకు స్థలం కేటాయించాలి

మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్



తెలంగాణ బ్యూరో/ప్రతినిధి: ప్రతి జిల్లాలో ముదిరాజ్ లకు స్థలం కేటాయించి భవనాలు నిర్మించాలని మెపా ( ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ తెలంగాణ) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్, రాష్ట్ర కమిటీతో పాటు మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు దుండి అశోక్ ముదిరాజ్ మత్స్య పశుసంవర్ధక క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ ను హైదరాబాదులోని మినిస్టర్స్ క్వార్టర్స్ లో కలసి వినతి పత్రం అందజేశారు. అనంతరం మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ... ప్రతి జిల్లాలో ముదిరాజ్ భవనాలు ఏర్పాటు చేసినట్లయితే .. చదువుకున్న విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని ,అలాగే ముదిరాజు విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కొరకు కూడా ఉపయోగించవచ్చు అని అన్నారు. ఎంత చదువు ఉన్నా సరైన శిక్షణ సలహాలు లేకుంటే చదివిన చదువులు నిరర్థకం అన్నారు. అందుకే మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ ఈ విషయంపై ముఖ్యమంత్రి తో మాట్లాడి,బడ్జెట్ సమావేశాల్లో చర్చించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మెపా మహాభాయబాబ్ జిల్లా అధ్యక్షులు దుండి అశోక్ ముదిరాజ్,చెన్న రాములు ముదిరాజ్, బలరాం ముదిరాజ్,పుట్టి రాజు ముదిరాజ్, శ్రీనివాస్,రాజు,రమేష్‌లు పాల్గొన్నారు.




# ఆవిష్కరణలు, పెట్టుబడులకు గ్లోబల్ హబ్‌గా హైదరాబాద్



- ఐటి, ఎలక్ట్రానిక్స్ , ఫార్మా, డిఫెన్స్, ఏవియేషన్ పరిశ్రమలకు నగరం కీలక వేదిక
- ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో రాష్ట్రాన్ని తీర్చిదిద్దాం
- పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఐటి, ఎలక్ట్రానిక్స రంగాలతో పాటు ఫార్మా, డిఫెన్స్, ఏవియేషన్ పరిశ్రమలకు కూడా నగరం కీలక వేదికగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. ఆవిష్కరణలకు, పెట్టుబడులకు గ్లోబల్ హబ్ గా ఎదుగుతోందని చెప్పారు. బ్రిక్స్ దేశాల్లో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులకు అనువైన వాతావరణం, ఆధునిక సాంకేతికతల ప్రభావంపై అధ్యయనం చేయడానికి విచ్చేసిన జర్మన్ ప్రతినిధి బృందం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును కలిసింది. 'గ్లోబల్ బ్రిడ్జెస్' అనే అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. తెలంగాణలో ఉన్న పారిశ్రామిక అవకాశాలు, అంతర్జాతీయ పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై మంత్రి వారితో చర్చించారు. మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా సవాళ్లను ఎదుర్కొనేందుకు వినూత్న విధానాలను అమలు చేయడంలో తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే ముందంజలో ఉందని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు తెలిపారు. పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా, నీటి లభ్యతలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వాల మార్పుతో సంబంధం లేకుండా మెరుగైన పారిశ్రామిక విధానాలను కొనసాగిస్తూ పరిశ్రమలకు స్థిరత్వాన్ని కల్పిస్తున్నామని శ్రీధర్ బాబు వివరించారు. భౌగోళికంగా భారతదేశం నడిబొడ్డున ఉన్న హైదరాబాద్ ఏడాది పొడవునా ఆహ్లాదకర వాతావరణం, విభిన్న సంస్కృతుల సమ్మేళనంతో కూడిన కాస్మోపాలిటన్ జీవనశైలితో ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే వారికి 'సొంత ఊరు' అనే భావన కలిగిస్తోందని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. నగరం దక్షిణ భాగంలో ప్రతిష్ఠాత్మక 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టు వేగంగా రూపుదిద్దుకుంటోందని తెలిపారు. ఇందులో భాగంగా ఏర్పాటవుతున్న ఏఐ సిటీ, నెట్ జీరో సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వంటి ప్రాజెక్టులు రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని అన్నారు. తెలంగాణలో అపారమైన మానవ వనరులు, టాలెంట్ పూల్ అందుబాటులో ఉండటంతో పరిశ్రమలకు నిపుణుల కొరత తలెత్తే సమస్యే ఉండదని స్పష్టం చేశారు. ఇప్పటికే ఉద్యోగాల్లో ఉన్న వృత్తి నిపుణులతో పాటు కొత్తగా ఇంజనీరింగ్ పూర్తి చేసిన యువతను ప్రపంచ స్థాయి సవాళ్లకు సిద్ధం చేయడానికి ప్రభుత్వం స్కిల్లింగ్, రీ-స్కిల్లింగ్ కార్యక్రమాల ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నట్లు శ్రీధర్ బాబు చెప్పారు. సెమీ కండక్టర్ రంగం తెలంగాణలో వేగంగా విస్తరిస్తోందని, చిప్స్ డిజైన్, తయారీ రంగాల్లో తైవాన్, కొరియా సంస్థలు ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించాయని వివరించారు. డేటా సెంటర్ల ఏర్పాటుకు దిగ్గజ కంపెనీలు ముందుకొస్తున్నాయని తెలిపారు. జర్మనీ సాంకేతికత తోడైతే ఇంజనీరింగ్ రంగంలో తెలంగాణ మరింత ముందుకు దూసుకెళ్తుందని శ్రీధర్ బాబు విశ్వాసం వ్యక్తం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 సంవత్సరాలు పూర్తయ్యే 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని శ్రీధర్ బాబు తెలిపారు. ఈ సమావేశంలో జర్మన్ ప్రతినిధి బృందం సభ్యులు డా. స్టెఫాన్ ట్రేగర్, డా. క్రిస్టియన్ అల్టెన్ హోఫెన్, ఫ్రాంక్ బీర్ హోస్ట్, అలెగ్జాండర్ వాన్ క్రామ్, మాల్టె హెహ్ ఫీల్డ్, ఫిలిప్ మేయర్ హోఫర్, మ్యాక్స్ మిల్లన్ వ్యాన్ లెయర్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి కూడా హాజరయ్యారు.

## చర్లపల్లి - కామాఖ్య

# అమృత్ భారత్ ట్రైన్

### అస్సాంలో ప్రారంభించిన ప్రధాని మోడీ



తెలంగాణ బ్యూరోప్రతినిధిః తెలుగు రాష్ట్రాల రైల్వే ప్రయాణికులకు, ముఖ్యంగా హైదరాబాద్ వాసులకు దక్షిణ మధ్య రైల్వే ఒక తీపి కబురు అందించింది. అస్సాం రాజధాని గౌహతి సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కామాఖ్య నుంచి హైదరాబాద్‌లోని చర్లపల్లి టెర్మినల్ వరకు సరికొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు అందుబాటులోకి వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అస్సాంలో ఈ రైలును ప్రారంభించారు. సికింద్రాబాద్, నాంపల్లి స్టేషన్లపై ఒత్తిడి తగ్గించేందుకు అభివృద్ధి చేసిన చర్లపల్లి శాటిలైట్ టెర్మినల్‌కు ఈ రైలు రావడం విశేషం. వందే భారత్ రైళ్ల తరహాలోనే అత్యాధునిక సాంకేతికతతో.. తక్కువ ఖర్చుతో సామాన్యుల కోసం రూపొందించిన రైలే ఈ 'అమృత్ భారత్'. ఈ రైలుకు రెండు వైపులా ఇంజన్లు ఉంటాయి. దీనివల్ల వేగం పుంజుకోవడం సులభం అవుతుంది.. ప్రయాణ సమయం కూడా ఆదా అవుతుంది. ఇందులో కేవలం స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు మాత్రమే ఉంటాయి. తక్కువ ధరలో సుదూర ప్రయాణం చేసే వారికి ఇది వరం అని చెప్పవచ్చు. సెన్సార్ వాటర్ ట్యాప్స్, మొబైల్ ఛార్జింగ్ పాయింట్లు, మెరుగైన సీటింగ్, వెలుతురు వంటి ఆధునిక వసతులు ఇందులో ఉన్నాయి. ఈ రైలు అస్సాం నుంచి బయలుదేరి పశ్చిమ బెంగాల్, ఒడిశా మీదుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను కలుపుతూ సాగుతుంది. మన రాష్ట్రాల్లో ప్రధానంగా శ్రీకాకుళం రోడ్, విజయనగరం జంక్షన్, పెందుర్తి, దువ్వాడ, సామర్లకోట జంక్షన్, రాజమహేంద్రవరం, తణుకు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ, గుంటూరు రైల్వే స్టేషన్లలో ఆగుతుంది. తెలంగాణ రాష్ట్రంలో నల్గొండ రైల్వే స్టేషన్ ఆగుతుంది. ఆ తర్వాత అక్కడ నుంచి చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుతుంది. ఏసీ ప్రయాణం భారం అనుకునే సామాన్యులకు, కూలీలకు, విద్యార్థులకు ఈ రైలు ఎంతో అనుకూలంగా ఉంటుంది. ప్రసిద్ధ శక్తి పీఠం కామాఖ్య అమ్మవారి దర్శనానికి వెళ్లే భక్తులకు నేరుగా రైలు సౌకర్యం లభిస్తుంది. సికింద్రాబాద్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండానే నగరం వెలుపల ఉన్న చర్లపల్లిలో దిగిపోవచ్చు. దీనివల్ల నగరంలోని ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా త్వరగా గమ్యం చేరుకోవచ్చు. ఈ కొత్త రైలుతో ఈశాన్య భారతం , తెలుగు రాష్ట్రాల మధ్య వ్యాపార, పర్యాటక సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయి.

# గ్యాస్ కొరత లేకుండా చూస్తాం

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

తెలంగాణ బ్యూరోప్రతినిధి: దేశవ్యాప్తంగా నెలకొన్న ఇంధన, గ్యాస్ సరఫరా పరిణామాలపై తెలంగాణ ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టింది. అత్యవసర సేవలకు ఎటువంటి ఆటంకం కలగకుండా గ్యాస్ సరఫరాను క్రమబద్ధీకరించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గ్యాస్ సరఫరా అనేది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని గుర్తు చేస్తూ.. ప్రస్తుత పరిస్థితులపై మంత్రి ఉత్తమ్ పలు కీలక వివరాలను వెల్లడించారు. మార్కెట్‌లో కొంత మేర గ్యాస్ కొరత ఉందని కేంద్ర ప్రభుత్వమే స్వయంగా ప్రకటించిందని, దానికి అనుగుణంగా రాష్ట్రాలకు కొన్ని మార్గదర్శకాలను జారీ చేసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఉత్పత్తి పెంపు: ఎల్పీజీ ప్రొడక్షన్‌ను పెంచామని కేంద్రం తెలిపిందని, ఈ నేపథ్యంలో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలతో సమన్వయం కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. కిరోసిన్ సప్లై: తెలంగాణ రాష్ట్రానికి 1740 కిలో లీటర్ల కిరోసిన్ సరఫరా చేస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని మంత్రి పేర్కొన్నారు.

**రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ:** కమాండ్ కంట్రోల్ రూమ్

స్టేట్ లెవల్ కమిటీ: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) నేతృత్వంలో సివిల్ సప్లై కమిషనర్, పోలీస్ అధికారులు, ఇతర ఉన్నతాధికారులతో రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లా స్థాయి కమిటీలు: ప్రతి జిల్లాలో కలెక్టర్, ఎస్పీ, వైద్య అధికారులు ఎల్పీజీ కంపెనీ ప్రతినిధులతో కూడిన కమిటీలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తాయి.

**కమాండ్‌కంట్రోల్ రూమ్**: హైదరాబాద్‌లోని సివిల్ సప్లై కార్యాలయంలో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి, సరఫరాలో అంతరాయాలను నివారిస్తున్నారు.

**హోటల్స్, రెస్టారెంట్ల విజ్ఞప్తి**

తమను కూడా అత్యవసర సేవల కింద గుర్తించి సిలిండర్లు సరఫరా చేయాలని హోటల్, రెస్టారెంట్ యజమానులు చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అత్యవసర సేవలకు గ్యాస్ కొరత లేకుండా చూసే పూర్తి బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుందని ఉత్తమ్ చెప్పారు



# అసెంబ్లీ ప్రశ్నోత్తరాలపై సీఎస్ టెలీకాన్ఫరెన్స్

- సభ్యుల ప్రశ్నలకు వెంటనే సమాధానాలు పంపాలని ఆదేశం
- రెవిన్యూ , నీటిపారుదల, మున్సిపల్, వైద్యం, ఇంధనశాఖ ప్రశ్నలపై ఆరా



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ఈనెల 16 వ తేదీ నుండి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్నందున ఇప్పటి వరకు వచ్చిన ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలు వెంటనే సమర్పించాలని అన్ని విభాగాల ఉన్నతాధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణ రావు ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో పెండింగులో ఉన్న ప్రశ్నలకు రావాల్సిన సమాధానాలు, సమావేశాల నిర్వహణ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శులతో సి.ఎస్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ శాసన మండలి, శాసనసభ సమావేశాల నేపథ్యంలో సభ్యులు అడిగిన ప్రశ్నలన్నింటికీ నేడు శనివారం లోగా సమాధానాలు పంపించాలని అన్నారు. ప్రధానంగా నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ పరిపాలన, ఇంధనశాఖ, రెవిన్యూ తదితర శాఖలకు సంబంధించి అధికంగా ప్రశ్నలున్నాయని, వీటన్నింటికీ వెంటనే సమాధానాలు పంపాలని అన్నారు. బడ్జెట్ సమావేశాలు గవర్నర్ ప్రసంగం తో ప్రారంభమవుతాయన్నారు. బడ్జెట్ సమావేశాల నిర్వహణపై గౌరవ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు ఆదివారం నాడు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో దిగజారిన శాంతి భద్రతలు

- సీఎం రేవంత్ రెడ్డి బినామీ వ్యాపారాలు
- బినామీ వ్యాపారాల కోసం ఆధారాలు మాయం చేస్తున్నారు
- కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు కేటీఆర్ లేఖ



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న బినామీ వ్యాపారాల పైన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా కు భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేఖ రాశారు. రేవంత్ రెడ్డి బినామీ కంపెనీ కె ఎల్ ఎస్ ఆర్ ఇన్‌ఫ్రాటెక్ కంపెనీ పైన నమోదైన కేసులు విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సాక్ష్యాధారాలను తారుమారు చేశారని లేఖలో పేర్కొన్నారు. సేకరించిన సాక్ష్యాధారాలు పోయాయి అని ప్రభుత్వ అధికారులు కోర్టులో చెప్పడం దారుణం. ముఖ్యమంత్రి తన బినామీ కంపెనీ కోసమే అధికారుల పైన ఒత్తిడి తీసుకువచ్చి సాక్ష్యాధారాలను మాయం చేయించారు. రాష్ట్రంలోని విచారణ సంస్థలను పోలీసు అధికారులను నమ్మే పరిస్థితి లేదని లేఖలో రాశారు.తన బినామీ కంపెనీ కోసం సాక్షాధారాలను ముఖ్యమంత్రి మాయం చేయించారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా క్షీణించింది... పోలీస్ వ్యవస్థ పైన ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. ఆ సంస్థ పై ఉన్న విచారణను అడ్డుకుంటున్నాడని కేటీఆర్ ఆరోపణలు చేశారు. కె ఎల్ ఎస్ ఆర్ కంపెనీ పైన ఉన్న ఆర్థిక పరమైన ఆరోపణలు, కేసుల పైన పక్షపాతం లేకుండా, ఒత్తిడి లేకుండా నిష్పాక్షిక విచారణ జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే దివాలా ప్రక్రియ కొనసాగుతున్న కంపెనీ కోసం రేవంత్ రెడ్డి 2500కు పైగా భారీ కాంట్రాక్టులను కేటాయించారు. సాగునీటి, తాగునీటి ప్రాజెక్టులతో పాటు యంగ్ ఇండియా స్కూల్ ప్రాజెక్టులు, రోడ్డు నిర్మాణ పనులను అడ్డగోలుగా రేవంత్ రెడ్డి దివాలా తీసిన ఈ కంపెనీకి అప్పచెబుతున్నారు. కంపెనీ కోసం నేషనల్ లా ట్రిబ్యునల్ విచారణలో కూడా రేవంత్ రెడ్డి జోక్యం చేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి అని కేంద్ర హోం మంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు. హైకోర్టు చివాట్లు పెట్టినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కాబట్టి వెంటనే ఈ కంపెనీ చేస్తున్న నేరాలు, ఈ కంపెనీకి ముఖ్యమంత్రి చేస్తున్న అనుచిత లబ్ది నేపథ్యంలో సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ వంటి ఏజెన్సీలతో సంపూర్ణ దర్యాప్తు చేయించాలని తన లేఖలో కేటీఆర్ స్పష్టం చేశారు.

# హెచ్‌జే దొర మృతి పట్ల తెలుగు రాష్ట్రాల సీఎంల దిగ్భ్రాంతి



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్ జే దొర మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణవార్త దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పోలీసులకు ప్రత్యేకమైన బ్రాండ్‌ను తీసుకురావడంలో హెచ్.జే. దొర కీలక పాత్ర పోషించారని సీఎం పేర్కొన్నారు. ఎన్టీ రామారావు కాలంలో ఇంటెలిజెన్స్ అధికారిగా, తన పాలనలో రాష్ట్ర డీజీపీగా పనిచేస్తూ రాష్ట్రానికి విశేష సేవలు అందించారని గుర్తు చేశారు.రాష్ట్రాన్ని చాలాకాలం వెంటాడిన నక్సల్ సమస్యను ఎదుర్కొనే విషయంలో దొర సమర్థంగా పనిచేశారని సీఎం అన్నారు. ఆయన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. హెచ్.జే. దొర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు సీఎం చంద్రబాబు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**మాజీ డీజీపీ హెచ్.జె.దొర మృతికి సంతాపం : ముఖ్యమంత్రి ఎ.రేవంత్**

మాజీ డీజీపీ హెచ్.జె.దొర మృతికి సంతాపం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి దొర కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో ఇంటెలిజెన్స్ చీఫ్‌గా, డీజీపీగా ఆయన సేవలను గుర్తు చేసుకున్న సీఎం. పోలీసు శాఖలో పలు సంస్కరణలు తీసుకురావడంతో పాటు శాఖను ప్రజలకు చేరువ చేయడంలో ఆయన ఎంతో కృషి చేశారన్న సీఎం.




# హెచ్. జె దొర మృతికి సంతాపం తెలిపిన కేసీఆర్

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: ఉమ్మడి రాష్ట్ర డీజీపీగా పని చేసిన మాజీ పోలీసు ఉన్నతాధికారి, హెచ్ జె దొర మరణం పట్ల తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు.

పోలీస్ శాఖలో పలు హోదాల్లో బాధ్యతలను చేపట్టి, వినూత్న సంస్కరణలు ప్రవేశపెట్టి, శాంతి భద్రతల పరిరక్షణ కోసం హెచ్ జె దొర కృషి చేశారని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. వారి మరణంతో శోకతప్తులైన కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## జల్ జీవన్ మిషన్ రాష్ట్రాల మంత్రులతో

# కేంద్ర మంత్రి వీడియో కాన్ఫరెన్స్

### పాల్గొన్న పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



తెలంగాణ బ్యూరోప్రతినిధిః ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించేందుకు మేము అనేక ప్రతిపాదనలు పంపామని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. కేంద్రమంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్క పాల్గొని మాట్లాడారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు అవసరమైన నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాము. ముఖ్యంగా తాగునీటి సరఫరా వ్యవస్థలను స్థిరీకరించడం, దీర్ఘకాలం కొనసాగించేలా నిర్వహించడం అత్యంత అవసరం. తెలంగాణ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తోంది. ప్రతి సంవత్సరం నిర్వహణ కోసం కూడా వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాము. ఈ నేపథ్యంలో నిర్వహణ వ్యయాల్లో కేంద్ర ప్రభుత్వం కూడా భాగస్వామ్యం కావాలని మనవి చేస్తున్నాము. కేంద్రం అయినా, రాష్ట్రం అయినా తుది లక్ష్యం ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించడం కావాలి. కలుషిత నీరు సరఫరా అయితే అనేక రకాల వ్యాధులు వ్యాపించి ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అందువల్ల ప్రజల ఆరోగ్యం మరియు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జల్ జీవన్ మిషన్ ను మరో రెండు సంవత్సరాలు పొడిగించినందుకు కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నాము. అదే సమయంలో రాష్ట్రాలు అమలు చేస్తున్న తాగునీటి సరఫరా పథకాల నిర్వహణ ఖర్చులను కూడా కేంద్ర ప్రభుత్వం పంచుకోవాలని మేము మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాము. నూతనంగా ఏర్పాటు అవుతున్న ఆవాసాలకు తాగు నీరు అందించేందుకు నూతనంగా ప్రాజెక్టులను టేకప్ చేస్తున్నాము. సోర్స్ పాయింట్ లో డ్రై అయినప్పుడు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నావు. లోకల్ సోర్స్ పాయింట్లను నిర్మిస్తున్నాము. దీనికి సంబంధించి కూడా కేంద్రం తన వంతు సహాయం చేయాలి అని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# నేటి నుంచి పదవ తరగతి పరీక్షలు

### విద్యార్థులకు శుభాకాంక్షలు : మంత్రి పొన్నం ప్రభాకర్





తెలంగాణ బ్యూరోప్రతినిధిః రాష్ట్రంలో నేటి నుండి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్న విద్యార్థులకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.పదవ తరగతి పరీక్షలు విద్యార్థుల జీవితంలో ఒక ముఖ్యమైన దశ అని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. ఇప్పటివరకు చదివిన పాఠాలను పునరావృతం చేసుకుని, సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే తప్పకుండా మంచి ఫలితాలు సాధించగలరని తెలిపారు.రాష్ట్రంలో 2676 సెంటర్లలో 5,28,239 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధికి కట్టుబడి ఉందని, భవిష్యత్తులో వారు ఉన్నత స్థానాలకు చేరుకుని రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్షలు రాయనున్న ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

## మాజీ డీజీపీ హెచ్.జే. దొర మృతిపట్ల కిషన్ రెడ్డి సంతాపం

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్.జే. దొర మరణ వార్త తెలిసి తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నట్లు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రంలో డీజీపీగా వారు చేసిన సేవలు, శాంతిభద్రతలను కాపాడటంలో నీతి, నిజాయితీ, నిబద్ధత, పరిపాలనా సామర్థ్యం ఎప్పటికీ గుర్తుండిపోతాయి. జాతీయ స్థాయిలో కేంద్రంలోనూ సిఐఎస్ఎఫ్ డైరెక్టర్‌గా వారు సేవలందించారని గుర్తు చేశారు. ప్రత్యేకంగా పుట్టపర్తిలో శ్రీ సత్య సాయిబాబా ఆశ్రమానికి దొర చేసిన సేవలు చిరస్మరణీయం ఆయన పేర్కొన్నారు. రిటైర్మెంట్ అనంతరం కూడా పోలీసు వ్యవస్థలో సంస్కరణలకోసం వారు సేవలందించారు. హెచ్. జే దొర మృతి పోలీస్ రంగానికి తీరనిలోటన్నారు. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ దొర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

# హిడ్మా అంచనాలు సరైనవి కావు

- పదవుల కోసం ఎన్నికల్లో పోటీ చేయను
- మాజీ మావోయిస్టు పార్టీ అగ్రనేత దేవ్‌జీ కీలక వ్యాఖ్యలు
- చట్టం పరిధిలో ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని వెల్లడి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : చట్టం పరిధిలో ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని మాజీ మావోయిస్టు పార్టీ అగ్రనేత దేవ్‌జీ ప్రకటించారు. శుక్రవారం ఓ మీడియా ఛానల్ ప్రతినిధితో ఆయన మాట్లాడుతూ.. పదవుల కోసం ఎన్నికల్లో పోటీ చేయబోనని స్పష్టం చేశారు. సమాజంలో దోపిడీ పూర్తిగా తొలగిపోలేదని.. అది రూపం మార్చుకుందని చెప్పుకొచ్చారు. దోపిడీ ఉన్నంతకాలం మావోయిస్టు ఉద్యమం ఉంటుందని వెల్లడించారు. మావోయిస్టు పార్టీపై నిషేధం ఎత్తివేసి, జైళ్లలో ఉన్న మావోయిస్టులను రాజకీయ ఖైదీలుగా గుర్తించి విడుదల చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ సందర్భంగా దేవ్‌జీ మాట్లాడుతూ .. 'ఆపరేషన్ కగార్ యుద్ధం మొదలయ్యే సమయంలో బస్వరాజు చేసిన విజ్ఞప్తిని కేంద్రం పట్టించుకోలేదు. కేంద్రం పట్టించుకోనందునే ప్రతిఘటన అనివార్యమైంది. ఈ పోరాటంలో బస్వరాజును కోల్పోయాం. ఆయన మరణం అనంతరం కొందరు లోపల(అడవుల్లో).. కొందరు బయట(జనంలో) ఉండాలని నిర్ణయించుకున్నాం. ఈ క్రమంలోనే హిడ్మా ఆంధ్రప్రదేశ్ పోలీసుల ఎదుట లొంగిపోవాలనుకున్నారు. విజయవాడలో కొందరు నమ్మకస్తులు(పోలీస్ డిపార్ట్మెంట్‌లో) ఉన్నారని చెప్పారు. మాకు అనుమానం వచ్చి వద్దని వారించాము. కానీ హిడ్మా వినకుండా మాకే సర్దిజెప్పే ప్రయత్నం చేశారు. చాలారోజుల పాటు పరిశీలించి చివరకు ఆయన లొంగిపోయేందుకు అనుమతి ఇచ్చాం. హిడ్మా అంచనాలు సరైనవి కావు. మేము ఊహించిన విధంగానే హిడ్మాను ట్రాప్ చేసి, అరెస్ట్ చేసి, చిత్రహింసలకు గురిచేసి చంపేశారు. ఇది వందశాతం బూటకపు ఎన్‌కౌంటర్' అని దేవ్‌జీ కీలక వ్యాఖ్యలు చేశారు. చివరిసారిగా అగ్రనేత గణపతిని ఎప్పుడు చూశారు? అని మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు దేవ్‌జీ స్పందిస్తూ.. '2023లో చివరి సారిగా కేంద్ర కమిటీ సమావేశం జరిగింది. అప్పుడే గణపతిని చూశాను. ఇక ఆ తర్వాత ఆయన దారిలో ఆయన వెళ్లారు. మళ్లీ కనిపించలేదు' అని దేవ్‌జీ చెప్పుకొచ్చారు. సమాజంలో పరిస్థితులు మారినా పేదరికం, వేధింపులు తగ్గలేదు. దోపిడీ రూపం మారింది.. కానీ ఆగలేదు. ఈ పరిస్థితులపై తాము పోరాటం చేస్తూనే ఉంటామని కీలక ప్రకటన చేశారు.

# ఫైళ్ల పరిష్కారంపై బీసీ కమిషన్ ఛైర్మన్ పరిశీలన

### కార్యాలయ ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించిన జీ. నిరంజన్



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాడు ఖైరతాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయంలో దస్త్రాల పరిష్కారం మరియు పరిసరాల శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, సభ్య కార్యదర్శి బి. బాల మాయా దేవి పాల్గొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటి డైరెక్టర్ యు. శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి కె. మనోహర్ రావు, ప్రత్యేక అధికారి కుమారి ఎన్. సునీత, సెక్షన్ ఆఫీసర్లు జి. సతీష్ కుమార్, ఇర్ఫాన్ ఖాన్, ఇతర సిబ్బంది కూడా పాల్గొన్నారు. ఇందులో భాగంగా కమిషన్ ఛైర్మన్, సభ్యులు, సభ్య కార్యదర్శి మరియు అధికారులు, కార్యాలయ ఆవరణం మొత్తం పరిశీలించి పరిసరాల శుభ్రత కొరకు తీసుకోవాల్సిన చర్యలను గుర్తించారు. ఈ పనులను రానున్న వారం రోజుల్లో పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ జి. నిరంజన్ మాట్లాడుతూ కార్యాలయ ఆవరణను పరిశుభ్రంగా మరియు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంచుకోవాలని సిబ్బందిని కోరారు. ఈ 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న దస్త్రాలను పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

**గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్** GHMC

సర్కిల్-20, జల్‌పల్లి, 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

నిట్ నెం.07/EEC-17/JLPY/GHMC/2025-26, తేది: 13-03-2026

**పని పేరు:** పని సంఖ్య 01 కోసం: "శంషాబాద్ జోన్, జల్‌పల్లి సర్కిల్-17 పరిధిలోని వివిధ వార్డులలో గల ఈద్గాల వద్ద రంజాన్ పండుగ ఏర్పాట్లు". **అంచనా వ్యయం : 5.00 లక్షలు. బిడ్స్ స్వీకరణకు చివరి తేది మరియు సమయం:** 16-03-2026 ఉ॥ 11.30 గం॥లకు. **అధికారి పేరు మరియు చిరునామా:** శ్రీ కె. శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జల్‌పల్లి, సర్కిల్ - 17, GHMC, తదుపరి వివరములను ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-17, జల్‌పల్లి, GHMC

DIPR.RO.No.16962-PP/CL/Advt/1/2025-26 , Dt: 13-03-2026

# సంపాదకీయం

suryaeditpage@gmail.com

## కారుణ్య మరణం-చారిత్రాత్మక తీర్పు

'కారుణ్య మరణం' అనే అంశం మానవత్వానికి, చట్టానికి మధ్య జరిగే ఒక పెద్ద సంఘర్షణ. ఇటీవల ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన హరీష్ రాణా అనే 32 ఏళ్ల యువకుడి విషయంలో భారత సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. 2013లో చండీగఢ్‌లో చదువుకుంటున్న సమయంలో ఒక భవనం నాలుగో అంతస్తు నుండి ప్రమాదవశాత్తు కింద పడిపోవడంతో హరీష్ తలకు తీవ్ర గాయమైంది, అప్పటి నుండి అంటే దాదాపు 13 ఏళ్లుగా అతను కోమాలో, స్పృహ లేని స్థితిలో మంచానికే పరిమితమయ్యాడు. అతని తల్లిదండ్రులు తమ సర్వస్వాన్ని ధారపోసి చికిత్స చేయించినప్పటికీ ఎటువంటి ఫలితం లేకపోగా, తన కొడుకు పడుతున్న నరకాన్ని చూడలేక అతనికి కారుణ్య మరణం ప్రసాదించాలని కోర్టును ఆశ్రయించారుసుప్రీంకోర్టు ధర్మాసనం ఈ కేసును అత్యంత సునిశితంగా పరిశీలించి, హరీష్‌ను కృత్రిమంగా బతికించడం అతని గౌరవప్రదమైన జీవన హక్కుకు విరుద్ధమని భావించింది. వైద్య మండలి నివేదికల ప్రకారం అతని ఆరోగ్యం మెరుగుపడే అవకాశం లేదని నిర్ధారణ కావడంతో, అతనికి ఆహారం, నీరు అందించే గొట్టాలను తొలగించి ప్యాసివ్ ఇచ్ఛామరణానికి అనుమతినిచ్చింది. ఇది కేవలం మరణాన్ని ఎంచుకోవడం కాదని, కోలుకునే అవకాశం లేని వ్యక్తికి కృత్రిమ పద్ధతుల ద్వారా జీవకాలాన్ని పొడిగించి హింసించకుండా ఉండటమని కోర్టు అభిప్రాయపడింది. గౌరవప్రదంగా జీవించే హక్కులోనే, గౌరవప్రదంగా మరణించే హక్కు కూడా అంతర్భాగమని కోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ఈ తీర్పును మనం విశ్లేషిస్తే దీనిలో మంచి, చెడు అనే రెండు కోణాలు కనిపిస్తాయి. ఒక కోణంలో చూస్తే ఇది మానవత్వంతో కూడిన నిర్ణయం. 13 ఏళ్లుగా కదల్లేని స్థితిలో, తన బాధను కూడా చెప్పుకోలేని స్థితిలో ఉన్న హరీష్‌కు ఇది ఒక రకమైన విముక్తి అని చెప్పవచ్చు. అతని వృద్ధ తల్లిదండ్రులు అనుభవిస్తున్న మానసిక, ఆర్థిక వేదనను దృష్టిలో ఉంచుకుంటే ఇది సరైన నిర్ణయమే అనిపిస్తుంది. వైద్య విజ్ఞానం విఫలమైన చోట, కేవలం యంత్రాల సహాయంతో ప్రాణాన్ని నిలబెట్టడం ఆ వ్యక్తికి చేసే మేలు కంటే కలిగించే అశాంతే ఎక్కువ.

అయితే మరో కోణంలో చూస్తే ఇది కొన్ని ఆందోళనలను కూడా కలిగిస్తుంది. ఇచ్ఛామరణానికి చట్టబద్ధమైన అనుమతులు ఇవ్వడం వల్ల భవిష్యత్తులో దీనిని దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. కుటుంబ సభ్యులు ఆర్థిక భారంగా భావించి లేదా ఆస్తుల కోసం ఇటువంటి అభ్యర్థనలు చేసే అవకాశం లేకపోలేదు. ప్రాణం పోసే శక్తి లేని మనిషికి, ప్రాణం తీసే హక్కు ఉందా అనే నైతిక ప్రశ్న ఎప్పుడూ ఉంటుంది. అయినప్పటికీ, హరీష్ రాణా కేసులో కోర్టు విధించిన కఠినమైన నిబంధనలు, వైద్య నిపుణుల పర్యవేక్షణ ఇటువంటి దుర్వినియోగాన్ని అడ్డుకుంటాయి. అంతిమంగా, కోలుకోలేని స్థితిలో ఉన్న రోగికి నరకప్రాయమైన జీవితం నుండి గౌరవప్రదమైన ముగింపునివ్వడం అనేది కచ్చితంగా ఒక సాహసోపేతమైన, సానుకూలమైన అడుగుగానే భావించవచ్చు.

హరీష్ రాణా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ చారిత్రాత్మక తీర్పు కేవలం ఒక వ్యక్తికి సంబంధించినది మాత్రమే కాదు, ఇది భారతదేశ న్యాయ వ్యవస్థలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. 2026 మార్చి 11న వెలువడిన ఈ తీర్పు ద్వారా దేశంలో మొట్టమొదటిసారిగా ఒక వ్యక్తికి ప్యాసివ్ ఇచ్ఛామరణాన్ని ఆచరణలో అమలు చేయడానికి న్యాయస్థానం అనుమతించింది. గతంలో 2018లో వచ్చిన కామన్ కాజ్ తీర్పు గౌరవప్రదంగా మరణించే హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించినప్పటికీ, ఒక నిర్దిష్ట కేసులో ఇన్ని ఏళ్ల తర్వాత దాన్ని అమలు చేయడం ఇదే మొదటిసారి. హరీష్ రాణా విషయంలో ఢిల్లీ హైకోర్టు గతంలో ఇచ్చిన ప్రతికూల తీర్పును సుప్రీంకోర్టు తప్పుబట్టింది. ఒక వ్యక్తి వెంటిలేటర్ వంటి యంత్రాల మీద లేనంత మాత్రాన అతనికి ఇచ్ఛామరణం నిరాకరించకూడదని, గొట్టాల ద్వారా అందించే ఆహారం, నీరు కూడా వైద్య చికిత్స కిందికే వస్తాయని కోర్టు స్పష్టం చేసింది.

ఈ తీర్పు వెనుక ఉన్న మానవీయ కోణాన్ని గమనిస్తే, న్యాయమూర్తులు జె.బి. పార్దివాలా, కె.వి. విశ్వనాథన్‌లు ఈ విషయాన్ని అత్యంత భావోద్వేగంతో విశ్లేషించారు. జీవితంలో మరణం కంటే గొప్ప విషాదం ఒక వ్యక్తిని వదిలేయడం (అబాండన్‌మెంట్) అని, కానీ హరీష్ తల్లిదండ్రులు గత 13 ఏళ్లుగా తమ బిడ్డను అంటిపెట్టుకుని చేసిన సేవ అనన్యసామాన్యమని కొనియాడారు. హరీష్‌కు ఆహారం నిలిపివేయడం అనేది అతన్ని చంపడం కాదని, కోలుకునే అవకాశం లేని స్థితిలో కృత్రిమంగా ప్రాణాన్ని లాగడం కంటే ప్రకృతి సిద్ధమైన మరణానికి అతన్ని అనుమతించడమే ఉత్తమమని వారు అభిప్రాయపడ్డారు. ఈ ప్రక్రియను ఢిల్లీలోని ఎయిమ్స్ పాలియేటివ్ కేర్ సెంటర్‌లో అత్యంత గౌరవప్రదంగా, ఎటువంటి నొప్పి లేకుండా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు.

చట్టపరంగా చూస్తే ఈ తీర్పు ఎన్నో కొత్త మార్పులకు దారి చూపింది. భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రతి కుటుంబం కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, జిల్లా స్థాయిలో వైద్య మండళ్లను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ప్యాసివ్ ఇచ్ఛామరణం విషయంలో ఉన్న నిబంధనలను మరింత సరళతరం చేస్తూ, 30 రోజుల వేచి ఉండే కాలాన్ని కూడా ఈ కేసులో కోర్టు తొలగించింది. అంటే వైద్యపరంగా ఇక కోలుకోవడం అసాధ్యమని తేలినప్పుడు, ఆ వ్యక్తి పడుతున్న వేదనను పొడిగించడం కంటే త్వరగా నిర్ణయం తీసుకోవడమే సరైనదని కోర్టు భావించింది. ఇది వైద్య విజ్ఞానం, చట్టం, మానవత్వాల మధ్య ఉన్న సున్నితమైన సరిహద్దులను సరికొత్తగా నిర్వచించింది.

హరీష్ రాణా కేసులో వెలువడిన ఈ తీర్పు కేవలం ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికో లేదా ఒక కుటుంబానికో పరిమితం కాకుండా దేశవ్యాప్త చర్చకు పునాది వేసింది. ముఖ్యంగా 32 ఏళ్ల యువకుడు తన జీవితంలో అత్యంత కీలకమైన పాలాన్ని కోమాలోనే గడిపేయడం, అతని తల్లిదండ్రులు తమ శక్తినంతా ధారపోసి సేవ చేయడం వంటి అంశాలు న్యాయమూర్తుల మనసును కదిలించాయి. ఈ తీర్పు ద్వారా ప్యాసివ్ ఇచ్ఛామరణం అంటే ఏమిటో సామాన్యులకు కూడా అర్థమయ్యేలా కోర్టు వివరించింది. రోగికి ప్రాణాధారమైన మందులు, కృత్రిమ శ్వాస, ఆహారం అందించే గొట్టాలను తొలగించడం ద్వారా ప్రకృతి సిద్ధమైన మరణానికి మార్గం సుగమం చేయడమే దీని ఉద్దేశమని స్పష్టం చేసింది. ఇది ప్రాణాన్ని తీయడం కాదు, మరణాన్ని ఆపకుండా వదిలేయడమని కోర్టు చేసిన వ్యాఖ్యలు అత్యంత లోతైన అర్థాన్ని కలిగి ఉన్నాయి.

సామాజిక కోణంలో చూస్తే ఈ తీర్పు వల్ల ఎంతోమంది దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగుల కుటుంబాలకు ఒక ఊరట లభించింది. వైద్యం పేరుతో లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తూ, రోగి కోలుకోడని తెలిసినా కేవలం యంత్రాల మీద బతికించడం వల్ల అటు రోగికి నరకం, ఇటు కుటుంబానికి ఆర్థిక పతనం సంభవిస్తాయి. హరీష్ రాణా విషయంలో అతని తండ్రి పడిన వేదనను కోర్టు గుర్తించి, ఒక మనిషిని కేవలం మాంసం ముద్దలా పడి ఉండనివ్వడం కంటే అతనికి గౌరవప్రదమైన వీడ్కోలు పలకడమే మేలని భావించింది. ఇది ఒక రకంగా సామాజిక బాధ్యతతో కూడిన నిర్ణయం అని చెప్పవచ్చు, ఎందుకంటే వైద్య వనరులను కోలుకునే అవకాశం ఉన్న వారి కోసం ఉపయోగించే వీలు కూడా దీనివల్ల కలుగుతుంది.

మరోవైపు ఈ తీర్పు అమలు తీరుపై కూడా కోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. హరీష్ రాణాను ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించి, అక్కడ నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ఎటువంటి నొప్పి లేకుండా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించింది. ప్యాసివ్ ఇచ్ఛామరణం పొందే వ్యక్తికి చివరి నిమిషంలో ఎటువంటి బాధ కలగకూడదనే ఉద్దేశంతో పాలియేటివ్ కేర్ విభాగాన్ని రంగంలోకి దించింది. ఇది న్యాయ వ్యవస్థ కేవలం తీర్పులు చెప్పడమే కాకుండా, ఆ తీర్పు అమలులో మానవీయతను ఎలా కాపాడుతుందో నిరూపించింది. ఈ నిర్ణయం వల్ల భవిష్యత్తులో వైద్యులు కూడా ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో నిర్ణయాలు తీసుకోవడానికి చట్టపరమైన రక్షణ లభించినట్లయింది. ఇచ్ఛామరణం అనేది ఒక వ్యక్తికి తన జీవితంపై ఉండే అత్యున్నతమైన హక్కుగా మారుతోంది. చనిపోయే హక్కు కంటే కూడా గౌరవంగా నిష్క్రమించే హక్కును ఇది బలపరుస్తోంది. సమాజంలో దీనిపై భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, హరీష్ రాణా వంటి అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్న వారికి ఇది ఒక విముక్తి ప్రసాదించే వరంగానే భావించవచ్చు. చట్టం తన కఠినత్వాన్ని పక్కన పెట్టి మానవీయ కోణంలో స్పందించినప్పుడే ఇటువంటి గొప్ప తీర్పులు సాధ్యమవుతాయి. ఇది మన దేశ న్యాయ చరిత్రలో ఒక నూతన అధ్యాయానికి నాంది

టం ఏమిటి?


# పెట్రోడాలర్ భవిష్యత్తు ఎటు?

- ప్రపంచ ఆర్థిక ఆధిపత్యం వహిస్తున్న అమెరికాకు ఒక పెద్ద పరీక్ష
- అంతర్జాతీయ చమురు వ్యాపారమంతా డాలర్లలోనే జరగాలన్న నియమానికి గండీ
- అదే జరిగితే అమెరికా ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన పెట్రోడాలర్ వ్యవస్థ కుదేలు
- యుద్ధ వ్యూహాల్లో ఆశించిన ఫలితాలను సాధించలేకపోయిన అగ్రరాజ్యం
- తాజా గా పెట్రోడాలర్ అంతరించిపోకుండా కాపాడుకోవడానికి తీవ్రంగా పోరాడాల్సిన పరిస్థితి




తేజస్విని
హైదరాబాద్

రాజకీయాల్లో ఇరాన్ మరియు ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం కేవలం రెండు దేశాల మధ్య ఘర్షణగానే కాకుండా, అమెరికా దశాబ్దాలుగా అనుభవిస్తున్న ప్రపంచ ఆర్థిక ఆధిపత్యానికి ఒక పెద్ద పరీక్షగా మారింది. అమెరికా ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన పెట్రోడాలర్ వ్యవస్థ, అంటే అంతర్జా తీయ చమురు వ్యాపారమంతా డాలర్లలోనే జరగాలనే నియమం, ఇప్పుడు తీవ్రమైన ఒత్తిడికి లోనవుతోంది. మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఈ అస్థిరత కారణంగా చమురు ఉత్పత్తి చేసే దేశాలు తమ భవిష్యత్తుపై ఆందోళన చెందు తూ, అమెరికా కరెన్సీపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని ఆలోచిస్తున్నాయి.



ఈ యుద్ధ వ్యూహాల్లో అమెరికా ఆశించిన ఫలితాలను సాధించలేకపోవడం ఆ దేశ ప్రతిష్టను మసకబారుస్తోంది. ఇరాన్‌లో ప్రభుత్వ మార్పును తీసుకురావడంలో వైఫల్యం, అణు ఇంధనాన్ని నియంత్రించలేకపోవడం, మరియు తన మిత్ర దేశాలైన గల్ఫ్ రాజ్యాలకు పూర్తిస్థాయి రక్షణ కల్పిం చడంలో ఎదురవుతున్న ఇబ్బందులు అమెరికా బలహీనతను ఎత్తిచూపుతు న్నాయి. ఒకప్పుడు ప్రపంచాన్ని తన వేలిసైగతో శాసించిన అగ్రరాజ్యం, ఇప్పుడు తన సొంత మద్దతుదారుల నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి మరియు పెట్రోడాలర్ అంతరించిపోకుండా కాపాడుకోవడానికి తీవ్రంగా పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**అమెరికా పెట్రోడాలర్ వ్యవస్థ విచ్ఛిన్నం :**

పెట్రోడాలర్ వ్యవస్థ అనేది అమెరికా ప్రపంచాన్ని శాసించడానికి ఉపయోగించిన అతిపెద్ద ఆర్థిక ఆయుధం. 1970లలో సౌదీ అరేబియాతో చేసుకున్న ఒప్పందం ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా చమురు అమ్మకాలు కేవలం డాలర్లలోనే జరగాలి. దీనివల్ల ప్రతి దేశం తన వద్ద డాలర్ నిల్వలను ఉంచుకోవడం తప్పనిసరి అయింది. కానీ ప్రస్తుత ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధం ఈ నమ్మకాన్ని పూర్తిగా దెబ్బతీసింది. అమెరికా తన మిత్రదేశాలను కాపాడుకోలేకపోవడంతో, ఆ దేశాలు డాలర్ పై ఆధారపడటాన్ని ప్రమాదకరంగా భావిస్తున్నాయి.

ఈ యుద్ధం వల్ల గల్ఫ్ దేశాలు తమ చమురును ఇతర కరెన్సీలలో విక్రయించడానికి సిద్ధపడుతున్నాయి. చైనా, రష్యా వంటి దేశాలు ఇప్పటికే తమ సొంత కరెన్సీలలో వాణిజ్యం చేయడానికి ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి. పెట్రో డాలర్ వ్యవస్థ కూలిపోతే, అంతర్జాతీయ మార్కెట్లో డాలర్ కు ఉన్న విపరీతమైన డిమాండ్ ఒక్కసారిగా పడిపోతుంది. ఇది అమెరికా ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసి, ఆ దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసే ప్రమాదం ఉంది. చమురు క్షేత్రాలపై ఇరాన్ ప్రభావం పెరగడం, అమెరికా తన నావికాదళంతో ఆ ప్రాంతాన్ని నియంత్రించలేకపోవడం డాలర్ పతనానికి ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. ఒకవేళ సౌదీ అరేబియా వంటి దేశాలు అధికారికంగా పెట్రో డాలర్ ఒప్పందం నుండి తప్పుకుంటే, అమెరికా తన ఆర్థిక ఆధిపత్యాన్ని శాశ్వతంగా కోల్పోతుంది. ఈ యుద్ధం ఆ పతనానికి ఒక ప్రారంభ బిందువుగా మారి, అమెరికాకు ఒక తీరని విపత్తును తెచ్చిపెడుతోంది.

**రాజకీయ వ్యూహాల వైఫల్యం :**

మధ్యప్రాచ్యంలో తనకు అనుకూలమైన కీలుబొమ్మ నాయకులను ప్రతిష్టించి, ఆ ప్రాంతాన్ని తన అదుపులో ఉంచుకోవాలన్న అమెరికా కల ఈ యుద్ధంతో కరిగిపోయింది. ఇరాన్ లో రెజీమ్ చేంజ్ లేదా ప్రభుత్వ మార్పు తీసుకురావడానికి అమెరికా దశాబ్దాలుగా ప్రయత్నిస్తోంది. కానీ, ప్రస్తుత ఉద్రిక్తతల సమయంలో ఇరాన్ ప్రభుత్వం మరింత బలోపేతం అవ్వడమే కాకుండా, ప్రజల మద్దతును కూడా భారీగా కూడగట్టుకుంది. అమెరికా పన్నిన పన్నాగాలేవీ ఇక్కడ పారలేదు. అమెరికా మద్దతుతో ఇరాన్ లో అంతర్గత నిరసనలు రేకెత్తించి, అస్థిరత సృష్టించాలన్న ప్రయత్నాలు కూడా విఫలమయ్యాయి. అక్కడి ప్రజలు విదేశీ శక్తుల జోక్యాన్ని నిరసిస్తూ తమ దేశ సార్వభౌమత్వానికి అండగా నిలిచారు. ఇది అమెరికా గూఢచార సంస్థల వైఫల్యాన్ని స్పష్టం చేస్తోంది. ఇరాన్ ను బలహీనపరచాలనుకున్న అమెరికా వ్యూహం రివర్స్ అయ్యి, ఆ దేశమే

**ప్రపంచ ఆర్థిక ఆధిపత్యం వహిస్తున్న అమెరికాకు ఒక పెద్ద పరీక్ష**

అంతర్జాతీయ చమురు వ్యాపారమంతా డాలర్లలోనే జరగాలన్న నియమానికి గండీప్రాంతీయ శక్తిగా ఎదగడానికి ఈ యుద్ధం దోహదపడింది.

మరోవైపు, ఇరాన్ అణు సామర్థ్యాన్ని దెబ్బతీయడంలో కూడా అమెరికా విఫలమైంది. యురేనియం నిల్వలను నియంత్రించలేకపోవడం, ఇరాన్ క్షిపణి సాంకేతికతను అడ్డుకోలేకపోవడం అమెరికాకు ఒక పెద్ద అవమానంగా పరిణమించింది. తన మద్దతుదారులైన ఇజ్రాయెల్ మరియు గల్ఫ్ దేశాలకు పూర్తి భద్రత కల్పించడంలో అమెరికా తడబడటం, ఆ దేశ సైనిక శక్తిపై ఉన్న భ్రమలను తొలగించింది. ఇది అమెరికా దౌత్య చరిత్రలో ఒక చీకటి అధ్యాయంగా మిగిలిపోనుంది.

**అణు ఇంధన నియంత్రణలో వైఫల్యం :**

అమెరికా ఇరాన్‌పై దశాబ్దాలుగా విధిస్తున్న ఆంక్షల ప్రధాన ఉద్దేశ్యం ఆ దేశం యురేనియంను శుద్ధి చేయకుండా అడ్డుకోవడం. కానీ, ప్రస్తుత యుద్ధ వాతావరణంలో ఇరాన్ తన అణు కార్యక్రమాలను మరింత వేగవంతం చేసింది. అమెరికా తన అత్యాధునిక గూఢచార వ్యవస్థలు , ఉపగ్రహాల ద్వారా నిఘా పెట్టినప్పటికీ, ఇరాన్ భూగర్భ కేంద్రాలలో యురేనియం నిల్వలను పెంచుకుంటూ పోతోంది. ఇది అమెరికా యొక్క అంతర్జాతీయ పట్టును , ఒప్పందాలను అమలు చేసే శక్తిని ప్రశ్నిస్తోంది. అమెరికా తన మిత్రదేశాలకు ఇచ్చిన హామీ ఏమిటంటే, ఇరాన్ ఎప్పటికీ అణు శక్తిగా ఎదగకుండా చూస్తామని. కానీ ఇప్పుడు ఇరాన్ అణు సామర్థ్యం పెరగడం వల్ల ఇజ్రాయెల్ వంటి దేశాల్లో భయాందోళనలు మొదలయ్యాయి. ఈ వైఫల్యం వల్ల అమెరికా తన మిత్రుల దృష్టిలో నమ్మకాన్ని కోల్పోతోంది. యురేనియం నిల్వలను అదుపు చేయలేకపోవడం అంటే, మధ్యప్రాచ్యంలో అమెరికా సైనిక ఆధిపత్యం ముగిసిపోవడానికి సంకేతం అని నిపుణులు భావిస్తున్నారు. ఈ పరిణామం పెట్రోడాలర్‌కు మరో కోణంలో ముప్పుగా మారింది. ఇరాన్ వంటి దేశం అణు సామర్థ్యంతో బలోపేతమైతే, ఆ ప్రాంతంలోని ఇతర దేశాలు కూడా అమెరికా రక్షణ కంటే సొంత అణు సామర్థ్యంపైనే నమ్మకం పెంచుకుంటాయి. దీనివల్ల అమెరికా చెప్పినట్లు వినాల్సిన అవసరం ఆ దేశాలకు ఉండదు. తత్ఫలితంగా, డాలర్ వాడకాన్ని తగ్గించి తమకు నచ్చిన కరెన్సీలో వ్యాపారం చేసుకునే ధైర్యం వారికి వస్తుంది. ఇది అమెరికాకు ఒక కోలుకోలేని దెబ్బ.

**ప్రజా వ్యతిరేకతను సృష్టించడంలో అసమర్థత:**

అమెరికా ఏ దేశాన్నైనా లొంగదీసుకోవడానికి వాడే వ్యూహం అంతర్గత నిరసనలు. ఇరాన్ ప్రజలను ప్రభుత్వంపైకి ఉసిగొల్పి, నిరసనల ద్వారా వ్యవస్థను కుప్పకూల్చాలని అమెరికా పన్నని పన్నాగం లేదు. కానీ, ప్రస్తుత ఇరాన్– ఇజ్రాయెల్ యుద్ధం సమయంలో ఇరాన్ ప్రజలు తమ విభేదాలను పక్కన పెట్టి దేశం కోసం ఏకమయ్యారు. అమెరికా ఆశించినట్లుగా ప్రజలు వీధుల్లోకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడలేదు, ఇది అమెరికా సామాజిక వ్యూహాల వైఫల్యాన్ని చాటిచెప్పింది. అమెరికా మీడియా మరియు ప్రచార యంత్రాంగం ఇరాన్ గురించి ఎంత ప్రతికూలంగా ప్రచారం చేసినా, క్షేత్ర స్థాయిలో అది పని చేయలేదు. కీలుబొమ్మ నాయకుడిని ప్రతిష్టించాలన్న అమెరికా ప్రయత్నం హాస్యాస్పదంగా మారింది, ఎందుకంటే ఆ నాయకుడికి ఇరాన్ ప్రజల్లో కనీస మద్దతు కూడా లభించలేదు. విదేశీ శక్తుల మద్దతుతో వచ్చే నాయకుడిని ప్రజలు తిరస్కరించడం అమెరికాకు ఒక పెద్ద షాక్ అని చెప్పవచ్చు. ఈ విఫలయత్నం వల్ల అమెరికా ప్రతిష్ట ప్రపంచవ్యాప్తంగా దెబ్బతింది. ఒకప్పుడు ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో తలదూర్చి ప్రభుత్వాలను మార్చిన అమెరికా, ఇప్పుడు ఇరాన్ విషయంలో కనీసం ప్రజల మద్దతును కూడా పొందలేకపోయింది. దీనివల్ల అమెరికా మద్దతుదారులు కూడా ఆందోళన చెందుతున్నారు. తమ దేశాల్లో కూడా ఏదైనా సమస్య వస్తే అమెరికా ఇలాగే విఫలమవుతుందా అన్న అనుమానం వారిలో మొదలైంది. ఇది అమెరికాకు దౌత్యపరంగా ఒక విపత్తు.

**అగ్రరాజ్య పతనం , కొత్త ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఆవిర్భావం:**

పెట్రోడాలర్ పతనం అనేది కేవలం అమెరికా సమస్య మాత్రమే కాదు, ఇది ప్రపంచ ఆర్థిక క్రమంలో ఒక పెద్ద మార్పుకు దారితీస్తోంది. అమెరికా తన డాలర్ శక్తిని ఉపయోగించి రష్యా , ఇరాన్ వంటి దేశాలపై ఆంక్షలు విధించడం వల్ల, ఆ దేశాలు డాలర్ లేని కొత్త ఆర్థిక వ్యవస్థను నిర్మించుకున్నాయి. ఇప్పుడు గల్ఫ్ దేశాలు కూడా ఈ బాటలోనే పయనిస్తున్నాయి. ఇది అమెరికా ఆధిపత్యానికి ముగింపు పలికే ప్రక్రియలో ఒక కీలక ఘట్టం.

ఈ యుద్ధం వల్ల అమెరికా తన మిత్రదేశాలైన సౌదీ అరేబియా , ఇతర అరబ్ దేశాలను సంప్రదాయ పద్ధతుల్లో నియంత్రించలేకపోతోంది. వారు చైనా , రష్యాలతో చేతులు కలపడం వల్ల డాలర్ విలువ పడిపోయే ప్రమాదం ఉంది. అమెరికా ఆర్థిక వ్యవస్థ దిగుమతులపై ఆధారపడి ఉంటుంది , డాలర్ విలువ తగ్గితే ఆ దేశంలో ద్రవ్యోల్బణం పెరిగి సామాన్య ప్రజల జీవితం దుర్భరంగా మారుతుంది. ఇది అమెరికాను అంతర్గతంగా బలహీనపరుస్తుంది.

చివరగా, అమెరికా భవిష్యత్తులో తిరిగి పుంజుకోవడానికి ప్రయత్నించినా, ప్రపంచం ఇప్పుడు బహుళ ధ్రువాలుగా మారిపోయింది. కేవలం ఒకే దేశం ప్రపంచాన్ని శాసించే రోజులు పోయాయి. పెట్రోడాలర్ స్థానంలో వివిధ దేశాల కరెన్సీలు లేదా డిజిటల్ కరెన్సీలు వచ్చే అవకాశం ఉంది. ఈ యుద్ధం అమెరికాకు ఒక హెచ్చరిక లాంటిది. తన అహంకారాన్ని వీడి మారుతున్న కాలానికి అనుగుణంగా మారకపోతే, అగ్రరాజ్యం అన్న హోదా చరిత్ర పుటల్లో కలిసిపోవడం ఖాయం.

**అమెరికా భవిష్యత్ పోరాటం :**



ఇన్ని వైఫల్యాలు ఎదురైనప్పటికీ, అమెరికా భవిష్యత్తులో తిరిగి పుంజుకోవడానికి తన శాయశక్తులా ప్రయత్నిస్తుంది. తన పెట్రోడాలర్ వ్యవస్థను మరియు అంతర్జాతీయ హోదాను కాపాడుకోవడానికి అమెరికా కొత్త సైనిక మరియు ఆర్థిక వ్యూహాలను సిద్ధం చేస్తోంది. గల్ఫ్ దేశాలకు అత్యాధునిక రక్షణ వ్యవస్థల ను విక్రయించడం ద్వారా, వారిని తిరిగి తన దారిలోకి తెచ్చుకోవాలని చూస్తోం ది. తన మద్దతుదారులను వదులుకుంటే అమెరికా ప్రపంచ శక్తిగా నిలబడలే దని దానికి బాగా తెలుసు. భవిష్యత్తులో అమెరికా మరిన్ని ఆర్థిక ఆంక్షలను ఆయుధాలుగా వాడుకునే అవకాశం ఉంది. డాలర్ వాడకం తగ్గకుండా ఉండటానికి మిత్రదేశాలపై ఒత్తిడి తీసుకురావడం, అలాగే ఇరాన్ కు మద్దతు ఇచ్చే దేశాలను ఆర్థికంగా దెబ్బతీయడం వంటి చర్యలు చేపట్టవచ్చు. సైనిక పరంగా తన ఉనికిని చాటుకోవడానికి చిన్న తరహా దాడులు లేదా గూఢచార కార్యకలాపాలను ముమ్మరం చేసే అవకాశం ఉంది. అయితే, మారుతున్న ప్రపంచ క్రమంలో ఇది ఎంతవరకు సాధ్యమనేది ప్రశ్నార్థకమే. అమెరికా తన మద్దతుదారులను రక్షించుకోలేకపోతే, ఆ దేశాలు చైనా లేదా రష్యా వైపు వెళ్లే ప్రమాదం ఉంది. దీనిని అడ్డుకోవడానికి అమెరికా తన దౌత్య నీతిని పూర్తిగా మార్చుకోవాల్సి ఉంటుంది. పెట్రోడాలర్ భవిష్యత్తు ఇప్పుడు ఒక సందిగ్ధావస్థలో ఉంది, ఒకవేళ అమెరికా ఈ యుద్ధం తర్వాత తన పట్టును నిరూపించుకోలేకపోతే, ప్రపంచ ఆర్థిక చరిత్రలో డాలర్ ఒక సాధారణ కరెన్సీగా మిగిలిపోతుంది. ఈ పోరాటం అమెరికా మనుగడకే ఒక సవాలుగా మారింది.

**మిత్రదేశాల రక్షణ , నమ్మకాన్ని పునరుద్ధరించడం**

అమెరికా తన మిత్రదేశాలైన సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మరియు ఇతర గల్ఫ్ దేశాలకు భద్రతా హామీని మళ్లీ బలోపేతం చేయడం ద్వారా తన పోరాటాన్ని ప్రారంభిస్తుంది. ఇరాన్ ముప్పు నుండి వారిని రక్షించడానికి అత్యాధునిక క్షిపణి రక్షణ వ్యవస్థలను (ఉదాహరణకు థాడ్ లేదా పేట్రియాట్ క్షిపణులు) ఆ ప్రాంతంలో మోహరిస్తుంది. దీనివల్ల అమెరికా రక్షణ కవచం లేకుండా తాము మనుగడ సాగించలేమని ఆ దేశాలు భావించేలా చేస్తుంది. అమెరికా తన మిత్రదేశాలతో కలిసి ఉమ్మడి సైనిక విన్యాసాలను ముమ్మరం చేస్తుంది. ఇది ఇరాన్ వంటి ప్రత్యర్థులకు హెచ్చరికగా ఉండటమే కాకుండా, తన మిత్రులకు అమెరికా సైనిక శక్తిపై ఉన్న సందేహాలను నివృత్తి చేస్తుంది. ఈ విధంగా నమ్మకాన్ని పునర్నిర్మించడం ద్వారా, అమెరికా తన ప్రాదేశిక పట్టును మరియు పెట్రోడాలర్ పునాదులను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తుంది.

**పెట్రోడాలర్ పరిరక్షణ , ఆర్థిక యుద్ధ తంత్రాలు**

పెట్రోడాలర్ పతనాన్ని అడ్డుకోవడానికి అమెరికా డిజిటల్ ఫైనాన్షియల్ ఆధిపత్యం అనే కొత్త ఆయుధాన్ని ప్రయోగిస్తుంది. డాలర్ వినియోగం తగ్గకుండా ఉండటానికి ప్రపంచ బ్యాంకింగ్ వ్యవస్థలో సంస్కరణలు తీసుకువస్తుంది. ఒకవేళ ఏ దేశమైనా డాలర్‌ను కాదని ఇతర కరెన్సీలలో భారీ వాణిజ్యం చేస్తే, వారిపై కఠినమైన ద్వితీయ స్థాయి ఆంక్షలు విధించడం ద్వారా వారిని ఆర్థికంగా ఒంటరిని చేసే వ్యూహాన్ని అమలు చేస్తుంది.

ప్రపంచ చమురు మార్కెట్లో డాలర్ స్థానాన్ని భర్తీ చేయడానికి ప్రయత్నిస్తున్న చైనా యువాన్ లేదా రష్యా రూబుల్ వంటి కరెన్సీల ప్రభావాన్ని తగ్గించడానికి అమెరికా తన మిత్రదేశాలపై ఒత్తిడి తీసుకువస్తుంది. ఇతర కరెన్సీలలో వాణిజ్యం చేయడం వల్ల కలిగే ఆర్థిక నష్టాలను మరియు అమెరికా మద్దతు కోల్పోవడం వల్ల వచ్చే రక్షణ పరమైన ఇబ్బందులను వారికి వివరిస్తుంది. ఈ ఆర్థిక యుద్ధంలో గెలవడానికి అమెరికా తన వద్ద ఉన్న సార్వభౌమ నిధులు మరియు పెట్టుబడి మార్గాలను ఆయుధాలుగా వాడుకుంటుంది. అంతేకాకుండా, అమెరికా తన సొంత దేశంలో చమురు మరియు సహజ వాయువు ఉత్పత్తిని పెంచి, ప్రపంచ మార్కెట్లో ధరలను నియంత్రించడం ద్వారా ప్రత్యర్థి దేశాల ఆదాయాన్ని దెబ్బతీస్తుంది. గ్యాస్ మరియు చమురు ధరలపై పట్టు సాధించడం ద్వారా దేశాలన్నీ మళ్లీ డాలర్ బాట పట్టేలా చేస్తుంది. ఈ విధంగా ఆర్థిక ఒత్తిడి మరియు ప్రోత్సాహకాల ద్వారా పెట్రోడాలర్ వ్యవస్థను కనీసం మరికొన్ని దశాబ్దాల పాటు కాపాడుకోవాలని అమెరికా భావిస్తోంది. మొత్తం మీద ,అమెరికా తన భవిష్యత్ పోరాటంలో భాగంగా ఇజ్రాయెల్ మరియు అరబ్ దేశాల మధ్య శాంతి ఒప్పందాలను (ఉదాహరణకు అబ్రహం ఒప్పందాలు) మరింత ముందుకు తీసుకెళ్తుంది. ఇరాన్‌కు వ్యతిరేకంగా ఒక ఉమ్మడి ప్రాంతీయ రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా, అమెరికా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాన్ని సాధించాలని చూస్తోంది. ఈ వ్యూహాలన్నీ సఫలమైతే, అమెరికా తన కోల్పోయిన గౌరవాన్ని తిరిగి పొంది, పెట్రోడాలర్ వ్యవస్థను విచ్ఛిన్నం కాకుండా రక్షించుకోగలుగుతుంది.

# మూడో ప్రపంచం మీద మళ్ళీ వలసపాలన

- ట్రంప్ సామ్రాజ్యవాదం, భారత మౌనం
- అంతర్జాతీయ న్యాయం కనుమరుగవుతున్న కొత్త ప్రపంచం
- డాలర్ ఆధిపత్యం నిలుపుకునేందుకు అమెరికా ఆదిపత్యం
- ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పడం మనే ధ్యేసే లేని వైనం
- డి-డాలరైజేషన్ ను తీవ్రంగా ప్రోత్సహిస్తున్న బ్రిక్స్ దేశాలు
- అందుకే పెట్రో దేశాలపై పెద్దన్న తీరిది

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్.

9849328496.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూల సంయుక్త దాడులు, వెనిజులా అధ్యక్షుడు మదురోను కిడ్నాప్ చేసి అమెరికా జైలులో పెట్టడం వంటి సంఘటనలు ఈ క్రొత్త ప్రపంచ క్రమంలో అంతర్జాతీయ న్యాయం యొక్క మరణాన్ని సూచిస్తున్నాయి. ఈ వ్యాసం ఆ సంఘటనలను కేవలం వార్తా కథనాలుగా కాకుండా, ప్రపంచ పెట్టుబడిదారీ విధానం యొక్క తీవ్ర సంక్షోభానికి, అందులోంచి బయటపడేందుకు సామ్రాజ్యవాదం చేస్తున్న చివరి ప్రయత్నంగా విశ్లేషిస్తుంది.

**1. డాలర్ వ్యవస్థ మరియు పెట్టుబడిదారీ సంక్షోభం– యుద్ధానికి మూల కారణం:** అమెరికా, ఇజ్రాయెల్... ఇరాన్, వెనిజులాపై దాడులకు ప్రధాన కారణం చమురు, అలాగే డాలర్ ఆధిపత్యమే తప్ప ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పడం కాదు. ఈ వాదనను సమకాలీన ఆర్థిక గణాంకాలు, చారిత్రక సంఘటనలు స్పష్టంగా ధ్రువీకరిస్తున్నాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం తీవ్రమైన వాణిజ్య లోటుతో సతమతమవుతోంది. అధికారిక గణాంకాల ప్రకారం, 2025 నవంబర్ నాటికి గడచిన 12 నెలల్లో అమెరికా మొత్తం వాణిజ్య లోటు 936.45 బిలియన్లు గా నమోదైంది . ఇదే కాలంలో వస్తువుల వాణిజ్య లోటు ఏకంగా 1.27 ట్రిలియన్లు. ఈ భారీ లోటును భర్తీ చేయడానికి అమెరికా సంప్రదాయబద్ధంగా డాలర్ ముద్రణను ఆశ్రయిస్తుంది. కానీ ఈ వ్యూహం స్థూల డిమాండ్ తగ్గుదల, అధికోత్పత్తి సంక్షోభం, నిరుద్యోగం వంటి సమస్యలను పరిష్కరించలేకపోతోంది. ఇక్కడే పెట్రోడాలర్ వ్యవస్థ కీలకం అవుతుంది. 1974లో అమెరికా–సౌదీ అరేబియా మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం, ప్రపంచ చమురు వ్యాపారం తప్పనిసరిగా డాలర్లలోనే జరగాలి. దీనివల్ల ప్రపంచ దేశాలన్నీ తమ నిల్వల్లో డాలర్లను తప్పనిసరిగా ఉంచుకోవాల్సిన పరిస్థితి . కానీ ఈ వ్యవస్థ ఇప్పుడు కుప్పకూలుతోంది. (బ్రిక్స్) దేశాలు డి–డాలరైజేషన్ ను తీవ్రంగా ప్రోత్సహిస్తున్నాయి. 2024లో చైనా–రష్యా మధ్య జరిగిన 260 బిలియన్ల వాణిజ్యం యువాన్ మరియు రూబిళ్ళలో సెటిల్ చేయబడింది. ఇరాన్, వెనిజులా కూడా డాలర్ నుంచి బయటపడే ప్రయత్నం చేశాయి. ఇరాన్ తన చమురును యువాన్ మరియు యూరోలలో విక్రయించాలని ప్రకటించింది .వెనిజులా విషయం ప్రత్యేకంగా గమనించాలి. ఆ దేశం వద్ద ప్రపంచంలోనే అతిపెద్ద చమురు నిల్వలు (సుమారు 300 బిలియన్ బ్యారెళ్ళు) ఉన్నాయి . ఇంత భారీ చమురు నిల్వలు డాలర్ వ్యవస్థ నుంచి బయటపడటమంటే, అమెరికా ఆర్థిక ఆధిపత్యానికి మూలస్తంభమైన పెట్రోడాలర్ వ్యవస్థకు పెద్ద దెబ్బ. అందుకే అమెరికా వెనిజులాపై కఠిన ఆంక్షలు విధించింది. అందుకే అధ్యక్షుడి మీద కిడ్నాపు కుట్ర వరకూ సాగింది

**.2. అంతర్జాతీయ న్యాయం–ఐక్యరాజ్యసమితి, భద్రతా మండలి నిర్వీర్యం:** 2026 ఫిబ్రవరి 28న అమెరికా–ఇజ్రాయిల్ లు ఇరాన్ పై జరిపిన దాడి అంతర్జాతీయ న్యాయాన్ని బహిరంగంగా ఉల్లంఘించింది. ఇరాన్ అణ్వాయుధాల తయారీకి పాల్పడిందన్న ఆరోపణలపై చర్చలు జరుగుతుండగానే ఈ దాడి జరగడం గమనార్హం . 2015లో జరిగిన (జే.సీ.పీ.ఓ.ఏ.) ఒప్పందం నుంచి అమెరికా 2018లో ఏకపక్షంగా వైదొలగడంతో ఈ ఉద్రిక్తత మొదలైంది . ఈ దాడి తర్వాత ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అత్యవసర సమావేశం జరిగింది. ఇరాన్ దాడిని ఖండించాలని కోరింది . ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ కూడా అత్యవసర సమావేశం కోరారు. కానీ ఫలితం శూన్యం. భద్రతా మండలి శాశ్వత సభ్యుల్లో ఒకరైన అమెరికాపై చర్య తీసుకోవడం ఆచరణ సాధ్యం కాదు. ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ అంటోనియో గుటెర్రస్ స్వయంగా భద్రతా మండలి నిర్మాణం పాతబడిపోయిందని, దాని చట్టబద్ధత ప్రశ్నార్థకంగా మారిందని హెచ్చరించారు. ఆఫ్రికా,లాటిన్ అమెరికా వంటి ప్రాంతాలకు శాశ్వత స్థానాలు లేకపోవడం, వీటో అధికారం ఐదు దేశాలకే పరిమితం కావడం వల్ల సంస్థ ప్రపంచ శాంతిని కాపాడడంలో విఫలమవుతోంది అని ఆయన అన్నారు. బ్రిటన్,ఫ్రాన్స్,జర్మనీలు ఇరాన్ దాడిని ఖండించినప్పటికీ, అమెరికా–ఇజ్రాయిల్ ల దాడిపై మౌనంగా ఉండటం ముఖమ్మీది ముసుగు జారడంగా భావించాలి.

**3. ట్రంప్ విధానాలు: నయా ఫాసిజం & బహిరంగ సామ్రాజ్యవాదం:** ట్రంప్ పరిపాలన సామ్రాజ్యవాదానికి కొత్త రూపునిచ్చింది. ఇక సాకులు చెప్పడం మానేసి, బహిరంగంగానే సార్వభౌమ దేశాలపై దాడికి దిగడం దీని లక్షణం. ఇరాన్ పై దాడి సమయంలో ట్రంప్ పెద్ద ఎత్తున సైనిక చర్య ప్రారంభించినట్లు ప్రకటించి, ఇరాన్ ప్రజలు తమ ప్రభుత్వాన్ని కూలదోయాలని పిలుపునిచ్చారు .అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ ప్రపంచ ఆర్థిక వేదిక (దావోస్) వద్ద ఇరాన్ ఆర్థిక వ్యవస్థను కూల్చడానికి డాలర్ కొరతను సృష్టించామని బహిరంగంగా అంగీకరించడం ఈ క్రొత్త ధోరణికి నిదర్శనం . వెనిజులా విషయంలో కూడా ఇదే జరిగింది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో వెనిజులా తన చమురును అమెరికా శత్రువులకు విక్రయించకూడదని బహిరంగంగా హెచ్చరించాడు .ఈ దాడుల వెనుక చమురు కంపెనీల లాబీ కూడా ఉంది. అమెరికన్ పెట్రోలియం ఇన్స్టిట్యూట్ సదస్సులో ఇరాన్ పతనాన్ని చమురు పరిశ్రమకు గొప్ప అవకాశంగా అభివర్ణించారు. వెనిజులా చమురు రంగంలో చేవ్రాన్ వంటి అమెరికన్ కంపెనీల ప్రవేశం కూడా ఇదే లక్ష్యంతో ముడిపడి ఉంది .


**4. భారత్ పాత్ర: వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి లేదా దీన స్థితి?** గత భారత దేశ ప్రధాన మంత్రులతో పోలిస్తే ప్రస్తుత భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ అమెరికా సామ్రాజ్యవాద దాడులను ఖండించ లేని, విమర్శించ లేనీ దీనస్థితిలో ఉండటం విచారకరం. 2026 నాటి ఈ క్లిష్ట పరిస్థితుల్లో భారత విదేశాంగ విధానం సాంప్రదాయ అలీన ఉద్యమం నుండి బహుళ–అమరిక (మల్టీ – అలైన్ మెంట్) వైపు కు మళ్ళింది .ఫిబ్రవరి 2026లో ప్రధాని మోడీ ఇజ్రాయిల్ పర్యటన చేసి నెస్సెట్ (పార్లమెంట్) ను ఉద్దేశించి ప్రసంగించడం, ఇరాన్ పై దాడి జరిగిన వెంటనే భారత్ స్పందన గమనించాలి. విశ్వ గురువు గా చెప్పుకొనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశానికి తిరుగులేని భారత్ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆ దాడిని ఖండించలేక పోవటం అనేక విమర్శలు కు అవకాశం ఇచ్చింది. అలాగే దాడిని బహిరం గంగా ఆమోదించలేదు కూడా. కానీ దానికి బదులుగా అన్ని దేశాల సార్వభౌమత్వం , భూభాగ సమగ్రతను గౌరవించాలి అని పేలవంగా, లోగొంతుకతో పిలుపునిచ్చారు. అదే సమయంలో మోదీ ఇజ్రాయిల్, గల్ఫ్ దేశాలపై ఇరాన్ ఆత్మరక్షణ కోసం చేసిన ప్రతి దాడులను మాత్రం మోదీ బహిరంగంగా ఖండించారు. పైగా ఆ దేశాల నేతలతో ఫోన్ సంభాషణలు జరిపింది .ఇది వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి (స్ట్రాటజిక్ అటానమీ)ఇది ఒక కొత్త రూపం. ఒక వైపు ఇజ్రాయిల్ తో రక్షణ సంబంధాలు (బరాక్–8 క్షిపణులు వంటి ఉమ్మడి అభివృద్ధి) బలోపేతం చేసుకుంటూనే, మరోవైపు ఇరాన్ తో సంబంధా లను కూడా కొనసాగించడం . గల్ఫ్ లో 9 మిలియన్లకు పైగా భారతీయులు, 50 శాతం ఇంధన అవసరాలు ఈ ప్రాంతం నుండి సమకూరడం వల్ల భారత్ తటస్థంగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది. ఈ విధానాన్ని సంక్లిష్టమైన భౌగోళిక రాజకీయాల్లో జాతీయ ప్రయోజనాల పరిరక్షణగా చూడాలి. అయితే, ఇది అమెరికా సామ్రాజ్యవాదాన్ని పరోక్షంగా ప్రోత్సహించడమేనా? లేదా మూడో ప్రపంచ దేశాలను ఐక్యం చేసి బలమైన వేదికను నిర్మించడం భారత్ కు ఉన్న నైతిక బాధ్యతా? అన్నది చర్చనీయాంశం.

**5. చైనా, రష్యా మౌనం: బహుళ ధ్రువ ప్రపంచం యొక్క వైరుధ్యం:** మూడో ప్రపంచ దేశాలపై జరుగుతున్న ఈ దాడుల్లో చైనా, రష్యాల మౌనం కూడా గమనించాల్సినఅంశం. బహుళ ధ్రువ ప్రపంచాన్ని (మల్టీ పోలార్ వరల్డ్) సృష్టిం చడం, డాలర్ ఆధిపత్యాన్ని తొలగించడం వంటి అజెండాలను ముందుకు తెస్తున్న చైనా–రష్యా లు, ఇరాన్ పై దాడి సందర్భంగా ఎందుకు నిర్ణయాత్మకంగా, క్రియాశీలకంగా వ్యవహరించలేదుచైనా ప్రస్తుతం ఇరాన్ చమురులో అతిపెద్ద కొనుగోలుదారు. వెనిజులా చమురు కూడా చైనాకే ఎక్కువ గా ఎగుమతి అవుతుంది . ఆర్థిక ప్రయోజనాలు చైనాను నేరుగా అమెరికాతో ఘర్షణ పడకుండా నిరోధిస్తున్నాయి. రష్యా విషయంలో కూడా ఇదే పరిస్థితి. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా రష్యా పశ్చిమ దేశాలతో తీవ్ర ఘర్షణలో ఉన్నా, అమెరికాతో నేరుగా సైనిక ఘర్షణను కోరుకోవడం లేదు. యూరోపియన్ దేశాల విషయానికొస్తే, స్పెయిన్ మినహా దాదాపు అన్ని దేశాలు ఇరాన్ పై దాడిని ఖండించక పోవడం వాస్సల్ సామ్రాజ్యవాదం (వాసల్ ఇంపీరియలిజం)గా వ్యాఖ్యానించబడిందిమాక్రాన్ ట్రంప్ కు ఇరాన్ విషయం లో గొప్పగా చేయవచ్చు అని సందేశం పంపడం ఈ సంబంధానికి నిదర్శనం

. **మూడో ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్ళు:** ప్రస్తుత ప్రపంచం ఒక కీలకమైన మలుపు వద్ద ఉంది. పెట్టుబడిదారీ సంక్షోభం నుండి బయటపడే మార్గంగా అమెరికా సామ్రాజ్యవాదం మళ్ళీ వలసపాలన వైపు పయనిస్తోంది.

# బిజినెస్

## యుద్ధ ప్రభావంతో మార్కెట్ 6,000 పాయింట్లు దెబ్బ, ₹33 లక్షల కోట్ల నష్టాలు!




మార్చి నెలలో దేశీయ స్టాక్ మార్కెట్ యుద్ధ ప్రభావం వల్ల నష్టాల్లో కదిలింది. ఫిబ్రవరి 27న సెన్సెక్స్ 81,287 పాయింట్ల వద్ద ముగిసినప్పటి నుండి, ఇరాన్-అమెరికా-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు ప్రారంభమైన తర్వాత సెన్సెక్స్ 6,700 పాయింట్లకు క్షీణించింది. నిఫ్టీ కూడా 25,178 నుండి 23,151 పాయింట్లకు తగ్గింది. ఈ స్థితి మదుపర్లకు ₹33 లక్షల కోట్లను నష్టపరిచింది.
దేశీయ ఈక్విటీ మార్కెట్‌లో ఫిబ్రవరి 27 తర్వాత విదేశీ మదుపర్లు విపరీతంగా షేర్లను విక్రయించారు. ఈ ఒక్క నెలలో ఫారిన్ ఇన్వెస్టర్లు దాదాపు ₹52 లక్షల కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను మార్కెట్ నుంచి తీయడం, మార్కెట్ పతనానికి ప్రధాన కారణంగా ఉంది.
పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, క్రూడాయిల్ ధర 100 డాలర్ల మార్కును దాటడం స్టాక్ మార్కెట్‌కు భారం కలిగించాయి. ఇలాంటి సందర్భాల్లో మదుపర్లు నగదు, బంగారంలో పెట్టుబడులు పెంచి రిస్క్‌ను తగ్గించడానికి ప్రయత్నిస్తారు.
మార్కెట్ ఈ స్థాయిలో కరెక్షన్‌కు లోనైందని విశ్లేషకులు అంటున్నారు. యుద్ధ పరిస్థితులు కొనసాగుతూనే, కొద్ది మొత్తంలో డబ్బు పెట్టి మార్కెట్ తీరుతెన్నులను గమనిస్తూ పెట్టుబడులు కొనసాగించమని సూచిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులను అవకాశంగా కూడా చూడవచ్చని వారు సూచిస్తున్నారు. మార్చి నెల ప్రారంభంలో దేశీయ స్టాక్ మార్కెట్ యుద్ధ ప్రభావం కారణంగా తీవ్ర నష్టాలను నమోదు చేసింది. ఫిబ్రవరి 27న సెన్సెక్స్ 81,287 పాయింట్ల వద్ద ముగిసిన తర్వాత, ఇరాన్-అమెరికా-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు ప్రారంభమయ్యాయి. 13 ట్రేడింగ్ రోజులలో 9 రోజులు నష్టాలు-మాత్రమే సెషన్‌గా ముగిసాయి. ఫలితంగా, సెన్సెక్స్ 6,700 పాయింట్లకూ, నిఫ్టీ 2,000 పాయింట్లకూ క్షీణించింది. ఈ పతనం దేశీయ మదుపర్లకు ₹33 లక్షల కోట్ల నష్టాన్ని కలిగించింది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మార్కెట్ విలువ ఫిబ్రవరి 27న ₹463 లక్షల కోట్ల నుండి మార్చి 13న ₹429 లక్షల కోట్లకు పడిపోయింది. ఈ భారీ నష్టాలు స్థానిక మదుపర్ల

## యాక్సిస్ బ్యాంక్ మహిళల ఉపాధి కీలకం

AXIS BANK

భారతదేశంలో 2050 నాటికి స్థిరమైన వృద్ధి సాధించడానికి మహిళల వేతనభరిత ఉద్యోగాల్లో పెరుగుదల అవసరమని యాక్సిస్ బ్యాంక్ నిర్వహించిన అధ్యయనం సూచిస్తోంది. ప్రస్తుతం మొత్తం కార్మికుల్లో సుమారు 47 శాతం మాత్రమే వేతనకొలువులో, మహిళల సమాన పాత్రను పెంపొందించడంవలన అవసరం ఉందని నివేదిక పేర్కొంది. వివాహం, పిల్లల సంరక్షణ బాధ్యతలు, రవాణా సమస్యలు, భద్రతా అంశాలు వంటి అడ్డంకులు కారణంగా చదువుకున్న మహిళల పెద్ద సంఖ్య ఉద్యోగాల్లో చేరలేదని చెప్పబడింది. ఫ్లెక్సిబుల్ పని విధానాలు, పిల్లల సంరక్షణ సదుపాయాలు, సురక్షిత రవాణా మరియు మరిన్ని అవకాశాలను అందించడం ద్వారా మహిళల ఉపాధి సాధన పెరుగుతుందని, దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి ఇది కీలకం అని నివేదిక అభిప్రాయపడుతోంది.

## రీ సస్టైనబిలిటీ & ఇండియన్ ఆయిల్ లూబ్ ఆయిల్ రీసైక్లింగ్




భారతదేశంలో ఉపయోగించిన లూబ్రికెంట్స్ సేకరణ మరియు పునఃప్రాసెసింగ్ కోసం రీ సస్టైనబిలిటీ, ఇండియన్ ఆయిల్ భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నాయి. ఈ భాగస్వామ్యం ద్వారా దేశవ్యాప్తంగా రివర్స్ లాజిస్టిక్స్ మరియు సేకరణ వ్యవస్థను ఏర్పాటు చేసి, రికవర్ చేసిన లూబ్రికెంట్స్ నుండి రీ-రిఫైన్డ్ బేస్ ఆయిల్ తయారుచేస్తారు. 50--100 కిలోటన్నుల సామర్థ్యం గల ఆధునిక కేంద్రాలను నిర్మించడం, ఇప్పటికే ఉన్న సౌకర్యాలను అప్‌గ్రేడ్ చేయడం లక్ష్యం. ఈ ప్రయత్నం వనరుల సమర్థవంతమైన వినియోగం, భవిష్యత్ లోపల ఇంధన భద్రత, పర్యావరణ పరిరక్షణ, మరియు భారతదేశాన్ని స్థిరమైన, వృత్తాకార లూబ్రికెంట్ ఆర్థిక వ్యవస్థ వైపు ముందుకు నడిపే దిశలో ఒక మైలురాయి అవుతుంది.

## ఇసుజు మోటార్స్ ఇండియా యాజమాన్య మార్పు



ఇసుజు మోటార్స్ ఇండియాలో ఉన్నత స్థాయి యాజమాన్యంలో మార్పు జరిగింది. శ్రీ. టకేషి హిరానో, ఇసుజు బిజినెస్ డివిజన్, మిట్సుబిషి కార్పొరేషన్, జపాన్ నుండి, డెప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ పదవి చేపట్టారు. ఆయనకు ఇసుజు మరియు మిట్సుబిషి కంపెనీలకు ప్రపంచ మార్కెట్లలో పంపిణీ, మార్కెటింగ్ రంగాల్లో రెండు దశాబ్దాల అనుభవం ఉంది. భారత మార్కెట్లో వైస్-ప్రెసిడెంట్-సేల్స్ మరియు మార్కెటింగ్ లో పనిచేయడంతో, ఆయనకు భారతీయ వ్యాపార వాతావరణంపై విస్తృత పరిజ్ఞానం ఉంది. ఈ మార్పు ఇసుజు మోటార్స్ ఇండియా వ్యాపార ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయడానికి కేంద్రంగా ఉంటుంది, తద్వారా కంపెనీ మార్కెట్ స్థిరత్వం మరియు వ్యాపార అభివృద్ధిని బలోపేతం చేసుకోగలదు.

## గోద్రేజ్ జీవీస్ 2026 భారత ఆర్కిటెక్చర్ సృష్టికర్తలు




గోద్రేజ్ ఎంటర్‌ప్రైజెస్ గ్రూప్, లాక్స్ మరియు ఆర్కిటెక్చరల్ సొల్యూషన్స్ విభాగం ద్వారా, గోవాలో 7 మార్చి 2026న 5వ జీవీస్ అవార్డ్స్ 2026 ను విజయవంతంగా నిర్వహించింది. ఈ కార్యక్రమం దేశంలోని అత్యంత ప్రభావవంతమైన ఆర్కిటెక్టులు, ఇంటీరియర్ డిజైనర్లు మరియు పరిశ్రమ నేతలను ఆహ్వానించి, ఆర్కిటెక్చర్ మరియు డిజైన్ లో నూతన ఆవిష్కరణ, స్థిరత్వం మరియు నాణ్యతను ప్రోత్సహించింది. గోద్రేజ్ వాల్యూ కో-క్రియేటర్స్ క్లబ్ పరిధిలో, 15 వర్గాల్లో 2025 లో పూర్తి చేసిన అత్యుత్తమ ప్రాజెక్టులను గుర్తించి అవార్డులు ఇవ్వబడింది. ఈ అవార్డులు ఇండియాలో ఆర్కిటెక్చర్, డిజైన్ రంగంలోని కొత్త ఆలోచనలు, బాధ్యతాయుతమైన పదార్థాల వినియోగం, మరియు సురక్షిత, స్మార్ట్ మరియు స్థిరమైన వాతావరణాల సృష్టికి పాలుపంచిన వారు గుర్తింపును పొందే వేదికగా నిలిచాయి.

## శామ్‌సంగ్ బెస్పోక్ ఏఐ ఏసీలు 30% శక్తి ఆదా




శామ్‌సంగ్, భారత దేశంలో ప్రముఖ వినియోగత ఇలక్ట్రానిక్స్ బ్రాండ్, 2026 ప్రత్యేకంగా రూపొందించిన ఏఐ విండ్ ఫ్రీ ఎయిర్ కండీషనర్ శ్రేణిని పరిచయం చేసింది. ఈ ఏసీలు కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత మోడ్‌లతో రూపొందించబడినవి, వీటిలో ఏఐ ఎనర్జీ మోడ్ గది పరిస్థితులు, వినియోగత ప్యాటర్న్‌లను విశ్లేషించి కంప్రెసర్ పనితీరును మరియు శీతలీకరణ తీవ్రతను సర్దుబాటు చేస్తుంది. ఫలితంగా శక్తి వినియోగాన్ని 30% వరకు తగ్గించడం సాధ్యమవుతుంది. ఏఐ డిజిటల్ ఇన్వర్టర్ కంట్రోల్ మరియు బ్లడ్‌సి మోటారు సౌకర్యాలు పనిచేసి శబ్దాన్ని తగ్గిస్తాయి, వేగవంతమైన శీతలీకరణను అందిస్తాయి. జంట కంప్రెసర్ మరియు జంట మఫ్లర్ డిజైన్‌లు వైబ్రేషన్ మరియు శబ్దాన్ని కేవలం తగ్గించడమే కాక, స్మార్ట్‌థింగ్స్ యాప్ ద్వారా రిమోట్ నియంత్రణ, ఎనర్జీ ట్రాకింగ్, వినియోగత హెచ్చరికలు వంటి సౌకర్యాలను అందిస్తాయి. 23 మోడళ్లతో ఈ బెస్పోక్ ఏసీ శ్రేణి భారతీయ వాతావరణం మరియు కుటుంబ అవసరాలకు అనుగుణంగా రూపొందించబడింది, ప్రారంభ ధర రూ. 32,490.

## ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఎఎంసి అపెక్స్ హైబ్రిడ్ ఫండ్

APEX SIF | ADITYA BIRLA CAPITAL ASSET MANAGEMENT

ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఎఎంసి కొత్త సిఫ్ ఫ్రేమ్‌వర్క్ కింద 'అపెక్స్ హైబ్రిడ్ లాంగ్-షార్ట్ ఫండ్'ను ప్రారంభించింది. ఈ ఫండ్ 2026 మార్చి 6 నుంచి 18 వరకు ఎన్ఎఫ్ఓ కోసం అందుబాటులో ఉంటుంది. మార్కెట్ చక్రాల్లో మెరుగైన రిస్క్-సర్దుబాటు రాబడులను లక్ష్యంగా పెట్టుకొని, ఈ ఫండ్ ఈక్విటీ, డెట్, డెరివేటివ్స్ ను సమన్వయం చేస్తుంది. దీర్ఘ-స్వల్ప వ్యూహం ద్వారా మార్కెట్ అస్థిరతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, కార్పొరేట్ చర్చలు మరియు ప్రత్యేక అవకాశాల ద్వారా ఆర్థిక లాభాలను పెంచడమే ఫండ్ లక్ష్యం. రూ.10 లక్షల కనీస పెట్టుబడితో ఈ ఫండ్ పెట్టుబడిదారులకు వ్యూహాత్మక, అధునాతన పెట్టుబడి పరిష్కారాలను అందిస్తుంది,.

## రెడ్‌బస్ రిపోర్ట్ ఆంధ్రప్రదేశ్ మహిళా ప్రయాణం




రెడ్‌బస్ విడుదల చేసిన పింక్ రిపోర్ట్ ప్రకారం, ఆంధ్రప్రదేశ్ మహిళల మధ్య ఇంటర్‌సిటీ బస్ ప్రయాణంలో టాప్ 3 రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచింది. 2019 నుండి 2025 వరకు మహిళల ప్రయాణాలు 124% పెరిగాయి, ఇక్కడ 21--30 సంవత్సరాల వయస్సు గల యువత సొలోగా 92% పెరుగుదలతో స్వతంత్ర ప్రయాణాలను ముందుకు తీసుకువచ్చారు.

## హాకీ విర్టోరియాతో హెచ్చెల్‌టెక్ భాగస్వామ్యం మెల్బోర్న్ కొబ్రాస్



హాకీ విర్టోరియా కొత్త మెల్బోర్న్ కొబ్రాస్ ఫ్రాంచైజీకి హెచ్చెల్‌టెక్ భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈ కొత్త జట్టు ఆస్ట్రేలియాలోని ప్రీమియర్ హాకీ పోటీలో ఆరవ జట్టుగా చేరుతోంది. ఫ్రాంచైజీ స్థానిక మరియు భారత అంతర్జాతీయ క్రీడాకారులను కలిపి గ్లోబల్ స్థాయిలో ఆటను ప్రదర్శించడానికి లక్ష్యంగా పెట్టుకుంది.
హెచ్చెల్‌టెక్ ఈ భాగస్వామ్యంతో డిజిటల్ అభిమానుల అనుభవ వేదికను రూపొందించనుంది. ఈ వేదికలో ప్రత్యక్ష మ్యాచ్ సమాచారం, పరస్పర కంటెంట్ మరియు వ్యక్తిగతీకరణ విధానాలు ఉంటాయి. అభిమానులు ఆస్ట్రేలియా మరియు భారతదేశంలో జట్టుతో మరింత సన్నిహితంగా అనుసంధానం పొందగలుగుతారు.
హాకీ విర్టోరియా సీఎఈఓ ఆండ్రూ స్కిల్లెర్న్ ప్రకారం, మెల్బోర్న్ కొబ్రాస్ ప్రారంభం హాకీ భవిష్యత్తుకు ఒక కీలక ఘట్టం. జట్టు సమాజం వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తూ, అంతర్జాతీయ స్థాయిలో అద్భుతమైన హాకీ ప్రతిభను చూపిస్తుంది. హెచ్చెల్‌టెక్ భాగస్వామ్యం ద్వారా అభిమానులకు వినూత్న మరియు సమగ్ర అనుభవం అందించడం సులభమవుతుంది.
హెచ్చెల్‌టెక్ ఆస్ట్రేలియా మరియు న్యూజిలాండ్ సీఈవో సోనియా ఎలాండ్ ప్రకారం, ప్రపంచ వ్యాప్తంగా క్రీడా సంస్థల కోసం రూపొందించిన పెద్ద స్థాయి డిజిటల్ వేదికల అనుభవాన్ని ఉపయోగించి, హాకీ అభిమానులను మరింత దగ్గరగా చేర్చడం వారి లక్ష్యం. ఈ భాగస్వామ్యం ద్వారా ఆస్ట్రేలియా మరియు భారతదేశంలో హాకీ వ్యాప్తిని పెంచడంలో సహకారం అందుతుంది.

## సియమెన్స్ 2026 ఇన్నోవేషన్ డే పరిశ్రమలలో నేతృత్వం



సియమెన్స్ 2026 ఇన్నోవేషన్ డే కార్యక్రమంలో భారత్‌లో పరిశ్రమల, మౌలిక సదుపాయాల, మొబిలిటీ మరియు ఇంధన వ్యవస్థల విప్లవాత్మక మార్పులను ప్రదర్శించింది. ఈ కార్యక్రమంలో జశూలు, పరిశ్రమల నాయకులు, పాలసీ నిర్మాతలు, భాగస్వాములు, సాంకేతిక నిపుణులు పాల్గొని, ఇండస్ట్రియల్ ఎ ఐ, డిజిటల్ ట్విన్స్, ఆటోమేషన్, మరియు ఎలక్ట్రిఫికేషన్ వంటి సాంకేతికతల ప్రభావాన్ని నేరుగా అనుభవించారు.
సియమెన్స్ ఇండస్ట్రియల్ ఎ ఐను ప్రయోగ స్థాయి-ంలోనుంచి అంతటా వినియోగ స్థాయికి తీసుకెళ్ళడం మరియు ఫ్యాక్టరీలు, డేటా సెంటర్లు, ఇంటెలిజెంట్ భవనాలు, స్థిరమైన మొబిలిటీ, భవిష్యత్తు శక్తి గ్రిడ్‌లలో ప్రయోగించే విధానం చూపించబడింది. డిజిటల్ ట్విన్స్, సిమ్యులేషన్, సాఫ్ట్‌వేర్ మరియు ఆటోమేషన్ ద్వారా ఉత్పాదకత పెంచడం, శక్తి వినియోగాన్ని తగ్గించడం, డిజైన్-టు-ప్రొడక్షన్ సైకిల్‌ను తగ్గించడం సాధ్యమవుతుంది.
బెంగళూరు మరియు పూణెలోని గ్లోబల్ ఇన్నోవేషన్ మరియు డెవలప్‌మెంట్ సెంటర్స్ ద్వారా 10,000ం ఇంజనీర్లు, సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్ట్ మరియు డొమైన్ నిపుణులు ఇండస్ట్రియల్ ఎ ఐ, డిజిటల్ ట్విన్స్, ఆటోమేషన్ సాఫ్ట్‌వేర్, ఎలక్ట్రిఫికేషన్ మరియు సైబర్‌సెక్యూరిటీ రంగాల్లో పనిచేస్తున్నారు. ఈ కేంద్రాలు సియ-ంమెన్స్ యొక్క ప్రపంచవ్యాప్తంగా సాంకేతికతా రోడ్‌మ్యాప్‌లో కీలక భూభాగాన్ని కలిగి ఉన్నాయి.
సియమెన్స్ 'టీమ్సెంటర్ డిజిటల్ రియాలిటీ వీయర్' మరియు 'డిజిటల్ ట్విన్ కంపోజర్' పరిష్కారాలను ప్రదర్శించింది, ఇవి ఉత్పత్తులు, ప్రక్రియలు, సౌకర్యాలపై వర్చువల్ లో పరీక్షించడం, రిస్క్ తగ్గించడం మరియు ఆవిష్కరణను వేగవంతం చేయడం సహాయపడతాయి. భారతదేశం భాగస్వామ్యంతో సృష్టించిన ఈ పరిష్కారాలు పరిశ్రమల కోసం గ్లోబల్-స్థాయి డిజిటల్ అనుభవాన్ని అందిస్తాయి.

## బ్యాంక్ ఆఫ్ బరోడా కొత్త అంతర్జాతీయ రుణం

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda

భారతదేశానికి చెందిన బ్యాంక్ ఆఫ్ బరోడా, తన ఆర్థిక విభాగాన్ని విస్తరించడానికి, ఐదు సంవత్సరాల పాటు పరిమిత రుణం పొందింది. ఈ రుణం మొత్తం అయిదురెండుకోటి డాలర్లు, ప్రధానంగా ఆసియా దేశాల నుండి వచ్చిన పింఛనకర్తల నుండి పెద్ద మద్దతు అందుకుంది. ఈ చర్య ద్వారా బ్యాంక్ తన అంతర్జాతీయ పెట్టుబడిదారుల సంఖ్యను పెంచడంలో విజయవంతమైంది.
ఈ రుణం ద్వారా బ్యాంక్ తన సంప్రదాయ దేశీయ పెట్టుబడిదారులతోపాటు, అంతర్జాతీయ పెట్టుబడిదారుల నుంచి కూడా నిధులను విభజించగలగడం సాధించింది. ఆసియా మార్కెట్లలో వచ్చిన మద్దతు, బ్యాంక్ యొక్క ఆర్థిక స్థిరత్వాన్ని మరియు వ్యూహాత్మక దిశను ప్రపంచ వ్యాప్తంగా గుర్తించింది.
బ్యాంక్ ఆఫ్ బరోడా గత సంవత్సరం తర్వాత మళ్లీ అంతర్జాతీయ రుణ మార్కెట్లోకి ప్రవేశించింది. ఈ రుణం ప్రధానంగా సాధారణ బ్యాంకింగ్ కార్యకలాపాలు మరియు వ్యాపార అవసరాల కోసం ఉపయోగించబడుతుంది. ముఫ్జ్ బ్యాంక్ మరియు హెచ్ఎస్బీసీ, ఈ లావాదేవీని నిర్వహించడానికి ప్రధాన బాధ్యత వహించారు. బ్యాంక్ ఆఫ్ బరోడా అంతర్జాతీయ క్రెడిట్ రేటింగ్స్‌లో బలమైన స్థానం కలిగి ఉంది. గ్లోబల్ మార్కెట్లో పెట్టుబడిదారులు, బ్యాంక్ యొక్క ఆర్థిక నిర్వహణ మరియు వ్యూహాత్మక దిశపై నమ్మకం పెంచారు. 80 మంది అంతర్జాతీయ శాఖలతో, బ్యాంక్ ప్రపంచ వ్యాప్తంగా తన కార్యకలాపాలను కొనసాగిస్తోంది.

## సెన్హైసర్-బార్కోతో హైబ్రిడ్ సమావేశ పరిష్కారాలు



సెన్హైసర్ మరియు బార్కో సంస్థలు, భారత్‌లో ఆరు ప్రధాన నగరాలలో కలిసి హైబ్రిడ్ సమావేశ పరిష్కారాలను పరిచయం చేయడానికి ఒక పలు నగరాల పర్యటన నిర్వహించాయి. ఈ పర్యటనలో 420 మందికి పైగా ఆడియో-విజువల్, ఐటి నిపుణులు, వ్యవస్థ సమీకరణకారులు, సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రతి నగరంలో ప్రత్యక్ష ప్రదర్శనలు, పరిష్కారం చర్చలు, మరియు భాగస్వామి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.
పర్యటనలో బార్కో క్లిక్‌షేర్ హబ్ మరియు సెన్హైసర్ టీమ్‌కనెక్ట్ బార్ పరిష్కారాలు మిళితంగా ఉపయోగించబడతాయి అని చూపించబడింది. ఈ పరిష్కారాలు మైక్రోసాఫ్ట్ టీమ్స్ కోసం ధృవీకృతమై, వినియోగదారులకు వైర్‌లెస్ సమావేశాలు సులభంగా నిర్వహించడానికి అవకాశాన్ని అందిస్తున్నాయి.
పర్యటన ద్వారా సెన్హైసర్ మరియు బార్కో మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం అయింది. భాగస్వాములకు సాంకేతిక మరియు అమ్మక పరంగా లోతైన జ్ఞానం అందించడం ద్వారా, సమావేశాల కోసం రూపొందించిన మిళిత పరిష్కారాలను సమర్థవంతంగా అమలు చేయడం సాధ్యమయ్యింది.
ఈ పరిష్కారం, అధునాతన ఆడియో, హై-క్వాలిటీ వీడియో మరియు సంస్థాగతగ్రేడ్ భద్రతను కలిగి, సులభమైన హైబ్రిడ్ సమావేశాలను అందిస్తుంది. భాగస్వాములు మరియు సంస్థలు ఈ పరిష్కారాలను ఉపయోగించి సమావేశ గదులను సులభంగా ఏర్పాటు చేయగలుగుతారు, దీని ద్వారా సమగ్రమైన సమావేశ అనుభవం సాధ్యమవుతుంది.

## అమెజాన్ బిజినెస్ భారత్‌లో ఆర్థిక విలువ విడుదల



అమెజాన్ బిజినెస్ 2025 లో భారత్‌లోని వ్యాపారాలకు ₹2,000 కోట్లు పైగా ఆర్థిక విలువను అందించిందని ప్రకటించింది. చిన్న, మధ్యతరహా, పెద్ద వ్యాపారాలు కేశ్‌బ్యాక్, భారీ డిస్కౌంట్లు మరియు ప్రత్యేక ఆఫర్ల ద్వారా లాభం పొందాయి. ప్రత్యేకంగా జీఎస్టీ-అనుగుణ ఇన్వాయ్సింగ్ ద్వారా వ్యాపారాల కొరకు పారదర్శకత పెరిగింది, ఇది ఆఫ్‌లైన్ కొనుగోళ్లలో సాధారణంగా అసౌకర్యంగా ఉండేది.
వివిధ నగరాల్లో, ముఖ్యంగా టియర్ 2 మరియు టియర్ 3 నగరాల వ్యాపారాల్లో అమెజాన్ బిజినెస్ వినియోగం ఎక్కువగా పెరిగింది. ఈ వినియోగం కేవలం ప్రయోగమే కాదు, కానీ వ్యాపార కొనుగోలు ను డిజిటల్‌గా కేంద్రీకరించే ఉద్దేశపూర్వక మార్పు అని సూచిస్తుంది. ఈ పెరుగుదల, వ్యాపారాలకు సంస్థ-గ్రేడ్ కొనుగోలు సౌకర్యాలను అందించే పునరావృత పెట్టుబడుల కారణంగా సాధ్యమైంది.
అమెజాన్ బిజినెస్, ఉద్యమం మరియు ఎఫ్ఎస్-ఎస్ఏఐ లైసెన్స్ కలిగిన వ్యాపారాలకు ప్రాప్తిని విస్తరించింది. ఇన్వాయిసింగ్, భారీ డిస్కౌంట్లు, కేశ్‌బ్యాక్, మరియు ప్రత్యేక బిజినెస్ సేల్ ఈవెంట్ల ద్వారా వ్యాపారాలకు అదనపు ఆదా అవకాశాలను సృష్టించింది. ఇది 100% భారతదేశం వ్యాపారులకు సమానంగా ప్రోడక్ట్ రేంజ్, పోటీ ధరలు మరియు నమ్మకమైన డెలివరీను అందిస్తుంది.
విస్తృత ఉత్పత్తి శ్రేణి, మల్టీ-యూజర్ అకౌంట్స్, ఖర్చు విశ్లేషణ, అమెజాన్ పే లేటర్, మరియు అమెజాన్ ప్రైమ్ వంటి ఫీచర్లు వ్యాపార కొనుగోళ్లను సమర్థవంతంగా, తక్కువ ఖర్చుతో సులభతరం చేస్తాయి. ఇవి వ్యాపారాల ఖర్చులను తగ్గించి, కార్యకలాప సమర్థత పెంచి, ఆదా అయిన మూలధనాన్ని వృద్ధిలో పెట్టేందుకు సహాయపడతాయి.

## అస్టర్ డీఎం హెల్త్‌కేర్ విలీనం మద్దతు పొందింది



అస్టర్ డీఎం హెల్త్‌కేర్ మరియు క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ మధ్య విలీనం కోసం షేర్‌హోల్డర్లు మరియు క్రెడిటర్స్ నుండి విపుల మద్దతు వచ్చింది. మొత్తం షేర్‌హోల్డర్లలో 96.68% మంది విలీనానికి ఒప్పుకున్నారని ప్రకటించారు. ఈ విలీనానికి ముందు షేర్ స్వాప్ కు కూడా అనుమతి వచ్చింది. మిగిలిన నియంత్రణ మరియు నిబంధన అనుమతులు పొందిన తర్వాత, తదుపరి త్రైమాసికంలో ఈ విలీనాన్ని పూర్తిచేయనున్నారు.
విలీన అనంతరం, అస్టర్ డీఎం క్వాలిటీ కేర్ లిమిటెడ్ భారత్‌లోని టాప్ మూడు హాస్పిటల్ చైన్లలో ఒకటిగా ఏర్పడుతుంది. మొత్తం 39 హాస్పిటల్స్, 10,625ం బెడ్స్ మరియు 36,307ం ఉద్యోగులు, వైద్యులు ఈ ప్లాట్‌ఫారమ్ ద్వారా సేవలు అందిస్తారు. ఇది 9 రాష్ట్రాలు, 28 నగరాల్లో విస్తృత ప్రస్తుతిని కలిగి, లక్షల రోగులకు సేవలను అందిస్తుంది.
భవిష్యత్తులో మొత్తం బెడ్ సామర్థ్యాన్ని 14,710ం కి పెంచడం లక్ష్యంగా పెట్టబడింది. ఇందులో 4,080ం బెడ్స్ కొత్తగా జోడించబడ్డాయి. ఈ విస్తరణలో 2,368 బెడ్స్ అస్టర్ ద్వారా, మిగతా క్యూసిఐఎల్ ద్వారా పొందుతాయి. అస్టర్ ఈ విస్తరణ కోసం సుమారుగా ₹2,300 కోట్ల పెట్టుబడులను వినియోగించనుంది, ఇప్పటికే ₹350 కోట్లను ముఖ్య ప్రాజెక్టులలో ఉపయోగించారు.
భారతదేశంలో కీలక రాష్ట్రాల్లో గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టులు మరియు కొన్ని ప్రత్యేక కొనుగోళ్లు ద్వారా కొత్త హాస్పిటల్స్ నిర్మించబడతాయి. బెంగళూరు, కేరళం, హైదరాబాద్‌లో కొత్త హాస్పిటల్స్ నిర్మాణం జరుగుతుంది. ఇలా అస్టర్ భారతీయ వైద్య రంగంలో ఒక సమగ్ర, ప్రామాణిక మరియు పెద్ద స్థాయి హెల్త్‌కేర్ నెట్‌వర్క్‌గా స్థిరపడుతుంది.

## ఏఐ+ పల్స్ 2: బడ్జెట్ స్మార్ట్‌ఫోన్ లక్షణాలు




ఏఐ+ స్మార్ట్‌ఫోన్ తన పల్స్ 2 ఫోన్‌ను 2026 మార్చి 11న స్మార్ట్‌ఫోన్ లో ప్రారంభించింది, 4జిబి64జిబి మోడల్ ప్రారంభ ధర రూ. 5,999. 6,000ఎంఏహెచ్ బ్యాటరీ దీర్ఘకాలం ఉపయోగానికి ప్రధాన ఆకర్షణ, 120హెర్ట్జ్ డిస్‌ప్లే మరింత స్మూత్ అనుభవాన్ని ఇస్తుంది. 50ఎంపీ రియర్ మరియు 8ఎంపీ ఫ్రంట్ కెమెరా రోజువారీ ఫోటోగ్రఫీకి సరిపోతాయి, కానీ ప్రీమియం ఫోన్లను పోల్చలేవు. యూనిసోక్ టి7250 ప్రాసెసర్ సామాన్య కాల్‌లు, సోషల్ మీడియా, స్ట్రీమింగ్‌కి సరిపోతుంది, కానీ భారీ గేమింగ్‌కి అనుకూలం కాదు. నెక్స్ట్ క్వాంటమ్ యూజర్ ఫ్రెండ్లీ అనుభవాన్ని ఇస్తుంది. ఐపీ64 రేటింగ్ మరియు ఐదు రంగు ఎంపికలు ఉపయోగకరంగా ఉన్నాయి. ప్రారంభ రోజు ధరలో కొనుగోలు చేయడం ఆర్థికంగా మంచిది; దీర్ఘకాలిక సాఫ్ట్‌వేర్ మద్దతు ఫోన్ విలువను నిర్ధారిస్తుంది.

## హైలాండ్ ఇండియాకు కొత్త ఎండీ నియామకం



హైలాండ్ సంస్థ భారతదేశంలో తన కార్యకలాపాలను విస్తరించేందుకు మరియు గ్లోబల్ ఇంజినీరింగ్ వ్యూహాన్ని బలోపేతం చేసేందుకు కుమారణ్ ససికాంతన్‌ను ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ మరియు సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ ఇంజినీరింగ్‌గా నియమించింది. 25 ఏళ్ళకి పైగా అనుభవం కలిగిన ససికాంతన్, హైలాండ్ భారతీయ విభాగాలను అభివృద్ధి చేయడంలో, అతి మంచి ఇంజినీరింగ్ టీమ్‌లను సృష్టించి, గ్లోబల్ ఇంజినీరింగ్ కార్యకలాపాలను సమర్థవంతంగా నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తారు. ఈ నియామకం ద్వారా కంపెనీ భారతదేశం నుండి ఆవిష్కరణ, నైపుణ్య సాధన మరియు గ్లోబల్ సహకారాన్ని మరింత పెంపొందించేందుకు దోహదం అవుతుంది.

## మాక్స్ హెల్త్‌కేర్ "నెక్స్ట్ లీడర్స్"గా గుర్తింపు

MAX Healthcare | 25 YEARS OF SERVICE AND EXCELLENCE


మాక్స్ హెల్త్‌కేర్ ఇన్స్టిట్యూట్ లిమిటెడ్ 2025 భారతీయ కార్పొరేట్ గవర్నెన్స్ స్కోర్కార్డ్‌లో రెండో వరుస సంవత్సరం "నెక్స్ట్ లీడర్స్"గా గుర్తింపు పొందింది. ఈ గుర్తింపు కంపెనీ బోర్డు సమర్థత, పారదర్శకత, షేర్లదారుల హక్కులు మరియు సస్టైనబిలిటీ ప్రమాణాలలో ఉన్న నాణ్యతను ప్రదర్శిస్తుంది. దీని ద్వారా మాక్స్ హెల్త్‌కేర్ బిఎస్ఇ 100 సూచికలో టాప్ 20 కంపెనీలలో నిలిచింది, మరియు సంస్థ కార్పొరేట్ గవర్నెన్స్, బాధ్యతాయుత నాయకత్వం మరియు దీర్ఘకాలిక విలువ సృష్టించడంలో తమ స్థిరమైన కట్టుబాటును మరింత బలోపేతం చేసింది.

## నాథింగ్ ఫోన్ (4ఏ) సిరీస్ భారత్‌లో విడుదల




లండన్‌లోని నాథింగ్ సంస్థ తన ఫోన్ (4ఏ) సిరీస్ ను భారత మార్కెట్లో విడుదల చేసింది. 6.78 అంగుళాల అమోలేడ్ డిస్ప్లే, స్నాప్‌డ్రాగన్ 7 ఎస్ జెన్ చిప్‌సెట్, 50ఎంపీ ఓఐఎస్ ప్రైమరీ కెమెరా, 50ఎంపీ 3.5ఇ టెలిఫోటో లెన్స్ మరియు 32ఎంపీ సెల్ఫీ కెమెరా వంటి ఫీచర్లతో ఫోన్ (4ఏ) మిడ్-రేంజ్ స్మార్ట్‌ఫోన్ విభాగంలో ప్రతిష్టాత్మక అనుభవాన్ని అందిస్తుంది. 5400 ఎంఏహెచ్ బ్యాటరీ, 50వా ఫాస్ట్ చార్జింగ్, కొత్త గ్లిఫ్ బార్ లైటింగ్ ఇంటర్‌ఫేస్ మరియు తార్కిక ఏఐ ఫీచర్లతో స్మార్ట్ ఫోన్ ఉపయోగకర్తలకు వ్యక్తిగతీకరణ, వేగవంతమైన పనితీరు మరియు అధునాతన ఫోటోగ్రఫీ అనుభవాన్ని అందిస్తుంది. ఫోన్ (4ఏ) ధర ₹31,999 నుండి ప్రారంభమవుతుంది, ఫోన్ (4ఏ) ప్రో ధర ₹039,999 నుండి, మరియు ఫ్లిప్‌కార్ట్, రిలయన్స్ డిజిటల్, విజయ్ సేల్స్, క్రోమా వంటి ప్రముఖ రిటైల్ స్టోర్లలో లభిస్తుంది.

## ఐహెచ్‌సిఎల్ గేట్‌వే బ్రాండ్ 50 హోటళ్లు




భారత హోటల్స్ కంపెనీ లిమిటెడ్ (ఐహెచ్‌సిఎల్) గేట్‌వే బ్రాండ్ తన 50వ హోటల్‌గా హైదరాబాద్ సోమాజిగూడలో ఒక కొత్త హోటల్‌ను సంతకం చేసింది. ఈ హోటల్ 225 గదులతో, అన్ని రోజుల భోజనాల రెస్టారెంట్, ప్రత్యేక రెస్టారెంట్, బార్, జిమ్, స్విమ్మింగ్ పూల్, 11 బ్యాంక్వెట్ హాల్‌లు మరియు సమావేశ రూమ్‌లతో వ్యాపార, విశ్రాంతి మార్కెట్లకు సమగ్ర సదుపాయాలను అందిస్తుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఐహెచ్‌సిఎల్ తెలంగాణలో 8వ హోటల్‌ను ఏర్పాటు చేస్తూ, ప్రాంతీయ వ్యాపారం మరియు సాంస్కృతిక అనుభవాలతో కలసి అతిథులను ఆకర్షించనుంది.

## అశోక్ లేలాండ్ బ్యాటరీ ఫ్యాక్టరీ ప్రారంభం

ASHOK LEYLAND Koi Manzil Door Nahin

అశోక్ లేలాండ్ తమిళనాడులో పిల్లైపాక్కంలో కొత్త బ్యాటరీ ప్యాక్ తయారీ ఫ్యాక్టరీ స్థాపనకు శిలాన్యాసం చేసింది. ఈ ప్రాజెక్ట్ రూ. 400--500 కోట్లు పెట్టుబడి, భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహన ఉత్పత్తి మరియు సరఫరా శృంఖలనను బలోపేతం చేయడంలో కీలకంగా ఉంటుందని కంపెనీ పేర్కొంది. కొత్త ఫ్యాక్టరీ లోకల్ ఈవీ బ్యాటరీ తయారీని పెంపొందిస్తూ, నూతన ఉద్యోగావకాశాలు, నైపుణ్య అభివృద్ధి, మరియు తమిళనాడును ఆధునిక ఆటోమొబైల్ మరియు ఈవీ ఇన్నోవేషన్ కేంద్రంగా మార్చడానికి దోహదపడుతుంది.

## క్యానన్ స్కూల్ మరియు కాలేజీలకు మద్దతు

Canon Delighting You Always

క్యానన్ స్కూల్ మరియు కాలేజీలలో విద్యార్థుల తిరిగి ప్రవేశ పర్వం సమయంలో కార్యనిర్వహణను సులభతరం చేస్తుంది. ప్రవేశాలు, పరీక్షలు, ఫ్యాకల్టీ ప్రింటింగ్, మరియు పరిపాలన కార్యాలయాల డాక్యుమెంట్ అవసరాలను తీర్చడానికి కలర్ మరియు బ్లాక్-అండ్-వైట్ మల్టీఫంక్షన్ పరికరాలు, స్కానింగ్, కాపీ, నెట్‌వర్క్ మరియు మొబైల్ కనెక్టివిటీతో సామర్థ్యవంతమైన పరిష్కారాలను అందిస్తుంది. క్యానన్ ఇమేజ్‌ఫోర్స్ సి1333, ఇమేజ్‌క్లాస్ 1440ఐ, పిక్స్ఎంఎ జి4780 మరియు మాగ్జిఫై జిఎక్స్4070 వంటి మోడల్స్ వేగవంతమైన ప్రింటింగ్, ఆపరేషనల్ ఖర్చులను తగ్గించడం, డేటా భద్రతను కలిగి ఉండడం ద్వారా విద్యాసంస్థల్లో ఎడ్మిషన్ కిట్‌లు, ప్రశ్నాపత్రాలు, అధ్యాపక ప్రజెంటేషన్లు మరియు ఇతర డాక్యుమెంట్లను సమర్థవంతంగా నిర్వహించడానికి సహాయపడతాయి, తద్వారా విద్యార్థుల అభ్యాసం మరియు అభివృద్ధిపై దృష్టి సారించడానికి అవకాశముంటుంది.

## ట్రెడెన్స్ హైదరాబాద్ ఏఐ హబ్ ప్రారంభం



ట్రెడెన్స్ సంస్థ తెలంగాణ ప్రభుత్వం సహకారంతో హైదరాబాద్‌లో 20,000 చదరపు అడుగుల ఏఐ డెలివరీ మరియు ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభించింది. ఈ ఆధునిక సౌకర్యం రీటైల్, సిపిజి, హెల్త్‌కేర్ మరియు లైఫ్ సైన్స్ రంగాల్లో గ్లోబల్ ఏఐ డెలివరీను మద్దతు ఇస్తూ, 2027 వరకు 2,200 పైగా ఉద్యోగాలను సృష్టించనుంది. కొత్త కేంద్రం హైదరాబాద్‌ను భారత్‌లో గ్లోబల్ కెపాసిటీ సెంటర్ల మరియు ఏఐ ఇన్నోవేషన్ హబ్‌గా మరింత బలోపేతం చేస్తూ, కస్టమర్ల అవసరాలకు దగ్గరగా, వేగవంతమైన, ఖర్చు-సమర్థవంతమైన ఏఐ పరిష్కారాలను అందించడానికి ట్రెడెన్స టీమ్‌లకు అవకాశాలు కల్పిస్తుంది.




# సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన

● ఉభయసభల్లో తీర్మానం నోటీసులిచ్చిన విపక్షం ● ప్రధాన ఎన్నికల కమిషనర్ను తొలగించాలంటూ 'ఇండియా' కూటమి



న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను తొలగించాలంటూ 'ఇండియా' కూటమి పార్టీలు ఒక తీర్మానాన్ని పార్లమెంటు ముందుకు తెచ్చాయి. ఇందుకు సంబంధించిన తీర్మానం నోటీసును పార్లమెంటు ఉభయ సభల్లోనూ విపక్ష నేతలు శుక్రవారంనాడు ప్రవేశపెట్టారు. తీర్మానం నోటీసుపై 193 మంది ఎంపీలు సంతకాలు చేశారు. వీరిలో 130 మంది లోక్‌సభ, 63 మంది రాజ్యసభ ఎంపీలు ఉన్నారు. ఈ తీర్మానానికి సంబంధించి తృణమూల్ కాంగ్రెస్ ఇచ్చిన నోటీసు లోక్‌సభ సెక్రటేరియట్‌కు అందిందని, నోటీసు పరిశీలన ప్రక్రియ త్వరలోనే ప్రారంభమవుతుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. 'ఇండియా' కూటమికి దూరంగా ఉంటున్న ఆమ్ ఆద్మీ పార్టీ సైతం తీర్మానం నోటీసుపై సంతకాలు చేసింది. పలువురు ఇండిపెండెంట్ ఎంపీలు కూడా ఇందులో ఉన్నారు. ఎన్నికల ప్రధాన కమిషనర్‌ను తొలగించడానికి నోటీసు ఇవ్వడం భారత పార్లమెంటు చరిత్రలో ఇదే మొదటిసారి.ఏడు ఆరోపణలుసీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై ప్రవేశపెట్టిన తీర్మానం నోటీసులో విపక్షాలు ఏడు ప్రధాన ఆరోపణలు చేసినట్టు తెలుస్తోంది. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి పక్షపాత నిర్ణయాలు తీసుకుంటున్నారని, అనుచిత ప్రవర్తన రుజువైందని, ఎన్నికల అవకతవకలపై విచారణను ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారని, సామూహికంగా ఓటుహక్కును రద్దుచేశారని విపక్షాలు ఆరోపించాయి. కొన్ని పార్టీలకు అనుకూలంగా పక్షపాత వైఖరిని ప్రదర్శిస్తున్నారని కూడా నోటీసులో పేర్కొన్నాయి. తమ ఆరోపణలకు బలంచేకూర్చే పలు సుప్రీంకోర్టు తీర్పులను సైతం నోటీసులో ప్రస్తావించాయి. ఎస్ఐఆర్ ప్రక్రియలో కేంద్రంలోని అధికార పార్టీకి అనుకూలంగా సీఈసీ వ్యవహరిస్తున్నారని ఆరోపించాయి. అభిశంసన ఇలా..రాజ్యాంగ నిబంధనల ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించే పద్ధతిలోనే సీఈసీని తొలగించాల్సి ఉంటుంది. ఇందుకు లోక్‌సభలో 100 మంది, రాజ్యసభలో 50 మంది సంతకాలు అవసరం. స్పీకర్ నోటీసును అంగీకరిస్తే ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీ ఈ ఆరోపణలను పరిశీలిస్తుంది. ఆరోపణలు నిజమని తేలితే తీర్మానంపై ఓటింగ్ నిర్వహిస్తారు. ఉభయసభల్లోనూ హాజరైన ఎంపీల్లో మూడింట రెండు వంతుల మెజారిటీ లభిస్తే తీర్మానం నెగ్గుతుంది.

## హర్మూజ్‌లో 8 గ్యాస్ ట్యాంకర్లు!

ఇరాన్‌తో భారత్ కీలక చర్చలు




న్యూఢిల్లీ : అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతల వల్ల హర్మూజ్ జలసంధి గుండా ఇంధన రవాణాకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. జలసంధి వద్ద నిలిచిపోయిన ఎనిమిది గ్యాస్ ట్యాంకర్లను సురక్షితంగా భారత్‌కు రప్పించేలా ఇరాన్‌తో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. ఈ మేరకు భారత విదేశీ వ్యవహారాల శాఖ ఇరాన్ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

**జలసంధి వద్ద ఉత్కంఠ..**ప్రస్తుతం ఎనిమిది గ్యాస్ ట్యాంకర్లు హర్మూజ్ జలసంధికి సమీపంలో నిలిచిపోయి, ముందుకు వెళ్లేందుకు గ్రీన్ సిగ్నల్ కోసం వేచి చూస్తున్నాయి. అయితే, అదృష్టవశాత్తూ ఇప్పటికే రెండు చమురు నౌకలు జలసంధిని దాటి భారత్ వైపు ప్రయాణాన్ని ప్రారంభించాయి. మిగిలిన ఎల్‌పీజీ నౌకలను కూడా త్వరితగతిన రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చీతో పలుమార్లు ఫోన్ ద్వారా చర్చలు జరిపినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. నౌకల సురక్షిత ప్రయాణానికి ఇరాన్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఇదే సమయంలో, భారత్‌లో సుమారు 250 మంది ఇరాన్ నావికులు చిక్కుకుపోయి ఉన్నారు. వారిని స్వదేశానికి పంపేందుకు భారత ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. వారికి అవసరమైన వసతి, రక్షణను కూడా కల్పిస్తోంది. తమ నావికుల విషయంలో భారత్ చూపుతున్న చొరవ పట్ల ఇరాన్ సంతృప్తి వ్యక్తం చేస్తూ, గ్యాస్ ట్యాంకర్ల తరలింపునకు సహకరిస్తామనిహామీ ఇచ్చినట్లుకేంద్ర ప్రభుత్వవర్గాలసమాచారం అందుతోంది.

# పానిక్ బుకింగ్స్ వద్దు..

● దేశంలో వంటగ్యాస్ కొరత లేదు.. ● ప్రజలు ఆందోళన చెందొద్దని కేంద్రం విజ్ఞప్తి!



న్యూఢిల్లీ : అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో దేశంలో వంటగ్యాస్ కొరత ఏర్పడుతుందనే వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. దేశంలో ఎల్‌పీజీ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ స్పష్టం చేశారు. యుద్ధం కారణంగా సరఫరా నిలిచిపోతుందనే భయంతో ప్రజలు పెద్ద ఎత్తున గ్యాస్ సిలిండర్లను ముందస్తుగా బుక్ చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. గతంలో రోజుకు సగటున 55.7 లక్షల సిలిండర్ల బుకింగ్‌లు ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య ఏకంగా 75.7 లక్షలకు పెరగడం ప్రజల్లో ఉన్న భయాందోళనలకు నిదర్శనమని ఆమె వివరించారు. యుద్ధం కారణంగా విదేశీ దిగుమతులకు ఆటంకం కలిగిన మాట వాస్తవమేనని ప్రభుత్వం అంగీకరించింది. దేశ అవసరాలకు సంబంధించి 60 శాతం గ్యాస్‌ను భారత్ విదేశాల నుండే దిగుమతి చేసుకుంటుంది. ఇందులో 90 శాతం దిగుమతులు ఇరాన్ ఆధీనంలో ఉండే హార్మూజ్ జలసంధి గుండానే జరుగుతాయి. ప్రస్తుతం ఈ మార్గాన్ని ఇరాన్ మూసివేయడంతో పాటు సరుకు రవాణా చేసే ట్యాంకర్లపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో దిగుమతులు నిలిచిపోయాయి. ఇప్పటికే సుమారు 10 ట్యాంకర్లు ఈ దాడుల్లో ధ్వంసమవడంతో అంతర్జాతీయంగా ఇంధన సరఫరా వ్యవస్థ దెబ్బతిన్నది. ప్రపంచ చమురు మరియు ఎల్‌పీజీ రవాణాలో ఐదో వంతు వాటా కలిగిన ఈ మార్గం మూతపడటం చర్చ నీయాంశంగా మారింది.అయితే ఈ సంక్షోభాన్ని ఎదుర్కొ నేందుకు భారత్ ఇప్పటికే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గిస్తూ దేశీయంగా ఎల్‌పీజీ ఉత్పత్తిని 30 శాతం పెంచాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుతం ఉత్పత్తి అవుతున్న గ్యాస్ మొత్తాన్ని కేవలం గృహ అవసరాలకే మళ్లిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కొరత ఏర్పడకుండా ఉండేందుకు ఒక ప్రత్యేక కమిటీని కూడా ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ గ్యాస్ సరఫరా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించడంతో పాటు అవసరమైతే ఇతర మార్గాల ద్వారా దిగుమతులు చేసుకునేలా డైవర్షన్ ప్లాన్‌ను సిద్ధం చేస్తోంది.ప్రజలు పుకార్లను నమ్మవ ద్దని పెట్రోలియం శాఖ విజ్ఞప్తి చేసింది. సిలిండర్ల నిల్వలు సరిపడా ఉన్నందున అత్యవసరమైతే తప్ప పానిక్ బుకింగ్స్ చేయవద్దని కోరింది. ఇలాంటి సమయంలో అనవసరంగా స్టాక్ పేరుతో సిలిండర్లను బుక్ చేయడం వల్ల కృత్రిమ కొరత ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించింది. ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల దేశీయ ఉత్పత్తి పెరిగిందని సరఫరా వ్యవస్థ సజావుగా సాగుతుందని అధికారులు భరోసా ఇచ్చారు. యుద్ధ పరిస్థితులను గమనిస్తూ ఎప్పటికప్పుడు తగిన నిర్ణయాలు తీసుకుంటామని ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది.



# నెలసరి సెలవులు తప్పనిసరి కాదు

● అలాఅయితే మహిళలను ఎవరూ ఉద్యోగాల్లోకి తీసుకోరు‘ ● నెలసరి సెలవుల నియమాలను రూపొందించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీం వ్యాఖ్యలు ●తప్పనిసరి చేస్తే అది వాళ్ల ఉపాధి అవకాశాలపై ప్రతికూల ప్రభావం ఖాయమన్న ధర్మాసనం ● పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ ను తిరస్కరించిన న్యాయస్థానం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: మహిళా ఉద్యోగులకు 'నెలసరి' సెలవుల అంశం మీద దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేసింది. దేశవ్యాప్తంగా మహిళలకు, విద్యార్థినులకు అనివార్య నెలసరి లీవ్ ( అమలు చేయాలని కోరుతూ దాఖలైన పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ ను కోర్టు తిరస్కరించింది. పిటిషన్ వివరాలు:న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో, నెలసరి సమస్యల వల్ల బాధపడే మహిళలకు, విద్యార్థినులకు ప్రత్యేక లీవ్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలని కోరారు. అలాగే, మెటర్నిటీ బెనిఫిట్ యాక్ట్ 1961లోని సెక్షన్ 14ని సమర్థవంతంగా అమలు చేయాలని, దాని ఆధారంగా మెన్స్ట్రువల్ లీవ్ పాలసీ తీసుకురావాలని అభ్యర్థించారు.సుప్రీంకోర్టు వైఖరి:సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని బెంచ్ ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. ముఖ్యంగా సిజెఐ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఇందులో రెండు పార్శ్వాలు ఉన్నాయి. నెలసరి సెలవులు ఇస్తే ఉద్యోగాల్లో చేరేందుకు మరింతమంది మహిళలను ప్రోత్సహించినట్లవుతుంది. అయితే, వీటిని తప్పనిసరి చేయాలని యజమానులను బలవంతపెడితే అది ప్రతికూల పరిస్థితులకు దారితీయొచ్చు. చట్టం ద్వారా అనివార్యంగా నెలసరి సెలవులు ఇవ్వాలంటే, ఎవరూ మహిళలను ఉద్యోగాలకు తీసుకోరు. సంస్థల యాజమాన్యాల మనస్తత్వం మీకు తెలియదు! వాలంటరీగా సెలవులు ఇస్తే బాగుంది.. కానీ చట్టం చేసి కంపల్సరీ చేస్తే... జ్యుడీషియరీలో, గవర్నమెంట్ జాబ్స్‌లో కూడా తీసుకోరు. నెలసరి వల్ల ఏదో చెడు జరుగుతోంది అన్నట్టుగా చూపిస్తే, మహిళలను ఆత్మనూన్యతకు గురిచేసేలా ఉంటుంది' అని జజీ× అభిప్రాయపడ్డారు. అయితే, సంబంధిత అధికారులు అన్ని స్టేక్‌హోల్డర్లతో చర్చించి నెలసరి లీవ్ పాలసీ రూపొందించే అంశాన్ని పరిశీలించాలని ఆదేశిస్తూ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది.నేపథ్యం:కేరళ రాష్ట్రంలోని స్కూళ్లలో ఆడపిల్లలకు నెలసరి లీవ్ రిలాక్సేషన్ ఇస్తున్నారు. కొన్ని ప్రైవేట్ కంపెనీలు వాలంటరీగా మహిళలకు నెలసరి సెలవులు ఇస్తున్నాయి. దేశవ్యాప్తంగా కూడా దీని మీద కంపల్సరీ చట్టం చేయాలని న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఇవాళ ఈ పిటిషన్ మీద సుప్రీంకోర్టులో విచారణ జరిగింది.

## త్వరలోనే ఇరాన్ లొంగిపోతుంది

ఇరాన్ యుద్ధంపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు



వాషింగ్టన్ : దాదాపు రెండు వారాలుగా కొనసాగుతున్న ఇరాన్‌తో యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్ త్వరలోనే లొంగిపోతుందని పేర్కొన్నారు. రెండ్రోజుల క్రితం జీ7 నేతల వర్చువల్ భేటీలో ట్రంప్ పేర్కొన్నట్లు ఓ వార్త సంస్థ తెలిపింది. అమెరికా–ఇజ్రాయెల్ దాడులకు ప్రతికారం తీర్చుకుంటామని, వారికి వ్యతిరేకంగా తమ పోరాటాన్ని కొనసాగించాలని ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ వ్యాఖ్యలకు ముందు ట్రంప్ చేసినట్లు తెలిపింది.ఇరాన్‌కు మరోసారి అమెరికా అధ్యక్షుడుల డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. మతిచెడిన ఉన్మాదులకు ఇవాళ ఏం జరుగుతుందో చూడండని అంటూ ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్ నౌకాదళం ఇప్పటికే కనుమరుగయ్యిందని, వైమానికదళం కూడా ఇక లేదని తెలిపారు. ఇరాన్ నాయకులు భూమిపై నుంచి తుడిచిపెట్టుకుపోయారని పేర్కొన్నారు. వారి క్షిపణులు, డ్రోన్లు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయని పేర్కొన్నారు. 47 ఏళ్లుగా ఇరాన్ నేతలు అమాయకులను పొట్టనపెట్టుకున్నారన్నారని తెలిపారు. అమెరికా 47వ అధ్యక్షుడిగా వారిని అంతం చేయడం తనకు లభించిన గొప్ప గౌరవంగా భావిస్తున్నట్టు చెప్పారు.

**ఇరాక్‌లోని విమాన ప్రమాదంలో నలుగురు మృతి**

ఇక శుక్రవారం పశ్చిమ ఇరాక్‌లో అమెరికాకు చెందిన రీఫ్యూయలింగ్ విమానం కేసీ –135 ట్యాంకర్ ఘటనపై యూఎస్ మిలటరీ సెంట్రల్ కమాండ్ స్పందించింది. ప్రమాద సమయంలో విమానంలో ఆరుగురు సిబ్బంది ఉండగా, నలుగురు ప్రాణాలు కోల్పోయినట్లు పేర్కొంది. సహాయక చర్యలు కొనసాగిస్తున్నామని, ఘటనకు దారితీసిన పరిస్థితులపైనా దర్యాప్తు చేస్తున్నామని తెలిపింది. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో భాగంగా ఈ ఘటన జరిగినట్లు పేర్కొంది. రెండు కేసీ–135 విమానాలు పాల్గొనగా ఒకటి కూలిపోయింది. రెండోది సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. విమానం వెనుక భాగం సగం కోల్పోయినప్పటికీ, ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌లో ల్యాండ్ చేశారు. ఇరాన్ మాత్రం ఇరాక్ రెస్టిస్టెన్స్ గ్రూపు కూల్చివేసినట్లు ఆ విమానాన్ని కూల్చివేసినట్లు పేర్కొంది.

మరోవైపు ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడులు మరింత తీవ్రమయ్యాయి. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుడు సంభవించింది. అమెరికా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ప్రదర్శన జరుగుతుండగా టెహ్రాన్ స్క్వేర్ లో పేలుడు జరిగింది. ఈ ఘటనలో పలువురు గాయపడినట్టు తెలుస్తోంది. గత 24 గంటల వ్యవధిలో 200కుపైగా లక్ష్యాలపై దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. టెహ్రాన్‌లోని ఉగ్రవాదుల ముఠా కీలక మౌలిక కేంద్రాలపై విరుచుకుపడినట్లు తెలిపింది. పదుల సంఖ్యలో ఫైటర్ జెట్లు భీకర దాడులు చేసినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. పెద్దసంఖ్యలో పేలుడు శబ్దాలు వినిపించినట్లు టెహ్రాన్‌లోని అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు వెల్లడించారు. ఇరాన్ ప్రతిదాడుల సామర్థ్యాన్ని పూర్తిగా తగ్గించడమే లక్ష్యమని ఐడీఎఫ్ స్పష్టం చేసింది. కీలకమైన అణు సంబంధిత కేంద్రంపైనా దాడి చేసినట్లు వెల్లడించింది.మరోవైపు లెబనాన్‌లోని హెజ్‌బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు మరింత పెరిగాయి. బీరుట్‌లో ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ఒకరు ప్రాణాలు కోల్పోయారని లెబనాన్ ఆరోగ్య శాఖ తెలిపింది. మరో దాడిలో క్షిపణి ఓ అపార్ట్‌మెంటును తాకిందని, పెద్దఎత్తున మంటలు చెలరేగాయని అధికారులు తెలిపారు. ఈ దాడిలో ఓ ముస్లిం బ్రదర్‌హుడ్ విభాగం అధికారి గాయపడగా ఆయన ఇద్దరు కుమారులు చనిపోయారని వెల్లడించారు. హెజ్‌బొల్లా సభ్యుడిని లక్ష్యంగా చేసుకొని ఈ దాడి చేసినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది.

ఇదిలా ఉండగా, ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ఇజ్రాయెల్, అమెరికా దళాలపై తమ 44వ విడత భారీ క్షిపణి దాడులు చేపట్టినట్లు ప్రకటించింది. ఇజ్రాయెల్ ఉత్తర ప్రాంతంలోని కిర్యత్ ష్మోనా, హడెరా, హైఫా వంటి నగరాలపై క్షిపణులతో విరుచుకుపడినట్లు వెల్లడించింది. ఇజ్రాయెల్‌తోపాటు గల్ఫ్‌లోని అమెరికా సైనిక స్థావరాలు, బహ్రెయిన్ కేంద్రంగా పనిచేసే అమెరికా ఐదో నౌకాదళం లక్ష్యంగానూ దాడులు జరిగాయి. ఈ దాడిలో.. అధునాతన క్షిపణులను ఇరాన్ వాడినట్లు తెలుస్తోంది. ఈ క్షిపణులను అడ్డుకోవడానికి ఇజ్రాయెల్ తమ వైమానిక రక్షణ వ్యవస్థలను యాక్టివేట్ చేసింది. మరోవైపు అమెరికా తన స్థావరాల రక్షణకు అదనపు బలగాలను మోహరిస్తోంది.

# ఈశాన్యంలో బీజేపీతోనే శాంతి



● కాంగ్రెస్‌వి అన్నీ స్వార్థంతో చేసుకున్న ఒప్పందాలే ● రెండు రోజుల అసోం పర్యటనలో ప్రధాని మోడీ

● రూ.4,570 కోట్లు విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం ● మూడు కొత్త రైలు సర్వీసులకు జెండా ఊపిన ప్రధాని

న్యూఢిల్లీ : ఈశాన్య రాష్ట్రాల్లో శాశ్వతంగా శాంతిస్థాపనకు బీజేపీ చర్యలు చేపట్టిందని, కానీ స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీ వివిధ ఒప్పందాలు చేసుకుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. బాంబు పేలుళ్లు, తుపాకీ కాల్పుల మోతలు గతంలో ఈశాన్య రాష్ట్రాల్లో వినిపించేవని, కానీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు వచ్చాక ఇక్కడి పరిస్థితి మారిపోయిందని ఆయన తెలిపారు. ఇప్పుడు అసోం రాష్ట్రం శాంతి, అభివృద్ధిలో కొత్త అధ్యాయాన్ని లిఖిస్తోందన్నారు.అసోంలోని కోక్రఝర్ జిల్లాలో బీజేపీ ఏర్పాటు చేసిన బహిరంగ సభను ఉద్దేశించి గువహటి నుంచి ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. కోక్రఝర్‌లో జరిగే సభకు మోదీ వెళ్లాల్సి ఉండగా, అకస్మాత్తుగా వర్షం కురవడంతో ఆయన ప్రయాణానికి ఆటంకం కలిగింది. స్థానికుల భూములను చొరబాటుదారు లకు కట్టబెట్టడం ద్వారా భారత జాతీయ భద్రతను కాంగ్రెస్ పార్టీ ప్రమాదంలోకి నెడుతోందని మోదీ విమర్శించారు. అందుకే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని శిక్షించి, ఈ దేశంలో చొరబాటుదారులకు చోటు లేదనే స్పష్టమైన సందేశాన్ని ఇవ్వాలని అసోం ప్రజలకు పిలుపునిచ్చారు .

**కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీల దుకాణం**

కాంగ్రెస్ పార్టీ అనేది అబద్ధపు హామీల దుకాణమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం సమాజంలోని వివిధ వర్గాల ప్రజల మధ్య హస్తం పార్టీ చీలికలను సృష్టిస్తోందని ఆయన మండిపడ్డారు. బోడోల్యాండ్‌కు చెందిన చాలా తరాల ప్రజలను కాంగ్రెస్ పార్టీ తప్పుడు కలల ప్రపంచంలో ఉంచి కాలయాపన చేసిందన్నారు. కేంద్రంలో, అసోంలో బీజేపీ అధికారంలోకి వచ్చాకే బోడో శాంతి ఒప్పందంపై సంతకాలు జరిగాయని ప్రధాని మోదీ గుర్తుచేశారు. దీని ద్వారా అన్ని ప్రధాన సంస్థలు, గ్రూపులను ఏకతాటిపైకి తెచ్చామ న్నారు.


**బోనస్ గిఫ్టుగా నాలుగు సూపర్ అబద్ధాలు‘**

‘కాంగ్రెస్‌కు చెందిన అబద్ధపు హామీల దుకాణంలో ప్రతీ అబ ద్ధపు హామీతో పాటు నాలుగు సూపర్ అబద్ధాలను బోనస్ గిఫ్ట్ గా ఇస్తుంటారు. ఎందుకంటే ఆ హామీలను నెరవేర్చా లనే ఉద్దేశమే కాంగ్రెస్ పార్టీకి ఉండదు. బీజేపీ అసోంలో గెలిచాకే, బోడోల్యాండ్‌లో శాంతి, వికాసం మొదలయ్యాయి. బోడో వర్గం ప్రజలు భాషను, సంస్కృతిని కాపాడుకుంటున్న తీరును తలుచుకుంటే నాకు గర్వంగా అనిపిస్తుంది.

మీ ప్రేమ కు నేను రుణపడిపోయాను. ఇక్కడ అభివృద్ధి పనులు చేసి ఆ రుణాన్ని తీర్చుకుంటాను. కొన్నివారాల క్రితం, బోడో సంస్కృతితో ముడిపడిన కార్యక్రమాలను చూసే అవకాశం నాకు గువహాటిలో లభించింది. 2020 అగ్రిమెంట్‌లో భాగంగా మేం ఇచ్చిన హామీలన్నీ ఒకదాని తర్వాత ఒకటిగా అమలుచేసి తీరుతాం. బోడో భాషకు ఇప్పటికే సహ అధికార భాష హోదాను ఇచ్చాం.


బోడోల్యాండ్ వికాసానికి రూ.1,500 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ఇచ్చాం. ప్రస్తుతం కోక్రఝర్‌లో ఒక మెడికల్ కాలేజీ కూడా ఉంది. ఇళ్లకు తిరిగొచ్చిన కుమారుల తల్లులు అందరూ నాకు దీవెనలు ఇస్తున్నారు. ఆ యువకులంతా ఇప్పుడు కుటుంబాలతో సంతోషంగా, శాంతితో జీవిస్తున్నారు'' అని ప్రధాని మోదీ తెలిపారు.ప్రధాని ప్రారంభించిన ప్రాజెక్టువీఅసోంలోని కోక్రఝర్ జిల్లాకు సంబంధించిన రూ. 4,570 కోట్లు విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభించారు.

కోక్రఝర్ జిల్లా బాష్‌బరీలో రైల్వేశాఖకు చెందిన పీరియాడిక్ ఓవర్ హాలింగ్ (పీఓహెచ్) వర్క్‌షాప్ పనులకు ప్రధాని మోదీ శుక్రవారం పునాది రాయి వేశారు. ఈ ప్రాజెక్ట వల్ల స్థానికంగా రైళ్ల నిర్వహణ సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయి. ప్రధాని పచ్చజెండా ఊపి కోక్రఝర్ జిల్లాతో పాటు ఈశాన్య రాష్ట్రాల మధ్య కనెక్టివిటీని పెంచే మూడు కొత్త రైలు సేవలకు శ్రీకారం చుట్టారు. ఈ మూడు రైలు సర్వీసుల్లో కామాఖ్య – చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్, గువహటి న్యూ జల్పాయ్‌గురి ఎక్స్‌ప్రెస్, నారంగి – అగర్తలా ఎక్స్‌ప్రెస్ ఉన్నాయి.కామాఖ్య – చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ అనేది ఈశాన్య రాష్ట్రాలతో దక్షిణ భారతదేశాన్ని లింక్ చేస్తుంది.ఈ కొత్త రైలు సర్వీసులు అసోంలో టూరిజం, రవాణా, వ్యవసాయం, గ్రామీణ వికాసాలకు ఊతం ఇస్తాయి.అసోం మాలా 3.0 అనే ప్రధానమైన రోడ్డు మౌలిక సదుపాయాల ప్రాజెక్టు పనులకు ప్రధాని మోదీ శుక్రవారం భూమిపూజను నిర్వహించారు. రూ.3,200 కోట్లు విలువైన ఈ ప్రాజెక్టు ద్వారా అసోంవ్యాప్తంగా 900కుపైగా కి.మీ రోడ్లను నిర్మించనున్నారు. నేషనల్ హైవేలను, గ్రామీణ రోడ్లతో అనుసంధానించనున్నారు.బోడోలాండ్ టెర్రిటోరియల్ కౌన్సిల్ ఏరియాలో 6 రోడ్డు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ప్రధాని మోదీ భూమి పూజను నిర్వహించారు. ఇందులో భాగంగా రూ.1,100 కోట్లతో నాలుగు ఫ్లై ఓవర్లు, రెండు బ్రిడ్జీలను నిర్మించనున్నారు.ఇక మార్చి 14న (శనివారం రోజు) అసోంలోని సిల్చార్‌లో వివిధ ప్రాజెక్టులకు ప్రధాని మోదీ భూమి పూజ నిర్వహించనున్నారు. పనులు పూర్తయిన పలు ప్రాజెక్టులను దేశానికి అంకితం ఇవ్వనున్నారు. ఈ ప్రాజెక్టుల మొత్తం విలువ దాదాపు రూ.23,550 కోట్లు.వచ్చే నెలోనే అసోం ఎన్నికలు?వచ్చే (ఏప్రిల్) నెలోనే అసోంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో రెండు రోజుల పర్యటన కోసం శుక్రవారం రోజే అసోంకు ప్రధాని మోదీ చేరుకున్నారు. ఇప్పటికే వరుసగా రెండు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయ దుందుభి మోగించింది. ఈసారి ఎన్నికల్లోనూ గెలిచి, వరుసగా మూడోసారీ అసోం అధికార పీఠాన్ని కైవసం చేసుకోవాలనే సంకల్పంతో మోదీసేన ఉంది.



# రాజ్యాంగం ప్రజల గొంతుక- గాడ్సే, వీర్‌సావర్క్‌ది కాదు

సంవిధాన్ సమ్మేళన్ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ : రాజ్యాంగం ప్రజల గొంతుకని, నాథూరామ్ గాడ్సే, వీర్ సావర్కర్‌లది కాదని లోక్‌సభలో విపక్షనేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యాంగ సిద్ధాంతాన్ని పాటించరని ఆరోపించారు. ఉత్తర్‌ప్రదేశ్ లఖ్‌నవూలో జరిగిన సంవిధాన్ సమ్మేళన్‌లో రాహుల్ ఈ మేరకువ్యాఖ్యానించారు.నిన్న పార్లమెంట్‌లో నేను ఎప్‌స్టీన్ అనే పదాన్ని ఉచ్చరించాను. దేశంలో గ్యాస్ సిలిండర్లు అందుబాటులో లేనందున ఈ సమస్య ఇంధన భద్రతకు సంబంధించినదని చెప్పాను. దేశ ఇంధన భద్రతలో మోదీ రాజీపడ్డారు. ఇంధన భద్రతలో ఎందుకు రాజీ పడ్డారు? అని కేంద్రాన్ని ప్రశ్నించాను. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రిగా హర్దీప్‌సింగ్ పూరీని నియమించారు. ఇది అమెరికాతో పడిన మొదటి రాజీ. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో పూరీ పేరు ఉంది. ఆయన ఎప్‌స్టీన్‌కు ఫ్రెండ్ అని రాహుల్ పేర్కొన్నారు.

**అమెరికా కోసం మోదీ పనిచేస్తున్నారు :** ప్రధాని నరేంద్ర మోదీ ఎప్‌స్టీన్, గౌతమ్ అదానీతో రాజీ పడడం వల్ల అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందంలో భారత్ ప్రయోజనం పొందలేకపోయిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. నరేంద్ర మోదీ ఇకపై భారతదేశ ప్రధాని కాదని, ఆయన అమెరికా కోసం పనిచేస్తున్నారని విమర్శించారు. తాను నిన్న (గురువారం) పార్లమెంట్‌లో నిజాలు మాట్లాడుతుంటే, మోదీ లోక్‌సభ నుంచి వెళ్లిపోయారని అన్నారు.

కాంగ్రెస్ పేదల పార్టీగా మారింది. అదే సమయంలో బీజేపీ మాత్రం ధనవంతుల పార్టీగా మారింది. బీజేపీ, మోదీ దేశ సంపద మొత్తాన్ని అదానీ చేతుల్లో పెట్టేశారు. అమెరికాలో దాఖలైన న్యాయపరమైన కేసు అదానీపై కాదు, బీజేపీపైనే. దీన్ని ఆసరాగా చేసుకుని వాణిజ్య ఒప్పందంపై అమెరికా భారత్‌పై ఒత్తిడి తెచ్చింది. ఫలితంగా మోదీ ఇప్పుడు అమెరికా కనుసన్నల్లో పనిచేస్తున్నారు. పార్లమెంటు నుంచి హఠాత్తుగా బయటకు వెళ్లి, మరెవరినీ సంప్రదించకుండానే కేవలం ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడి మోదీ ట్రేడ్ డీల్‌ను ఖరారు చేశారు అని రాహుల్ విమర్శించారు.దేశం పురోగతి సాధిస్తుంటే అందులో పేదలు వారి నేపథ్యంతో సంబంధం లేకుండా ఉండాలి. దేశంలోని 500 అతిపెద్ద కంపెనీల జాబితాను రూపొందించండి. అందులో సీఈఓలు, పెద్ద పెద్ద స్థాయిలో ఉన్నవారిని గుర్తించండి. అప్పుడు ఎన్ని కంపెనీల్లో దళితులు, ఆదివాసీలు, ఓబీసీలు, ఈబీసీలు, మైనార్టీలు సీఈఓ, పెద్ద పొజిషన్‌లో ఉన్నారో చూడండి. ఒక్కరూ కూడా ఉండరు. అలాగే అదానీ గ్రూప్ సంస్థల ఉద్యోగుల జాబితాను చూడండి. అక్కడ పెద్ద హోదాలో ఒక్క దళితుడు, వెనుకబడిన తరగతి, ఎస్టీ వ్యక్తి కనిపించరు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లోని ప్రచారక్‌లను చూడండి. అక్కడ ఓబీసీ, దళిత, ఆదివాసీ వర్గాలకు చెందిన ఒక్క ప్రచారక్ కూడా మీకు కనిపించరు. ఇదే బీజేపీ రాజకీయ విధానం.

సిద్ధాంతాల విషయంలో కాన్షీరామ్ ఎప్పుడూ రాజీపడలేదు కాన్షీరామ్ తన సిద్ధాంతాల విషయంలో ఎప్పుడూ రాజీపడలేదని రాహుల్ గాంధీ తెలిపారు. ఒకవేళ ఆయన అలా చేసి ఉంటే ఆయన చిత్రపటం ఇక్కడ ఎప్పటికీ ప్రదర్శితమయ్యేది కాదన్నారు. ఈ రోజు కాన్షీరామ్ స్మరించుకుందామని అన్నారు. ఆయన పోరాటం, దార్శనికత దేశ రాజకీయాలపై ప్రభావం చూపిందన్నారు. మన ఆలోచనల కోసం పోరాడకపోతే ఏమీ సాధించలేమన్నారు.

## ఈశాన్య భారతదేశానికి విస్తరించిన అమెజాన్ ఎయిర్

తొలి ఎయిర్ విమానాన్ని స్రారంభించిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్ మోహన్ నాయుడు




అమెజాన్ ఇండియా తన విమాన రవాణా సేవలను ఈశాన్య భారత ప్రాంతానికి విస్తరిస్తున్నట్లు ఇవాళ అధికారికంగా ప్రకటించింది. అమెజాన్ ఎయిర్ విభాగంలో భాగంగా కోల్‌కతా మరియు గువాహటి నగరాలను అనుసంధానిస్తూ సరికొత్త ఎయిర్ కార్గో రూట్లను కంపెనీ ప్రారంభించింది. దీని ద్వారా ఈ ప్రాంతం అంతటా తన లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలను మరియు రవాణా సౌకర్యాలను అమెజాన్ మరింత పటిష్టం చేసుకుంది.


న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి గువాహటికి వెళ్లే మొదటి అమెజాన్ ఎయిర్ విమానాన్ని భారత ప్రభుత్వ పౌర విమానయాన శాఖ మంత్రి రామ్ మోహన్ నాయుడు కింజారపు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ప్రతిష్టాత్మక ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రితో పాటు అమెజాన్ ఇండియా మరియు ఆస్ట్రేలియా ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ అభినవ్ సింగ్ మరియు అమెజాన్ ఇండియా పబ్లిక్ పాలసీ వైస్ ప్రెసిడెంట్ చేతన్ కృష్ణస్వామి కూడా పాల్గొన్నారు. ఈ విమాన సర్వీసు ప్రారంభం ద్వారా ఈశాన్య భారత ప్రాంతానికి విమాన రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి.

రామ్‌మోహన్ నాయుడు కింజారపు మాట్లాడుతూ.. యాక్ట్ ఈస్ట్, యాక్ట్ ఫాస్ట్, యాక్ట్ ఫస్ట్ అనే దార్శనికతతో గౌరవనీయులైన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈశాన్య ప్రాంతానికి ఇస్తున్న అత్యంత ప్రాధాన్యత వల్ల, అక్కడ మౌలిక సదుపాయాలు మరియు రవాణా సౌకర్యాలు ఎంతో వేగంగా వృద్ధి చెందాయని పేర్కొన్నారు. నేడు ఈశాన్య రాష్ట్రాల్లోని ప్రతి రాష్ట్రానికి ఒక విమానాశ్రయం ఉందని, 2014లో 9గా ఉన్న పని చేసే విమానాశ్రయాల సంఖ్య నేడు 16కు పెరిగిందని ఆయన వెల్లడించారు. ఈశాన్య ప్రాంతానికి హార్టికల్చర్ మరియు కార్గో ఎగుమతుల్లో ఉన్న అపారమైన అవకాశాలను దృష్టిలో ఉంచుకుని, ఢిల్లీ నుండి గువాహటి అమెజాన్ ఎయిర్ కార్గో రూట్‌ను ప్రారంభించడం వల్ల అక్కడి రైతులు, కళాకారులు మరియు పారిశ్రామికవేత్తలకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన తెలిపారు. దేశంలో ఎయిర్ కార్గో వృద్ధిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక కీలక చర్యలు తీసుకుందని మంత్రి వివరించారు. ముఖ్యంగా 2026 బడ్జెట్‌లో పాడైపోయే వస్తువులు మరియు విలువైన ఉత్పత్తుల రవాణా కోసం ఎయిర్ కార్గో మౌలిక సదుపాయాలు మరియు గిడ్డంగి సామర్థ్యాన్ని పెంచడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన చెప్పారు.




# 175 ఎంఎస్ ఎంఈ పార్కుల్లో సొంత వ్యాపారాలు

● ఏపీ ఎస్పీలో అధికారుల పోస్టుల సంఖ్య పెంపు ● 'తెలుగు కల్చరల్ సెంటర్' నిర్మాణ పనులకు నిధులు
● కేంద్రీయ విద్యాలయ పాఠశాల స్థాపనకు భూములు ● కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలను మంత్రి సారథి వెల్లడి




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి శుక్రవారం జరిగిన ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకన్నది. ఏపీ ఎస్పీలో అధికారుల పోస్టుల సంఖ్యను పెంచింది. పరిశ్రమలకు స్థలాలు కేటాయించే సమయంలో అక్కడి ప్రభుత్వ భూమిని 22 ఎ నుంచి మినహాయించాలని నిర్ణయం తీసుకున్నది. ఇంకా కేబినెట్ తీసుకున్న పలు నిర్ణయాలను మంత్రి సారథి మీడియాకు విరించారు. ఏపీ ఎస్పీలో ప్రస్తుతం 300 మంది హెడ్ కానిస్టేబుల్ పోస్టులను అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లుగా స్థాయిని పెంచడానికి మంత్రి మండలి ఆమోదం తెలిపింది. దీనికి అనుగుణంగా అదే సంఖ్యలో హెడ్ కానిస్టేబుల్ పోస్టులు నియంత్రించడం జరుగుతుంది. మొత్తం 393 పోస్టుల అప్గ్రేడేషన్ కోసం ప్రతిపాదనలు రాగా, ఆర్థిక శాఖ 300 పోస్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పాత పద్ధతిలో ఒక ప్లాటూన్ కి కేవలం ఒకే ఒక్క ఏఆర్ఎస్ఐ ఉండేవారు. మిగతా సెక్షన్స్ అంతా హెడ్ కానిస్టేబుళ్ల ఆధీనంలో నడిచేవి. ఈ కొత్త మార్పుతో ఒక ప్లాటూన్ కి ఏఆర్ఎస్ఐల సంఖ్య మూడుకు పెరుగుతుంది. దీనివల్ల లా అండ్ ఆర్డర్ సమస్యలు వచ్చినప్పుడు, వీఐపీల బందోబస్తులో, విపత్తుల సమయంలో కమాండ్ కంట్రోల్ మెరుగవ్వడమే కాకుండా స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకోవడం చాలా సులువవుతుంది 2. పరిశ్రమలు ఉ వాణిజ్యం:పారిశ్రామిక ప్రాజెక్టులు సరైన సమయంలో అమలు జరగడానికి, పారిశ్రామికవేత్తలు బ్యాంకులు మరియు ఆర్థిక సంస్థల నుండి రుణ సహాయం సులభంగా పొందడానికి, రాష్ట్రంలో వ్యాపారం చేయడం మరింత సులువు చేయడానికి, పెట్టుబడులు వేగవంతం చేయడానికి మరియు ఉపాధి అవకాశాలు పెంచడానికి అవసరమైన చర్యలకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు మంత్రి మండలి కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా, ఎలాంటి అభ్యంతరాలు లేని 66,157 ఎకరాల ఏపీఐఐసీ భూములను సెక్షన్ 22 ఏ నిషేధిత జాబితా నుంచి తక్షణమే తొలగించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే, నిబంధనల ప్రకారం పరిశ్రమల నిర్మాణం పూర్తయిన తర్వాత మరో 3,803 ఎకరాలను కూడా షరతులతో ఈ జాబితా నుంచి తొలగించనున్నారు. వీటికి అదనంగా, సుమారు 51,603 ఎకరాల ప్రభుత్వ మరియు ఇతర భూములను నేరుగా ఏపీఐఐసీ పేరు మీదకు రెవెన్యూ రికార్డుల్లో మార్చేందుకు ఒకేసారి అనుమతి మంజూరు చేసింది. ఈ నిర్ణయంతో పారిశ్రామికవేత్తలకు లైన్ క్లియర్ అవ్వడమే కాకుండా, బ్యాంకుల్లో లోన్లు తెచ్చుకుని ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడానికి వీలవుతుంది.

పరిశ్రమలు ఉ వాణిజ్యం:ఎంప్లాయ్మెంట్ జనరేషన్ ప్రోగ్రామ్' పేరిట ప్రతిపాదిత పథకానికి ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద దాదాపు 3,500 మంది మైక్రో ఎంటర్ప్రెన్యూర్లకు వారి తయారీ కార్యకలాపాలకు ఆర్థిక సహాయం అందించనున్నారు. దీనికి రూ.300 కోట్ల నిధులు కేటాయించారు. ఈ పథకం ద్వారా దాదాపు 17,000 మందికి ఉద్యోగాల కల్పన జరుగుతుందని అంచనా. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 175 ఎంఎస్ఎంఈ పార్కుల్లో సొంతంగా తయారీ పరిశ్రమలు పెట్టాలనుకునే వారి కోసం ప్రత్యేకంగా దీన్ని డిజైన్ చేశారు. రాబోయే నాలుగేళ్ల పాటు ఇది అమల్లో ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగులు, మహిళలు లాంటి ప్రత్యేక కేటగిరీల కింద వచ్చే వారికి ప్రాజెక్టు ఖర్చులో 25 నుంచి 35 శాతం వరకు మార్జిన్ మనీ సబ్సిడీని ప్రభుత్వం అందిస్తుంది. ఈ సబ్సిడీని నేరుగా కాకుండా మూడేళ్ల పాటు ఫిక్సుడ్ డిపాజిట్ గా ఉంచి ఆ తర్వాత లోన్ అకౌంట్లో సర్దుబాటు చేస్తారు.

పురపాలక, పట్టణాభివృద్ధి :అమరావతిలోని నీరుకొండలో ఈపీసీ కాంట్రాక్ట్ పద్ధతిలో 'తెలుగు కల్చరల్ సెంటర్' నిర్మాణ పనులకు ఇతర నిబంధనలతో కలిపి రూ.119.27 కోట్ల మొత్తానికి రాష్ట్ర మంత్రి మండలి పరిపాలన ఆమోదం తెలిపింది.ఐదెకరాల స్థలంలో నిర్మించబోయే ఈ కేంద్రంలో 2000 మంది కూర్చునే భారీ గ్రాండ్ ఆడిటోరియం, 1000 మందికి సరిపడా ఓపెన్ ఎయిర్ థియేటర్ తో పాటు తెలుగు భాషా మ్యూజియం కూడా రాబోతున్నాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలుగు కళలు, సాహిత్యం, సినిమా వైభవాన్ని చాటేలా దీన్ని ఒక అద్భుతమైన కల్చరల్ హబ్ గా తీర్చిదిద్దనున్నారు. గ్రీన్ బిల్డింగ్ నిబంధనలకు అనుగుణంగా డిజైన్ చేసిన ఈ కేంద్రం ఏడాది పొడవునా పర్యాటకులను ఆకర్షిస్తుంది.సీఆర్డీఏ ప్రాంతంలోని వివిధ సంస్థలకు భూమి కేటాయింపు సమీక్షకు సంబంధించిన మంత్రుల బృందం 24వ సమావేశం సిఫార్సులకు ఆమోదం తెలిపింది. సీఆర్డీయే ప్రాంతంలో తాజాగా ఆమోదించిన భూకేటాయింపుల్లో సీబీఎస్ఈ రీజనల్ ఆఫీస్ కు 0.8 ఎకరాలు, ఏపీఎస్ఐఆర్డీ అండ్ పీఆర్ ఎడ్యుకేషనల్ క్యాంపస్ కు సుమారు 5 ఎకరాలు ఇచ్చారు. అంతేకాకుండా గతంలో నిడమర్రులో కిమ్స్ ఆదిత్య విద్యాసంస్థలకు కార్పొరేట్ హాస్పిటల్స్ కోసం ఇచ్చిన భూముల కేటాయింపుల్లో కొన్ని మార్పులు చేస్తూనే, తుళ్లూరు ఎడ్యుకేషనల్ సొసైటీకి రోడ్డు నిర్మాణంలో కోల్పోయిన స్థలానికి పరిహారంగా మరో 3 ఎకరాలు కేటాయించారు. వ్యవసాయ ఉ సహకార శాఖ:అటవీ హక్కుల పట్టా ఉన్న వాళ్ళు ఎస్టీ వర్గానికి చెందిన వారే అయినప్పటికీ, గతంలో వాళ్లకు స్ప్రింక్లర్ల మీద కేవలం 50 శాతం మాత్రమే సబ్సిడీ వచ్చేది. గిరిజన ప్రాంతాల్లో, వర్షాధార భూముల్లో పంటలు పండించడానికి ఈ సబ్సిడీ సరిపోవడం లేదు. అందుకే కేంద్ర ప్రభుత్వం తన వాటాను 54 శాతానికి పెంచడంతో, రాష్ట్ర వాటాతో కలిపి ఇకపై డ్రిప్ ఇరిగేషన్ పూర్తి ఉచితంగా అలాగే స్ప్రింక్లర్ సిస్టమ్ కోసం రైతులు కేవలం 10 శాతం డబ్బులు కడితే సరిపోయేలా (90% సబ్సిడీ) ఈ పథకాన్ని తీసుకొచ్చారు. నీటి కాలుష్యానికి సంబంధించి పాత చట్టంలో చిన్నచిన్న తప్పులకు కూడా కఠినమైన జైలు శిక్షలు విధించే అవకాశం ఉండేది. కేంద్రం కొత్తగా చేసిన ఈ సవరణలో జైలు శిక్షలను తీసేసి వాటి స్థానంలో జరిమానాలను మాత్రమే చేర్చారు. ఈ కొత్త చట్టాన్ని మన రాష్ట్రం కూడా అధికారికంగా ఆమోదిస్తేనే కాలుష్యం ఎక్కువగా ఉన్న నగరాలకు 'నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్' కింద కేంద్రం నిధులు ఇస్తుంది. అలాగే పరిశ్రమలకు ఫీజుల భారం కూడా తగ్గుతుంది.మహిళా శిశు అభివృద్ధి, వికలాంగుల సంక్షేమం ఉ సీనియర్ సిటిజన్లు:ఆంధ్రప్రదేశ్లో మిషన్ శక్తి కింద 'సఖి నివాస్ పథకం' (క్రెష్ సదుపాయంతో కూడిన వర్కింగ్ విమెన్ హాస్టళ్ళు) అమలు చేయడానికి ఆమోదం తెలిపింది. వేరే ఊర్ల నుంచి వచ్చి పని చేసుకునే ఒంటరి మహిళలు, వితంతువులు, పెళ్లై దూరంగా ఉంటున్న వాళ్ళకు సేఫ్ గా ఉంటూ తక్కువ ఖర్చుతో ఉండేలా ఈ హాస్టళ్లు ఉపయోగపడతాయి. ఉద్యోగాలకు వెళ్లే తల్లుల కోసం ఇందులో పిల్లల్ని చూసుకునే డే-కేర్ సదుపాయం కూడా ఏర్పాటు చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 30 హాస్టల్స్ ఏర్పాటు చేయబోతున్నారు. ఒక్కో హాస్టల్ నిర్వహణకు వార్డెన్, సెక్యూరిటీ లాంటి 8 మంది సిబ్బందిని ఔట్ సోర్సింగ్ పద్ధతిలో తీసుకుంటారు. రెవెన్యూ జీఎస్టీ పెరిగిన తర్వాత కమర్షియల్ టాక్స్ కేసులు ఎక్కువైపోయాయి. ఇప్పటివరకు విశాఖపట్నం, కాకినాడ, విజయనగరం లాంటి ప్రాంతాల అప్పీళ్లన్నీ విజయవాడలోనే తేల్చాల్సి రావడం వల్ల కేసులు విపరీతంగా పెరిగిపోయి కోట్ల రూపాయల ఆదాయం నిలిచిపోయింది. ఇప్పుడు ఆర్థిక కేంద్రంగా ఎదుగుతున్న విశాఖలో అదనంగా ఈ కమీషనర్ పోస్టు ఏర్పాటు చేయడం వల్ల ఆ ప్రాంత కేసులన్నీ వేగంగా పరిష్కారం అవుతాయి. శ్రీటి ఎద్దడి ఎదుర్కొంటున్న 3,000 నివాస ప్రాంతాలకు సురక్షితమైన తాగునీరు అందించడానికి రూ.1,814.71 కోట్ల వ్యయంతో చేపట్టనున్న 3,000 పనులకు రాష్ట్ర మంత్రి మండలి పరిపాలన ఆమోదం తెలిపింది.

మల్టీ విలేజ్ స్కీమ్ కింద ప్రాధాన్యత ఇస్తున్న ఏడు భారీ ప్రాజెక్టుల ద్వారా 76 మండలాల్లోని దాదాపు 65 లక్షల



మందికి ప్రతి మనిషికి రోజుకు 55 లీటర్ల చొప్పున సురక్షితమైన తాగునీరు అందుతుంది. అదే సమయంలో తీవ్రంగా నీటి కష్టాలు ఎదుర్కొంటున్న 112 గ్రామీణ నియోజకవర్గాల్లోని 3000 ప్రాంతాలను ప్రత్యేకంగా గుర్తించి, సింగిల్ విలేజ్ స్కీమ్ ద్వారా నాబార్డ్, జల్ జీవన్ మిషన్ సాయంతో వెంటనే ఆ సమస్యలు తీర్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

ఎన్ టీ ఆర్ జిల్లా నందిగామ మండలం రాఘవపురం గ్రామంలోని 5.00 ఎకరాల ప్రభుత్వ భూమిని సివిల్ సెక్టార్ కింద కేంద్రీయ విద్యాలయ పాఠశాల స్థాపన కోసం కేంద్రీయ విద్యాలయ సంఘటన్, న్యూ ఢిల్లీకి ఉచితంగా కేటాయించేందుకు ఉత్తర్వులకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ భూమి విలువ రూ.3,75,00,000/-. బదిలీలపై వచ్చే కేంద్ర ప్రభుత్వ, రక్షణ శాఖ ఉద్యోగుల పిల్లలకు, అలాగే స్థానిక విద్యార్థులకు మంచి క్వాలిటీ ఎడ్యుకేషన్ అందించే ఉద్దేశంతో ఈ స్కూల్ ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ 5 ఎకరాల ప్రభుత్వ బంజరు భూమిలో ఎలాంటి ఆక్రమణలు, పాత కట్టడాలు గానీ, హై టెన్షన్ కరెంట్ తీగలు గానీ లేవు కాబట్టి నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకం ఉండదు. విద్యాపరమైన ప్రయోజనాల కోసం కాబట్టి దీనికి ఉచితంగానే స్థలాన్ని ఇచ్చారు.

టూరిజం శాఖ పర్యాటక అభివృద్ధికి స్థలం అడిగినప్పుడు, రికార్డుల్లో అసెస్డ్ వేస్ట్ డ్రై భూమిగా ఉన్న ఈ 20 ఎకరాల స్థలాన్ని ఉచితంగానే ఇద్దామని మొదట అనుకున్నారు. కానీ ఆర్థిక శాఖ ఈ ప్రతిపాదనను పరిశీలించి, ఇది ప్రభుత్వ ఆస్తి కాబట్టి కచ్చితంగా మార్కెట్ రేటు చెల్లించే పద్ధతిలోనే కేటాయించాలని స్పష్టం చేసింది, దానికే క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నూజివీడులో కేంద్రీయ విద్యాలయం భవన నిర్మాణం ఏమాత్రం ఆలస్యం కాకూడదనే ఉద్దేశంతో, అధికారికంగా ఉత్తర్వులు రాక ముందే ఈ 7 ఎకరాల స్థలాన్ని సికింద్రాబాద్ లోని కేవీఎస్ డిప్యూటీ కమిషనర్ కు అడ్వాన్స్ గా అప్పగించేశారు. స్థానిక సంస్థల నిబంధనల ప్రకారం క్లియరెన్స్ తీసుకోవడం, వాల్టా చట్టాన్ని పక్కాగా పాటించడం లాంటి షరతులకు లోబడి ఈ భూమిని ఉచితంగా ఇస్తున్నారు.శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పురుషోత్తపురం గ్రామంలోని 5.00 ఎకరాల ప్రభుత్వ భూమిని సివిల్ సెక్టార్ కింద కేంద్రీయ విద్యాలయ పాఠశాల స్థాపన కోసం కేంద్రీయ విద్యాలయ సంఘటన్, న్యూ ఢిల్లీకి ఉచితంగా కేటాయించే ఉత్తర్వులకు ఆమోదం తెలిపింది. ఈ భూమి విలువ రూ.31,94,40,000/-.దేశవ్యాప్తంగా కొత్తగా 57 కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులో ఇది కూడా ఒకటి. దీనికోసం 2022లోనే లోక్ సభలో కూడా డిమాండ్ వినిపించింది. స్థానికంగా పలాసలో ఉన్న మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఉ కిడ్నీ రీసెర్చ్ సెంటర్ వెనకభాగంలో ఉన్న కొండ పోరంబోకు భూమి ఈ స్కూల్ కు అన్ని విధాలా అనువుగా ఉంటుందని గుర్తించి దాన్ని కేటాయించారు.

రెవెన్యూ (భూముల) శాఖ:నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ వాళ్లు చెత్త వేయడానికి (డంపింగ్ యార్డ్), అలాగే చెత్తతో కరెంట్ తయారుచేసే ప్లాంట్ కోసం దొంతలి గ్రామంలోని సుమారు 41 ఎకరాల అటవీ భూమిని వాడుకున్నారు. దానికి పరిహారంగా అటవీ శాఖకు పంగిలి గ్రామంలో ఈ 82 ఎకరాల స్థలాన్ని తిరిగిస్తున్నారు. ఈ భూమికి ఎకరాకు రూ. 4.50 లక్షల చొప్పున (మొత్తం 3.70 కోట్లు) మున్సిపల్ కార్పొరేషనే చెల్లిస్తుంది.నెల్లూరు లోని ఈ స్థలాన్ని గతంలో విద్యుత్ శాఖకు ఒక సబ్ స్టేషన్ కట్టడానికి ఇచ్చారు. అందులో వాడకుండా ఖాళీగా మిగిలిపోయిన ఒక ఎకరం స్థలాన్ని ఇప్పుడు ఈ ఈఎస్ఐ హాస్పిటల్ కు ఇస్తున్నారు. ఇది వైద్య అవసరాల కోసమే అయినా ఆ ప్రాంతం బాగా డెవలప్ అయిన కమర్షియల్ ఏరియా కావడంతో, ఈ స్థలాన్ని ఉచితంగా కాకుండా మార్కెట్ రేటుకే (సుమారు 4.64 కోట్లు) విక్రయించాలని ఫైనాన్స్ శాఖ సూచించింది.

బాపట్ల మండలం, బాపట్ల జిల్లాలో అదవి గ్రామంలో 17.00 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎకరాకు రూ.32,50,000/- చెల్లింపుపై చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీకి లగ్జరీ రిసార్ట్ అభివృద్ధి కోసం బదిలీ చేయడానికి ఆమోదం తెలిపింది. ఈ 17 ఎకరాలు గతంలో సీలింగ్ సర్ప్లస్ కింద ప్రభుత్వానికి వచ్చిన భూమి. ఇక్కడ ఎలాంటి చెట్లు, పాత కట్టడాలు, విద్యుత్ తీగలు లాంటివేవీ లేకపోవడంతో లగ్జరీ రిసార్టు కట్టడానికి చాలా అనువుగా ఉంటుంది. పర్యాటకులను ఆకర్షించే ఈ ప్రాజెక్టు కోసం టూరిజం అథారిటీకి ఈ భూమిని ఉచితంగా కాకుండా ఎకరాకు రూ. 32.50 లక్షల చొప్పున (మొత్తం సుమారు 5.52 కోట్లు) మార్కెట్ ధరకే బదిలీ చేయాలని నిర్ణయించారు. జలవనరుల అభివృద్ధి పోలవరం కుడి కాలువకు వేగంగా నీళ్లు వదలాలనే ఉద్దేశంతో, నిజానికి 2027 జూన్ నాటికి పూర్తవ్వాల్సిన ఈ టన్నెల్ పనులను 2026 జూన్ నాటికే పూర్తి చేయాలని ప్రభుత్వం టార్గెట్ పెట్టుకుంది. 900 మీటర్ల పొడవున్న ఈ జంట సొరంగాల నీటి సామర్థ్యాన్ని 20 వేల క్యూసెక్కుల నుంచి 40 వేల క్యూసెక్కులకు పెంచారు. సొరంగం లోపల రాళ్లు దెబ్బతిన్న చోట అదనపు పనులు చేయడానికి, అలాగే పనులు స్పీడ్ పెంచడానికి వీలుగా మరో ఎక్స్ట్రా గ్యాంట్రీ క్రేన్ కొనడానికి ఈ 23 కోట్లను మంజూరు చేశారు.2011-12లో అత్యవసర పరిస్థితిలో చేపట్టిన ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్లో 86 అత్యవసర మరియు తాత్కాలిక మరమ్మత్తు పనులకు క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికేట్ల వినియోగం నుండి మినహాయింపు ఇచ్చి రూ.255.89 లక్షలు చెల్లించడానికి ఆమోదం తెలిపింది.విశాఖ నగరానికి, అక్కడి పరిశ్రమలకు 23.44 టీఎంసీల తాగునీరు అందించడానికి ఈ పోలవరం ఎడమ కాలువ పనులు ప్రాణం లాంటివి. కానీ 2005 నుంచి ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పాత ఏజెన్సీలు నకిలీ బ్యాంకు గ్యారంటీలు ఇవ్వడం, ఓపెన్ కెనాల్ కు బదులు పైప్ లైన్ గా డిజైన్ మారడం వల్ల పాత అగ్రిమెంట్లను రద్దు (ప్రీ-క్లోజింగ్) చేసేశారు. మిగిలిన పనులన్నీ కలిపి 2024-25 రేట్లతో ఒకే ప్యాకేజీగా మార్చి రూ. 76.87 కోట్లతో కొత్త వాళ్లకు టెండర్ ఇచ్చారు.

6-లేన్ల వెస్ట్ బైపాస్ రోడ్డు :విజయవాడ సిటీలో ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించడానికి జాతీయ రహదారుల సంస్థ జక్కంపూడి కాలనీ దగ్గర భారత్మాల ప్రాజెక్టు కింద కొత్తగా 6-లేన్ల వెస్ట్ బైపాస్ రోడ్డు వేస్తోంది. ఆ రోడ్డు పనులు జరుగుతున్నప్పుడు కరెంట్ వైర్ల అడ్డంకి లేకుండా, సేఫ్టీ కోసం పైనున్న 400 కేవీ హైటెన్షన్ లైన్ ఎత్తును మార్చాల్సి ఉంది. అందుకోసం రాష్ట్రంలో కరెంట్ సరఫరా ఆగిపోకుండా ఒక్కో సర్క్యూట్ ని ఆపుతూ జాగ్రత్తగా పనులు పూర్తి చేయడానికి లాంకో కంపెనీకి అధికారికంగా నోటీసులు జారీ చేస్తున్నారు. పరిశ్రమలు, వాణిజ్యం శాఖ:ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 4.0 కింద మెగా ప్రాజెక్టు హోదా పొందిన ఈ హెరిటేజ్ డైరీ విస్తరణ వల్ల ఉత్పత్తుల తయారీ బాగా పెరగనుంది. ఫ్లేవర్డ్ పాలు 131 శాతం, పన్నీర్ దానికి పరిహారంగా అటవీ శాఖకు పంగిలి గ్రామంలో ఈ 82 ఎకరాల స్థలాన్ని తిరిగిస్తున్నారు. ఈ భూమికి ఎకరాకు రూ. 4.50 లక్షల చొప్పున (మొత్తం 3.70 కోట్లు) మున్సిపల్ కార్పొరేషనే చెల్లిస్తుంది.400 శాతం, నెయ్యి ఉత్పత్తి ఏకంగా 566 శాతం పెరుగుతుంది. ఈ ప్రాజెక్టు కోసం వారు పెడుతున్న పెట్టుబడి సుమారు 200 కోట్లు దాటినందువల్ల, రాష్ట్ర ప్రభుత్వం తరపున టెక్నాలజీ అప్గ్రేడేషన్ కోసం సబ్సిడీ, కరెంట్ బిల్లుల మీద యూనిట్కు రూపాయి చొప్పున రాయితీ, అలాగే ఐదేళ్ల పాటు వందశాతం ఎస్జీఎస్టీ రీయింబర్స్మెంట్ లాంటి ప్రోత్సాహకాలను మంజూరు చేస్తున్నారు.

## పిల్లల భోజనంలో నిర్లక్ష్యం

### లోకేశ్ ఆగ్రహం

●ఎన్టీఆర్ జిల్లా పాఠశాలలో నాసిరకం భోజనం ఘటనపై మంత్రి ఆగ్రహం ●హెడ్మాస్టర్ సస్పెన్షన్, ఫుడ్ ఏజెన్సీ మార్పుకు ఆదేశాలు ●విద్యార్థులు, తల్లిదండ్రులకు క్షమాపణ చెప్పిన మంత్రి ●లీప్ యాప్ ద్వారా భోజన నాణ్యతపై నేరుగా ఫీడ్ బ్యాక్●పాఠశాలల్లో పర్యవేక్షణ మరింత కట్టుదిట్టం చేస్తామని హామీ ● పిల్లల ఆరోగ్యంపై రాజీ లేదని విద్యాశాఖ మంత్రి లోకేష్ స్పష్టం



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి ఎన్టీఆర్ జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యతలేని మధ్యాహ్న భోజనం అందించిన ఘటనపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. సమాచారం అందిన వెంటనే చర్యలకు ఉపక్రమించిన ఆయన, ఈ ఘటనకు బాధ్యుడిగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు కలిగిన అసౌకర్యానికి మంత్రి వ్యక్తిగతంగా క్షమాపణలు తెలిపారు.మైలవరం మండలం దేవుని చెరువు ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యత సరిగా లేదని ఫిర్యాదు అందడంతో విద్యాశాఖ వెంటనే రంగంలోకి దిగింది. మంత్రి లోకేశ్ ఆదేశాల మేరకు ఈ విషయంపై విచారణకు త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ సమర్పించిన నివేదిక ఆధారంగా, భోజనం సరఫరా చేస్తున్న ఏజెన్సీని తక్షణమే తొలగించి, కొత్త ఏజెన్సీని నియమించారు. అదే సమయంలో, పర్యవేక్షణలో విఫలమైనందుకు పాఠశాల హెడ్మాస్టర్ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.హాస్టల్లో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారని ఓ మహిళ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వీడియో తన దృష్టికి రావడంతో ఆయన చలించిపోయారు. ఈ ఘటన తనను ఎంతో బాధించిందని పేర్కొంటూ, వెంటనే బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన సేవలు, సంరక్షణ అందించడమే మా లక్ష్యం. జరిగిన పొరపాటుకు పిల్లలకు, వారి తల్లిదండ్రులకు మనస్ఫూర్తిగా క్షమాపణలు చెబుతున్నాను," అని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పర్యవేక్షణను కట్టుదిట్టం చేస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రుల నుంచి నేరుగా ఫీడ్బ్యాక్ స్వీకరించేందుకు 'లీప్ (ఎల్ఈఏపీ)' యాప్ను మరింత బలోపేతం చేస్తామని, సమస్యలను తక్షణమే గుర్తించి పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

మంత్రి సవితతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తా : మరోవైపు, అనకాపల్లి జిల్లా చీడికాడలోని బీసీ బాలికల వసతిగృహంలో ఆహార కొరత ఏర్పడిన ఘటనపై నారా లోకేశ్ స్పందించారు. హాస్టల్లో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారని ఓ మహిళ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వీడియో తన దృష్టికి రావడంతో ఆయన చలించిపోయారు. ఈ ఘటన తనను ఎంతో బాధించిందని పేర్కొంటూ, వెంటనే బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.మంత్రి లోకేశ్ ఆదేశాల మేరకు ఈ విషయంపై విచారణకు త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ సమర్పించిన నివేదిక ఆధారంగా, భోజనం సరఫరా చేస్తున్న ఏజెన్సీని తక్షణమే తొలగించి, కొత్త ఏజెన్సీని నియమించారు. అదే సమయంలో, పర్యవేక్షణలో విఫలమైనందుకు పాఠశాల హెడ్మాస్టర్ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అక్కడి విద్యార్థినులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. విద్యార్థినులకు ఎదురైన అసౌకర్యానికి క్షమాపణలు చెబుతున్నానని, ఈ విషయాన్ని తన దృష్టికి తీసుకొచ్చినందుకు ఆ మహిళకు ధన్యవాదాలు తెలిపారు.

# పరిశ్రమలు వస్తుంటే వైసీపీ జీర్ణించుకోలేక పోతోంది

● జువ్వలదిన్నెను పూర్తి చేసి, మత్స్యకారులకు అంకితం ఇస్తాం. ● వైసీపీ మళ్ళీ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదు.
● మంత్రులు కొల్లు రవీంద్ర, బీసీ జనార్ధన్‌రెడ్డి

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి ఆంధ్రప్రదేశ్ లో నేడు పెట్టుబడుల అనుకూల వాతావరణం ఉండటం, భారీగా పెట్టుబడులు రాష్ట్రానికి రావడాన్ని ప్రతిపక్షం జీర్ణించుకోలేక, దుష్ప్రచారం చేస్తోందని రాష్ట్ర ఎక్సైజ్,గనులు, భూగర్భవనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర రోడ్లు , భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మండిపడ్డారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ను ప్రవేట్ పరం చేస్తున్నామంటూ ప్రతిపక్షం చేస్తున్న విమర్శల్లో ఎంతమాత్రం వాస్తవం లేదని ఇరువురు మంత్రులు కొట్టిపారేశారు.. శుక్రవారం సచివాలయంలోని 5 బ్లాక్ లోని పబ్లిసిటీ సెల్ లో నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో ఇరువురు మంత్రులు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా మాజీ సియం జగన్ దుర్మార్గాలపై ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఇరువురు మంత్రులు ప్రజలకు పిలుపునిచ్చారు.. జువ్వలదిన్నె అభివృద్ధిపై జగన్ రెడ్డి కుట్రలు సిగ్గుచేటన్న మంత్రులు.. రాష్ట్ర ప్రగతిని అడ్డుకుంటే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ... జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ను ప్రైవేట్ పరంగా చేస్తున్నారన్న వార్తలు పూర్తిగా అవాస్తవమన్నారు. ఫిషింగ్ హార్బర్ ఇప్పటికీ ప్రభుత్వ మత్స్య శాఖ ఆధ్వర్యంలోనే కొనసాగుతోందన్నారు. మొత్తం 114 ఎకరాల 13 సెంట్ల హార్బర్ భూమిలో కేవలం 7 ఎకరాలు మాత్రమే సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ లిమిటెడ్కు కేటాయించడం జరిగిందన్నారు. ఈ ఫిషింగ్ హర్బర్ లో తీరం అనుసంధానం, టెక్నాలజీ కోసం ఆ 7 ఎకరాల భూమిని ఇస్తున్నామని.. మిగిలిన 22 ఎకరాలు ఆ సంస్థకు బయటే ఇచ్చామన్నారు. మత్స్యకారులకు ఆధునిక కమ్యూనికేషన్, వాతావరణ సమాచారం అందించేందుకు ఈ ప్రాజెక్ట్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఉపగ్రహాలు, డ్రోన్లు, ఆధునిక టెక్నాలజీ ద్వారా సముద్రంలో ఉన్న మత్స్యకారులకు అదనపు సమాచారం అందనుందన్నారు.

రాష్ట్రంలో పరిశ్రమలు రాకూడదనే వైసీపీ ప్రయత్నం : రాష్ట్రంలో దాదాపు రూ.2500--3000 కోట్ల పెట్టుబడితో సాగర్ డిఫెన్స్ పరిశ్రమ రాబోతోందని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు.. అయితే రాష్ట్రంలో పరిశ్రమలు రావడం వైసీపీ నేతలకు ఎంతమాత్రం ఇష్టం లేదని, పరిశ్రమలు రాకుండా చేయాలనే ఉద్దేశంతో ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. పరిశ్రమలు రాకుండా అడ్డుపడి, బెదిరింపులకు పాల్పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రానికి భారీ పెట్టుబడులు, కొత్త పరిశ్రమలు వస్తున్నాయని, నేడు కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ బ్రాండ్ లను చూసి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి వస్తున్నారన్నారు. సింగిల్ విండో విధానంలో పరిశ్రమలకు త్వరితగతిన అనుమతులు ఇస్తున్నామని, పెండింగ్లో ఉన్న పోర్టులు త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిపై అక్కసుతోనే వైసీపీ నేతలు ఆరోపణలు చేస్తున్నారు. ఫిషింగ్ హార్బర్ వల్ల మత్స్యకారులకు ప్రయోజనకరమే తప్ప, ఎటువంటి నష్టం వాటిల్లదంటూ భరోసా ఇచ్చారు. స్థానికంగా మత్స్యకారులతో ఇప్పటికే పలుమార్లు సమావేశాలు నిర్వహించి వారి సూచనలు, సలహాలు తీసుకున్నామన్నారు. హార్బర్లో అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించి త్వరలో మత్స్యకారులకు అంకితం చేస్తామని మంత్రి చెప్పారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ వద్ద ఇంకా ఏమీ జరగకుండానే ప్రవేట్ పరం అవుతుందని చెప్పడానికి వైసీపీ నేతలకు సిగ్గు, శరం ఉండాలన్నారు. ప్రజలను సామాజికవర్గాల వారీగా రెచ్చగొట్టే ధోరణిలో భాగంగా మత్స్యకారులను కూడా నేడు రెచ్చగొడుతున్నారన్నారు.

కమీషన్లు, కప్పం కోసం బెదిరించే ప్రభుత్వం మాది కాదు : స్థానిక ప్రజల ప్రయోజనాల మేరకే కూటమి ప్రభుత్వం నిర్ణయాలుంటాయి తప్ప, ఆదాయాల కోసం, కమీషన్ల కోసం, పరిశ్రమలను కప్పం కట్టమని బెదిరించే ప్రభుత్వం మాది కాదన్నారు. నేడు విశాల సముద్రతీరం ఉన్న మన రాష్ట్రానికి ఇతర రాష్ట్రాల కంపెనీలు తరలివస్తున్నాయని, ముద్రతీరంను పూర్తిగా సద్వినియోగం చేసుకునేందుకు అంతర్జాతీయ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ఆహ్వానిస్తున్నామన్నారు. మారిటైమ్ రంగంలో దేశంలో ఏ రాష్ట్రానికి రానన్నీ పెట్టుబడులు, ఏపీకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. పారిశ్రామికవేత్తలను బెదిరించడం వైసీపీ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టేవారిని మేము అధికారంలోకి వస్తే, జైల్లో పెడతామని బెదిరిస్తున్నారు.. వీళ్లు వచ్చేది లేదు.. చచ్చేది లేదని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మండిపడ్డారు. జైలుకు పోవడానికి రెడీగా ఉన్న జగన్ మోహన్ రెడ్డి... పారిశ్రామికవేత్తలను జైల్లో పెడతానని బెదిరింపులకు పాల్పడటం విడ్డూరమన్నారు.... సామాన్య ప్రజల నుంచి రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తల వరకు అందరినీ ప్రతిపక్ష నేతలు బెదిరిస్తున్నారన్నారు..ప్రజలు తిరగబడి 151 సీట్ల నుంచి 11 సీట్లకు పరిమితం చేసి, మీకు ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేసినప్పుడే మీ రాజకీయం ముగిసిందని ఇప్పటికైన వైసీపీ నేతలు గుర్తెరగాలన్నారు. తిరుపతి లడ్డూ కల్తీతో సహా ఏ అంశంపైనా అయినా చర్చకు కూటమి ప్రభుత్వం సిద్ధమంటే, అసెంబ్లీలో చర్చకు రారు.. శాసమండలిలో చర్చ జరగనివ్వరు ఇదే ప్రతిపక్షం తంతూ అని దుయ్యబట్టారు. నేడు రాష్ట్రంలో గూగుల్ కంపెనీ పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తే, దానికి వ్యతిరేకంగా వైసీపీ ఎంపీ కోర్టుకు పోతే న్యాయస్థానం కూడా మొట్టికాయలు వేసిన పరిస్థితి నెలకొందన్నారు.. యుద్ధం వల్ల ఏపీలో పోర్టుల ఎగుమతులపై ఎటువంటి ప్రభావం లేదని, మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు ఈ సందర్భంగా మంత్రి సమాధానంగా చెప్పారు...అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ... జువ్వలదిన్నె హార్బర్ వద్ద అటానమస్ మారిటైం షిప్ యార్డ్ నిర్మాణంపై తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పబోవని మంత్రి హెచ్చరించారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి, పరిశ్రమలు ఏర్పాటు చేస్తుంటే అడ్డగోలు ప్రచారం చేయడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పారిశ్రామిక ప్రగతి దిశగా కీలకమైన అడుగులు వేస్తున్నాం. 2024-25 ఆర్థిక సంవత్సరంలో దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25.03 శాతం ఏపీకి రావడం కూటమి పాలనకు నిదర్శనం.

దేశ రక్షణ రంగంలో కీలకంగా అటానమస్ షిప్ బిల్డింగ్ యూనిట్ : అందులో భాగంగానే జువ్వలదిన్నె హార్బర్ వద్ద అటానమస్ షిప్ బిల్డింగ్ ఏర్పాటు చేస్తున్నాం. ఫిషింగ్, షిప్పింగ్ రంగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేలా విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నాం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంతో మానవ రహిత నీటి ఉపరితల, నీటి లోపల నడిచే వాహనాలు తయారు చేయబోతున్నారు. ఈ యూనిట్ ద్వారా దేశ రక్షణ రంగంలోనూ విప్లవాత్మక మార్పులు సాకారమవుతాయి. అత్యాధునికమైన రక్షణ కవచం ఏర్పాటు చేసుకునే వెసులుబాటు కలుగుతుంది. వాస్తవాలన్నింటినీ పక్కన పెట్టి.. జువ్వలదిన్నె హార్బర్ను ప్రైవేటుపరం చేస్తున్నారంటూ దిక్కుమాలిన ప్రచారం చేస్తున్నారు. పరిశ్రమలపై విష ప్రచారం చేస్తున్నారు. ఈ రోజు విమర్శలు చేస్తున్న జగన్ రెడ్డి.. గత ఐదేళ్లలో హార్బర్ ను ఎందుకు పూర్తి చేయలేదో సమాధానం చెప్పాలి. 900 మీటర్ల మేర ఉన్న జెట్టీలో 150 మీటర్లు మాత్రమే సదరు యూనిట్ కోసం వినియోగిస్తున్నాం. వాస్తవాలు తెలుసుకోకుండా.. వైసీపీ నేతలు మత్స్యకారుల్ని రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారు. ఏపీకి పెట్టుబడి రాకూడదు. పరిశ్రమలు ఏర్పాటు కాకూడదనే లక్ష్యంతో జగన్ వ్యవహరిస్తున్నాడు. ప్రపంచ వ్యాప్తంగా షిప్ బిల్డింగ్ పరిశ్రమకు అపారమైన అవకాశాలున్నాయి. కాలానుగుణంగా అవకాశాలను అందిపుచ్చుకుంటుంటే.. విమర్శలు చేయడానికి సిగ్గుండాలి.మత్స్యకారుల అభివృద్ధిపై వైసీపీతో చర్చకు సిద్ధం : వైఎస్ హయాంలో మత్స్యకారుల్ని కాల్చి కుక్కల్ని ఈడ్చుకెల్లినట్లు ఈడ్చేసిన విషయం గుర్తులేదని జగన్ రెడ్డి అనుకుంటే అది అతని పిచ్చితనం. మత్స్యకారులకు ఎవరేం చేశారో చర్చకు సిద్ధమా? వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు రూ. 20 వేల భృతి, 50 ఏళ్లకే



పెన్షన్, వేటకు వెళ్లి మరణించిన వారికి ఇన్సూరెన్స్, డీజిల్ సబ్సిడీ వంటి పథకాలు ప్రకటించిన ఘనత చంద్రబాబుదే. మత్స్యకారులకు చెందిన చెరువులు, రిజర్వాయర్లను కబ్జా చేసేలా జీవో నెం.217 తీసుకొచ్చిన దుర్మార్గుడు జగన్ రెడ్డి. గత ఐదు సంవత్సరాల పాటు వేటకు వెళ్లి మరణించిన మత్స్యకారులకు పైసా చెల్లించలేదు. కానీ కూటమి అధికారంలోకి రాగానే 95 మందికి రూ.4.75 కోట్లు చెల్లించాం. మత్స్యకారుల అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేశాం. మత్స్య రంగానికి తోడ్పాటు అందించేలా పరిశ్రమల్ని తీసుకొచ్చి అండగా నిలుస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా మత్స్యకారులను పారిశ్రామికంగా తోడుగా నిలుస్తున్నాం. అలాంటి ప్రభుత్వంపై విమర్శలు చేయడానికి జగన్ వారి ముఠా కాస్తైనా సిగ్గుపడాలని మంత్రి కొల్లు రవీంద్ర ఎద్దేవా చేశారు.

## హెచ్.జే. దొర మృతికి చంద్రబాబు సంతాపం

ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్ జే దొర మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణవార్త దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పోలీసులకు ప్రత్యేకమైన బ్రాండ్‌ను తీసుకురావడంలో హెచ్.జే. దొర కీలక పాత్ర పోషించారని సీఎం పేర్కొన్నారు. ఎన్టీ రామారావు కాలంలో ఇంటెలిజెన్స్ అధికారిగా, తన పాలనలో రాష్ట్ర డీజీపీగా పనిచేస్తూ రాష్ట్రానికి విశేష సేవలు అందించారని గుర్తు చేశారు.రాష్ట్రాన్ని చాలాకాలం వెంటాడిన నక్సల్ సమస్యను ఎదుర్కొనే విషయంలో దొర సమర్థంగా పనిచేశారని సీఎం అన్నారు. ఆయన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. హెచ్.జే. దొర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు సీఎం చంద్రబాబు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



# కలర్స్

LIFE IS A RAINBOW



# అబద్ధాల ప్రచారాలే యుద్ధాలకు బీజాలు

## ప్రపంచమంతా అల్లకల్లోలం
## నిజాలను సమాధి చేస్తున్న ప్రపంచ దేశాల యుద్ధాలు

**ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల మధ్య యుద్ధం కొనసాగడంతో ప్రపంచమంతా అల్లకల్లోలమయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇరాన్ అమెరికా మధ్య జరుగుతున్న యుద్ధం ప్రపంచంలోని పలు దేశాలతో పాటు భారత్ కూడా తీవ్రంగా నష్టం వాటిల్లే అవకాశం కనిపిస్తోంది. భారత్ నుండి ఎగుమతి అవుతున్న బాస్మతి బియ్యం, బట్టలు, ఉల్లి పాయలు, కోడి గుడ్లు లతో పాటు ఇతర సరుకులు సముద్రంలోనే నిలిచిపోయాయి దీని కారణంగా భారత్ ఇబ్బందులు తప్పడం లేదు. మరో వైపు యుద్ధం జరుగుతున్న దేశాల నుండి భారత్ కు పెట్రోలియం, గ్యాస్ ఉత్పత్తులు నిలిచిపోవడంతో ఇక్కడ కూడా ఆ ఉత్పత్తులపై ధరలు పెరుగుతున్నాయి. భారత్ లో యుద్ధం జరిగినప్పటికీ యుద్ధం కారణంగా పలు దేశాలకు భారత్ ఉత్పత్తులు రవాణా కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. యుద్ధం కారణంగా పలు దేశాలు తీవ్రంగా నష్టపోతున్నాయి.**

భారత్, పాక్ మధ్య హిమాలయాలు ప్రకృతిసిద్ధ సరిహద్దులుగా ఉన్నాయి. అయితే, ఈ మంచుకొండలపై చలికాలంలో విపరీతంగా మంచు కురవడంతోపాటు మైనస్ 20 నుంచి మైనస్ 50వరకు ఉష్ణోగ్రతలు పడిపోతాయి. ఇలాంటి సమయంలో సైనికులు కాపలా కాయడం ప్రాణాపాయం కావడంతో.. రెండు దేశాలు మౌఖిక ఒప్పందం చేసుకున్నాయి. అంటే ఎక్కడా సంతకం పెట్టకుండా.. కేవలం చర్చలతోనే ఒప్పందం చేసుకున్నాయి. చలికాలంలో మంచు శిఖరాల్లోని రెండు దేశాలకు చెందిన సైనిక పోస్టులు ఖాళీ చేయాలని.. తిరిగి వేసవి రాగానే ఎవరి సైనిక పోస్టుల్లో వారు విధులు నిర్వహించుకోవలని నిర్ణయించుకున్నారు. అంటే ప్రతి ఏడాది అక్టోబర్ చివరివారంనుంచి నవంబర్ మొదటివారంలో పోస్టులు వదిలేస్తే.. తిరిగి మే చివరివారం నుంచి జూన్ మొదటివారంలో తిరిగి పోస్టులను చేరుకునేవారు. అయితే, మే 3వ తేదీన కార్గిల్ లోని కొండ ప్రాంతాల్లోకి కొందరు తుపాకులతో వెళ్తుండటాన్ని మాజీ సైనికుడు, గొర్రెల కాపరి యూసుఫ్ చూసి అనుమానించారు. ఎందుకంటే అప్పటికి భారత సైనికులు మంచుకొండలకు వెళ్లే సమయం రాలేదు. దీంతో ఆయన సైన్యానికి సమాచారం ఇవ్వడంతో వారు రెండు, మూడు దళాల సైనికులను పంపగా.. వారిలో చాలామంది చనిపోయారు. దీంతో పాక్ భారత పోస్టులను ఆక్రమించి దాడులు చేస్తున్నదని సైన్యం ధృవీకరించింది. అప్పటికే పాక్ సైన్యం ఆపరేషన్ బదర్ పేరిట భారత్లోని ముష్కో వ్యాలీ, ద్రాస్, కక్సర్, బటాలిక్, తుర్తుక్ సెక్టార్లలో 130200 చ.కి.మీ. విస్తీర్ణంలో 132 వ్యూహాత్మక స్థానాలను ఆక్రమించారు. దీంతో భారత్ ఆపరేషన్ విజయ్ పేరిట కార్గిల్ యుద్ధం చేసింది. పాక్ మాత్రం చొరబాటుదారులు ముజాహిదీన్లని.. వారు కశ్మీర్ స్వంతంత్రం కోసం పోరాటం చేస్తున్నారని ప్రపంచానికి చెప్పే ప్రయత్నం చేసింది. కానీ, మృతుల్లో చాలామంది నార్తర్న్ లైట్ ఇన్ఫ్రాంట్రీ, స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ కమెండోల ఐడీ కార్డులు వారి యూనిఫాంలు కూడా లభించడంతో పాక్ ను ఇరకాటంలో పడేసింది. ఆ తర్వాత కొద్దికాలానికే పాక్ ప్రభుత్వాన్ని కూలదోసిన సైనిక నియంత పర్వేజ్ ముషారఫ్ చైనాలో పర్యటిస్తూ.. తన సైనిక కమాండర్లతో టెలిఫోన్ సంభాషణలు చేశారు. ఇందులో కార్గిల్ వెనక ఉన్నది తానేనని చెప్పడం.. అది భారత నిఘా సంస్థ (ఆర్ అండ్ ఏడబ్ల్యూ) రికార్డు చేయడంతో ప్రపంచం మొత్తం నివ్వెరపోయింది. అప్పటికే పాక్ సైనికాధికారుల ద్వారా, మీడియా స్వతంత్ర దర్యాప్తులోనూ ఈ విషయం వెల్లడైంది. కొంతకాలానికి డీక్లాసిఫైడ్ డాక్యుమెంట్లు కూడా అదే విషయం చెప్పాయి.

### భారత్ కు నైతిక సవాల్



పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులు ఉత్పన్నమైన ప్రతిసారీ భారత్ ఒక నైతిక సవాల్ నెదుర్కోవలసివస్తోంది. 1980 దశకంలో ఇరాన్ఇరాక్ యుద్ధంలో భారత్ తటస్థ పాత్ర పోషించినా, సద్దాం హుస్సేన్ వైపే సానుకూలత చూపింది. అయితే సద్దాం 1990 దశకం తొలినాళ్లలో కువైట్ను దురాక్రమించినప్పుడు మొదలైన గల్ఫ్ యుద్ధంలో ఇరాక్కు వ్యతిరేకంగా నిలబడింది. అందుకు దేశ ఆర్థిక ప్రయోజనాలే ముఖ్య కారణం. ఆ యుద్ధం సందర్భంగా ఇరాక్పై దాడులకు ఫిలిప్పీన్స్ నుంచి గల్ఫ్కు వెళ్లే అమెరికా యుద్ధ విమానాలకు భారత్లో ఇంధనం నింపడానికి నాటి ప్రధానమంత్రి చంద్రశేఖర్ ప్రభుత్వం అనుమతినిచ్చింది. దీనిపై పార్లమెంటు లోపల, బయట ఆ ప్రభుత్వంపై పెనుదుమారం చెలరేగింది. చమురు నిల్వలు దాదాపు అంతరించి దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా పతనమవుతున్న రోజులవి. బ్రిటన్, స్విట్జర్లాండ్కు 67 టన్నుల బంగారం తీసుకెళ్ళి తాకట్టు పెట్టి రుణం తీసుకోవలసినంత అగత్యమేర్పడిన సందర్భమది. చంద్రశేఖర్ ప్రభుత్వం అలీనోద్యమ విధానాలకు విరుద్ధంగా అమెరికాకు సహాయం చేయడాన్ని నాటి ప్రతిపక్ష నేత రాజీవ్గాంధీ తీవ్రంగా గర్హించారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంటును స్తంభింపజేసింది. ఈ పరిణామాల ఫలితంగా గల్ఫ్ దేశాల దౌత్యవేత్తలు రాజీవ్గాంధీని వ్యక్తిగతంగా కలిసి మాట్లాడారు. అప్పటి ఆర్థికమంత్రి యశ్వంత్ సిన్హా దేశ ఆర్థిక వ్యవస్థ నిజ పరిస్థితిని ప్రతిపక్షాలకు లోపాయికారీగా వెల్లడించి గల్ఫ్ దేశాలకు మద్దతుగా నిలవాల్సిన ఆవశ్యకతను వివరించారు. కొన్ని వారాల తర్వాత కువైట్ నుంచి ఇరాక్ సేనలు వెనక్కి వెళ్లిపోయే సమయానికి అమెరికా విమానాలకు భారత్లో ఇంధనం నింపే వెసులుబాటును కేంద్రం విరమించింది. ఆ యుద్ధం రోజుల్లో గల్ఫ్ దేశాలలో జీవనోపాధి పొందుతున్న భారతీయులు 20 లక్షల మంది దాకా ఉండేవారు. అప్పుడు భారతదేశ ఆర్థిక వ్యవస్థ దిగజారి బంగారాన్ని తాకట్టు పెట్టి రుణం పొందవల్సిన దుస్థితిలో ఉన్నది. నేడు భారత్ ఖజానాలో దాదాపు 750 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు ఉన్నాయి.

### అఫ్ఘానిస్థాన్పై పాకిస్థాన్ భారీ వైమానిక దాడులు



అఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్ మధ్య కొంతకాలంగా నెలకొన్న ఉద్రిక్తతలు యుద్ధ వాతావరణానికి దారితీశాయి. ఇరు దేశాల మధ్య భారీ ఎత్తున దాడులు జరుగుతున్నాయి. అయితే ఒక రోజు తెల్లవారుజామున పాక్ వైమానిక దళం అఫ్గాన్ భూభాగంలో కీలక సైనిక లక్ష్యాలపై విరుచుకుపడింది. ఈ దాడుల్లో పలు అఫ్గాన్ ఆర్మీ పోస్టులు పూర్తిగా ధ్వంసం అయినట్లు సమాచారం. అయితే, మొదట అఫ్గానిస్థాన్ దాడులు చేయగా.. పాక్ కూడా దాడులు చేసినట్లు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. పాకిస్థాన్ సైన్యం ఈ దాడులకు 'ఆపరేషన్ గజబ్-లిల్-హక్' అని పేరు పెట్టింది. సరిహద్దు వెంబడి పెరుగుతున్న ఉగ్రవాద కార్యకలాపాలు, అంతకు ముందు అఫ్గాన్ దళాలు జరిపిన కాల్పులకు ప్రతీకారంగా ఈ చర్యలు తీసుకున్నట్లు పాక్ రక్షణ శాఖ ప్రకటించింది. పాక్ వైమానిక దళం అఫ్గానిస్థాన్ లోని కాబూల్, కాందహార్, పక్తికా వంటి నగరాల్లోని సైనిక పోస్టులు, మందుగుండు సామగ్రి డిపోలు, శిక్షణ శిబిరాలను ధ్వంసం చేశాయి. మరోవైపు పాకిస్థాన్పై అఫ్గానిస్థాన్ ప్రతీకార దాడులు చేస్తోంది. 55 మంది పాక్ సైనికులను మట్టుబెట్టినట్టు తాలిబన్లు ప్రకటించారు. ఇప్పటివరకూ 19 పాక్ అవుట్ పోస్టులు, 2 స్థావరాలను ధ్వంసం చేసినట్టు వెల్లడించారు. ఇదిలా ఉంటే.. పాకిస్థాన్ సైన్యం తమకు ఎంత నష్టం వాటిల్లిందన్న విషయం వెల్లడించలేదు. ప్రస్తుతం పాకిస్థాన్-అఫ్గానిస్థాన్ సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. యుద్ధం కారణంగా చమురు సరఫరాకు ఆటంకం కలగడంతో అనేక దేశాలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాయి. ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలో ఉన్న పాకిస్తాన్, పెట్రోల్ ధరలను ఏకంగా 20 శాతం పెంచింది. ఇంధనాన్ని అత్యంత పొదుపుగా వాడుకోవాలని ఆ దేశ ప్రధాని ప్రజలకు పిలుపునిచ్చారు. యుద్ధం ఇలాగే కొనసాగితే దేశంలో ద్రవ్యోల్బణం ఊహించని రీతిలో పెరుగుతుందని బ్రిటన్ ఆర్థిక మంత్రి హెచ్చరించారు. ఇటీవల జరిగిన జీ7 ఆర్థిక మంత్రుల సదస్సులో యుద్ధం వల్ల కలిగే నష్టాలపై చర్చించారు. ఈ యుద్ధం వల్ల అభివృద్ధి చెందుతున్న దేశాలు భారీగా నష్టపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధం కేవలం ప్రాణ నష్టమే కాకుండా, మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో తీవ్రమైన పర్యావరణ విధ్వంసానికి కారణమవుతోందని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. ఆయిల్ డిపోలు, డీసాలినేషన్ ప్లాంట్లపై జరుగుతున్న దాడుల వల్ల మంచినీటి వనరులు కలుషితమవుతున్నాయి. గాలిలో విషవాయువులు చేరి వాయు కాలుష్యం విపరీతంగా పెరుగుతోంది. ఇరాన్లోని ఆయిల్ డిపోలపై దాడుల ప్రభావం పొరుగున ఉన్న గల్ఫ్ దేశాలపై కూడా పడుతోంది. అక్కడి ఆహారం, గాలి, నీరు ప్రతికూలంగా ప్రభావితమయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. యుద్ధం వల్ల గల్ఫ్ ప్రాంతంలో ఏర్పడే పర్యావరణ పరిణామాలు రాబోయే తరాలపై కూడా ప్రభావం చూపుతాయని నిపుణులు ఆందోళన చెందుతున్నారు. అంతర్జాతీయ సమాజం తక్షణమే జోక్యం చేసుకుని శాంతిని నెలకొల్పకపోతే, ప్రపంచం మరో భారీ ఆర్థిక మాంద్యంలోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

### తప్పుడు ప్రచారాలు ప్రధానం

యుద్ధాల సమయంలో తప్పుడు ప్రచారాలు (ప్రాపగండా) కీలక పాత్ర పోషిస్తాయి. ఇవి శత్రు దేశాలను గందరగోళంలోకి నెట్టడమే కాకుండా, సొంత దేశంలోని ప్రజల ఉత్సాహాన్ని, ఐక్యతను పెంచడానికి, యుద్ధ వ్యూహాలను రహస్యంగా అమలు చేయడానికి ఉపయోగపడతాయి. కొన్ని సందర్భాల్లో, ఈ తప్పుడు ప్రచారాలు యుద్ధ విజయాలకు కూడా దోహదపడటమే కాకుండా సైనికుల్లో, ప్రజల్లోనూ ఉత్సాహాన్ని నింపుతాయి. ఫలితంగా యుద్ధం గెలిచేందుకు అవకాశాలు పెరుగుతాయి. యుద్ధనీతుల్లో ఇది కూడా ప్రధానమైనది. వాస్తవానికి రెండో ప్రపంచ యుద్ధంలో జర్మనీ సమాచార శాఖ మంత్రి గోబెల్స్ జర్మనీ ప్రజలతోపాటు ప్రపంచం మొత్తాన్ని తన తప్పుడు ప్రచారంతో నమ్మించాడు. జర్మనీకి ఉన్న బలం కంటే వెయ్యిరెట్లు ఎక్కువ ఉన్నట్లు ప్రపంచదేశాలను భయపెట్టాడు. అందుకే అమెరికా, బ్రిటన్, రష్యా ఆచితూచి అడుగువేయాల్సిన పరిస్థితి వచ్చేలా చేశాడు. ఎంతటి ప్రచారమైనా ఒకస్థాయి వరకే పనిచేస్తుంది. ఆలోపు విజయం సాధించకపోతే జర్మనీలా దారుణ ఓటమికి గురికాక తప్పదు. నేటికీ ఎన్నో దేశాలు తప్పుడు ప్రచారాలనే అస్త్రాలుగా చేసుకుని యుద్ధానికి కాలుదువ్వుతున్నాయి. కానీ, అందులో కొన్ని విజయం సాధించగా మరికొన్ని ఘోర ఓటమి పాలయ్యాయి. ఇలాంటి వాటిల్లో అగ్రరాజ్యం అమెరికా కూడా ఉన్నది. ఇరాక్ పై విజయం సాధించగా.. వియత్నాంలో మాత్రం చావుదెబ్బతిన్నది. ఇక పాక్ మాత్రం భారత్ పై చేసిన అన్ని యుద్ధాల్లోనూ మట్టికరిచింది. గోబెల్స్ స్థాయిలో అబద్ధపు ప్రచారం చేసి యుద్ధాలకు కాలుదువ్విన దేశాలు.. ఆ యుద్ధ విశేషాలు ఇలా ఉన్నాయి.

### సామూహిక విధ్వంసక ఆయుధాలు



ఇరాక్లో సద్దాం హుస్సేన్ కెమికల్, సామూహిక విధ్వంసక ఆయుధాలను కలిగి ఉన్నాడని.. అవి అమెరికాకు ముప్పుగా ఉన్నాయని అమెరికా, బ్రిటన్ ప్రచారం చేశాయి. ఈ ప్రచారం కారణంగా అమెరికా చర్యలకు అంతర్జాతీయ మద్దతు కూడా లభించింది. 2003లో అమెరికా నేతృత్వంలో ఇరాక్పై దాడి జరిగింది. ఈ యుద్ధం సద్దాం పాలనను ముగించినప్పటికీ. అమెరికా చెప్పిన సామూహిక విధ్వంసక ఆయుధాలేవీ దొరకలేదు. అయితే చివరికి ఐక్యరాజ్య సమితి తనిఖీలు, పాత్రికేయుల స్వతంత్ర దర్యాప్తులు, లీక్ అయిన నిఘా రిపోర్టుల ఆధారంగా అమెరికా చేసిన ప్రచారం అంతా ఉత్తదేనని నిర్ధారణ అయింది. కానీ, అప్పటికే ఎంత నష్టం జరగాలో అంతా జరిగిపోయింది. సద్దాం హుస్సేన్ పాలన తర్వాత ఇరాక్ లో జరిగిన అరాచకాలు ఆ దేశాన్ని పూర్తిగా సర్వనాశనం చేశాయి. సద్దాం ఉండి ఉంటే.. ఇంతగా ఇరాక్ భ్రష్టుపట్టిపోయేది కాదన్న వాదనలు ప్రపంచవ్యాప్తంగా వినిపించాయి.

### భారత్-పాకిస్తాన్ యుద్ధం (1965)

కశ్మీర్ లోయలో ఉగ్రవాదాన్ని ఉసిగొల్పిన పాక్ ఆ తర్వాత దానిని భారత ప్రభుత్వంపై స్థానిక ప్రజలు చేస్తున్న తిరుగుబాటుగా అంతర్జాతీయంగా ప్రచారం చేసింది. ఇందుకు కనీవిని ఎరుగని రీతిలో మారణకాండకు పాల్పడింది. పాక్ సీమాంతర ఉగ్రవాదానికి పాల్పడుతూ సరిహద్దులవెంబడి వందలాది ఉగ్రవాద శిబిరాలు ఏర్పాటుచేసింది. ప్రతిరోజూ కశ్మీర్లోకి దొంగతనంగా పదుల సంఖ్యలో ఉగ్రవాదులను పంపి.. హింసాత్మక చర్యలకు పాల్పడింది. ఇలా చేస్తూనే కశ్మీర్లో భారత ప్రభుత్వంపై స్థానికులు తిరుగుబాటు చేస్తున్నారని ప్రచారం చేసింది. దీనికి కొనసాగింపుగా ఆపరేషన్ జిబ్రాల్టర్ పేరిట కశ్మీర్ విముక్తి ప్రసాదిస్తామని భారత్ పై దాడులకు దిగింది. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరగడంతో 1965లో రెండు దేశాల నడుమ యుద్ధం జరిగింది. భారత్ పై చేయి సాధించడంతో పాక్ తోకముడిచింది. పాక్ కుయుక్తులు ఆ తర్వాతి రోజుల్లో వెలుగు చూశాయి. భారత గుడాచార సంస్థ (ఆర్ అండ్ ఏడబ్ల్యూ) పాక్ రహస్య కార్యకలాపాలపై ఇచ్చిన నివేదికలు, యుద్ధం తర్వాత రెండు దేశాల నడుమ జరిగిన చర్చలతోపాటు డీ క్లాసిఫైడ్ నివేదికలతో పాక్ గుట్టు రట్టు అయ్యింది. అయితే, రెండో ప్రపంచయుద్ధం తర్వాత జరిగిన అతి పెద్ద యుద్ధట్యాంకులు పాల్గొన్న యుద్ధంగా కూడా రికార్డుల్లో నిలిచింది. భారతదేశం తరఫున దాదాపు 1400 యుద్ధ ట్యాంకులు పోరాటం చేస్తే.. పాక్ నుంచి 1100వరకు యుద్ధట్యాంకులు పోరాటంలోకి దిగాయి. భారత్ కు చెందిన 30 ట్యాంకులు పూర్తిగా నష్టపోతే.. పాక్ కు చెందిన ఒక ప్లటూన్ పైనే అంటే 100కుపైనే ట్యాంకులు నాశనం కావడంతోపాటు పట్టుబడ్డాయి. ఈ యుద్ధంలో పాక్ నుంచి పంజాబ్ నుంచి భారత్ లోకి అడుగుపెట్టేందుకు ప్రయత్నించింది. సెప్టెంబర్ నెల కావడంతో వర్షాలకు నేల చిత్తడిగా ఉన్నది. పాక్ బలగాలను సరిహద్దుల్లోనే అడ్డుకోవడం కంటే కొంత లోపలికి వచ్చాక దాడి చేస్తే ఎక్కువ నష్టం వాటిల్లుతుందని ఆ ప్రాంతానికి సైనిక కమాండర్ అయిన గురుభక్ష్ సింగ్ ప్రణాళిక వేశారు. దీంతో పాక్ ట్యాంకులు ముందుకు కదులుతున్న కొద్దీ భారత సైనికులు తమ పోస్టులను ఖాళీ చేస్తూ వెనక్కి వెళ్లారు. అయితే, పాక్ సైన్యం సులువుగా లోనికి వచ్చేలా చేయడంతోపాటు ఒక గుర్రపు నాడా ఆకారంలాంటి ఉచ్చులోకి వాళ్లు వచ్చేలా చేశారు. ఉత్తరంనుంచి వస్తున్న పాక్ బలగాలను తూర్పు పడమర లో ఉన్న పోస్టులనుంచి భారీగా ప్రతిఘటన ఇస్తూ దక్షిణంవైపు వాళ్లను వెళ్లేలా చేశారు. తీరా గుర్రపునాడా మధ్యలోకి వచ్చాక.. అక్కడ ఖేంఖరణ్ అనే పట్టణంశివారుకు పాక్ ట్యాంకులు చేరాయి. అక్కడ వర్షం కారణంగా నేలంతా చిత్తడిగా ఉంది.. ట్యాంకులు ముందుకు కదలలేదు. సరిగ్గా అలాంటి ప్రాంతంలోనే భారతసైన్యం గట్టిగా ప్రతిఘటించింది. జీపులో అమర్చిన ఓ మోర్టార్ లాంటి ఆయుధంతో ట్యాంకులను తుక్కు తక్కు చేయడంతో పాక్ సైన్యం బెదిరిపోయి.. దాదాపు 100కుపైగా అమెరికా తయారీ పాటన్ ట్యాంకులు వదిలిపారిపోయారు. దీంతో ఆ ప్రాంతాన్ని పాటన్ నగరం అని, ట్యాంకులగోరీ అని నేటికీ పిలుచుకుంటారు.

### నాడు సామ్రాజ్యవాదం నేడు వ్యాపార వాదం

ప్రపంచయుద్ధం తర్వాత అగ్రరాజ్యాల ఆధిపత్య పోరు కారణంగా యుద్ధాలు జరుగగా.. నేడు మూడో ప్రపంచదేశాలు తమ ఆయుధాలను ప్రదర్శించేందుకు యుద్ధాలకు కాలుదువ్వుతున్నాయి. అమెరికా, రష్యా మధ్య జరిగిన ప్రచ్ఛన్నయుద్ధంలో ఎన్నో దేశాలు సమిధలుగా మారాయి. అమెరికా, రష్యాల ఆధిపత్యాల కారణంగా జరిగిన యుద్ధాలుగా కొరియా యుద్ధం (19501953), వియత్నాం యుద్ధం (19551975), సోవియట్-ఆఫ్ఘన్ యుద్ధం (19791989), క్యూబా విప్లవం మరియు బే ఆఫ్ పిగ్స్ దాడి (19591961), గ్రెనడా దాడి (1983), నికరాగ్వాలో కాంట్రా (19811990) యుద్ధాలు జరిగాయి. ఇక నేటికాలంలో కొన్ని యుద్ధాలు, సాయుధ సంఘర్షణలను పూర్తిగా ఆయుధాల పరీక్షల మైదానాలుగా వర్ణిస్తున్నారు. ఎందుకంటే ఈ సంఘర్షణల్లో అగ్ర దేశాలు తమ అధునాతన ఆయుధాలు, సాంకేతికతలు, సైనిక సామర్థ్యాలను ప్రదర్శించడానికి ఉపయోగిస్తున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్-హమాస్ సంఘర్షణ, సిరియా అంతర్యుద్ధం, యెమెన్ సంఘర్షణలు ఇందుకు ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. సైనిక నిపుణులు అనేక సందర్భాల్లో చెప్పిన వివరాల ప్రకారం.. రష్యా ఆయుధాలు సిరియాలో, ఇజ్రాయెల్ ఆయుధాలు గాజాలో, అమెరికా ఆయుధాలు ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్లో పరీక్షించబడ్డాయి. ఈ యుద్ధాలు ఆయుధ తయారీదారులకు తమ ఉత్పత్తులను ప్రదర్శించడానికి, ఎగుమతి చేయడానికి వేదికలుగా మారాయని పేర్కొంటున్నారు. ఇప్పుడు సైనిక ఘర్షణ జరిగినా అందులో వాడుతున్న ఆయుధాలు వాటి పనితీరుపై ప్రధానంగా చర్చ జరుగుతున్నది. పాక్ పై భారత్ ప్రయోగించిన ఆయుధాలను అనేక దేశాలు కొనుగోలు చేసేందుకు ముందుకువస్తున్నాయని ఇప్పటికే ఎన్నో వార్తలు వచ్చాయి. ఇలా ప్రతి ఉద్రిక్తతను ఆయుధ కంపెనీలు, అగ్రరాజ్యాలు మార్కెట్ చేసుకోవడం వాస్తవంగా మారింది.

**విద్య వెంకట్, తెలంగాణ బ్యూరో 9391618181**

# ఉరుగ్వే -- ఆస్ట్రియా

## వరల్డ్ కప్ క్వాలిఫైయర్స్ హాకీ మ్యాచ్

### గచ్చిబౌలి హాకీ స్టేడియంలో మ్యాచ్‌ను ప్రారంభించిన మంత్రి సీతక్క



తెలంగాణ బ్యూరో|ప్రతినిధిః హైదరాబాద్‌లోని గచ్చిబౌలి హాకీ స్టేడియంలో ఉరుగ్వే, ఆస్ట్రియా జట్ల మధ్య జరిగిన మహిళల హాకీ వరల్డ్ కప్ క్వాలిఫైయర్స్ మ్యాచ్‌ను రాష్ట్ర మంత్రులు సీతక్క, అజారుద్దీన్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలు తెలంగాణలో నిర్వహించడం రాష్ట్రానికి గర్వకారణమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

మ్యాచ్ ప్రారంభానికి ముందు మంత్రి సీతక్క ఇరు జట్ల క్రీడాకారిణులను వ్యక్తిగతంగా పరిచయం చేసుకొని వారికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. క్రీడాస్ఫూర్తితో అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలని, ఈ పోటీలు అంతర్జాతీయ స్థాయిలో మహిళల హాకీ అభివృద్ధికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడల ద్వారా దేశాల మధ్య స్నేహ సంబంధాలు మరింత బలపడతాయని ఆమె పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఆధునిక క్రీడా మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రపంచ స్థాయి క్రీడా పోటీలను తెలంగాణలో నిర్వహించడం ద్వారా రాష్ట్రం అంతర్జాతీయ క్రీడా పటంలో ప్రత్యేక గుర్తింపు పొందుతోందని అన్నారు.

మహిళా క్రీడాకారిణులకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. క్రీడలు యువతకు ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని అందిస్తాయని ఆమె అన్నారు. తెలంగాణలో క్రీడల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ పోటీలను రాష్ట్రంలో నిర్వహించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. దేశంలోని తొలి క్రీడ యూనివర్సిటీని తెలంగాణలో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఏటిజి చైర్మన్ శివసేనారెడ్డి, ఎండీ సోనీ బాలాదేవి, తెలంగాణ హాకీ అసోసియేషన్ సెక్రటరీ భీమ్ సింగ్, క్రీడా శాఖ అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. మ్యాచ్‌ను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు హాజరై క్రీడాకారిణులను ఉత్సాహపరిచారు. తెలంగాణలో ఇలాంటి అంతర్జాతీయ క్రీడా పోటీలు నిర్వహించడం రాష్ట్ర క్రీడా రంగ అభివృద్ధికి దోహదపడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.

# సన్‌రైజర్స్ లీడ్స్‌లో పాక్ ఆటగాడు..

## బిడ్‌తో మాకు సంబంధం లేదు : బీసీసీఐ



ది హండ్రెడ్ లీగ్ కోసం నిర్వహించిన వేలంలో సన్‌రైజర్స్ లీడ్స్ జట్టు పాకిస్థాన్ క్రికెటర్ అబ్రార్ అహ్మద్‌ను తీసుకుంది. సన్‌రైజర్స్ లీడ్స్ జట్టుకు ఓనర్ సన్ గ్రూప్ కావడం గమనార్హం. ఐపీఎల్ ఫ్రాంచైజీ అయిన సన్‌రైజర్స్ హైదరాబాద్ కూడా సన్‌గ్రూప్‌దేనన్న సంగతి తెలిసిందే. సన్‌రైజర్స్ సీఈవో కావ్యా మారన్ నేరుగా 'ది హండ్రెడ్' వేలంలో పాల్గొని మరీ పాక్ ఆటగాడిని తీసుకోవడంతో విమర్శలు వచ్చాయి. పాక్ క్రికెటర్‌ను తీసుకోవడంపై తాజాగా బీసీసీఐ స్పందించింది. విదేశీ లీగ్ వేలంలో జరిగిందని, తమకు సంబంధం ఉండదని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా స్పష్టం చేశారు.

"ఆ కొనుగోలు వ్యవహారం ఐపీఎల్‌లో జరగలేదు. సన్‌రైజర్స్ యాజమాన్యం విదేశీ లీగ్ వేలం బిడ్డింగ్‌లో పాల్గొని పాక్ క్రికెటర్‌ను తీసుకుంది. అది వారి నిర్ణయం. అందులో మేం చేసేదేమీ లేదు. వేరే లీగుల్లో ఏం జరిగినా మాకు సంబంధం లేదు. భారత్ వెలుపల ఆయా ఫ్రాంచైజీల బిడ్డింగ్‌ల్లో మాకు ఏం సంబంధం ఉంటుంది?" అని రాజీవ్ శుక్లా వెల్లడించారు. పాక్ క్రికెటర్‌ను తీసుకున్న యాజమాన్యంపై ఐపీఎల్‌లోనూ వేటు వేయాలని భారత క్రికెట్ అభిమానులు డిమాండ్ చేస్తున్నారు. పెద్ద సంఖ్యలో రిపోర్ట్ కొట్టడంతో ఇప్పటికే సన్‌రైజర్స్ లీడ్స్ టీమ్ అధికారిక 'ఎక్స్' ఖాతా సస్పెన్షన్‌కు గురైంది. మరికొద్ది రోజుల్లో ఐపీఎల్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ పరిమాణాలు ఎటు దారితీస్తాయోనని క్రికెట్ వర్గాల్లో చర్చ మొదలైంది.

# అనుమతి లేకుండా ప్రోమోస్‌లో మావి వాడారు





### సీఎస్‌కేపై సన్‌టీవీ దావా

ఐపీఎల్‌లో అత్యంత అభిమానగణం కలిగిన టీమ్ చెన్నై సూపర్ కింగ్స్. ఎంఎస్ ధోని సారథ్యంలో ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచింది. మరో టైటిల్ కోసం సిద్ధమవుతోంది. ఈ క్రమంలో కాపీరైట్ ఉల్లంఘనలకు పాల్పడిందని ఆరోపిస్తూ సీఎస్‌కేపై మద్రాస్ హైకోర్టులో సన్‌టీవీ నెట్‌వర్క్ రూ. కోటికి దావా వేసింది. తమ అనుమతి లేకుండానే జైలర్, జైలర్ -2, కూలీ సినిమాల్లోని బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్, ఆడియో ట్రాక్‌లు, డైలాగులను సీఎస్‌కే తమ ప్రచార వీడియోలో వాడుకుందని పేర్కొంది. వాణిజ్యపరంగా వాటిని వాడుకోవడం కాపీరైట్ ఉల్లంఘన కిందకు వస్తుందని తెలిపింది. సదరు కంటెంట్ కాపీరైట్ రక్షణ పరిధిలో ఉందని, దానిని వినియోగించుకోవాలంటే తమ ముందస్తు అనుమతి తప్పనిసరి అని ఆ చిత్రాల నిర్మాతలు హైకోర్టుకు తెలిపారు. సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్‌తో తాము చేసుకున్న ఒప్పందాలను హైకోర్టుకు సమర్పించారు. "కాపీరైట్ కలిగిన తమ మెటీరియల్‌ను సీఎస్‌కే లిమిటెడ్ అనధికారికంగా వినియోగిస్తోందని పేర్కొంటూ మార్చి 1న ఈమెయిల్ పంపాం. ఆ తర్వాత ఆ సంస్థ వాటి వినియోగాన్ని నిలిపివేసింది. సంగీత దర్శకుడు అనిరుధ్‌తో చేసుకున్న ఒప్పందం ప్రకారం హక్కులన్నీ మాకే చెందుతాయి. భవిష్యత్తులో ప్రతివాది నుంచి ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలి" అని సన్‌టీవీ తరఫున రవీంద్రన్ కోరారు. తాము ఇప్పటికే ఆ కంటెంట్‌ను నిలిపివేశామని హైకోర్టుకు చెన్నై సూపర్ కింగ్స్ తెలిపింది. సన్‌టీవీ నెట్‌వర్క్ చేసిన వాదనలను, సీఎస్‌కే ఇచ్చిన తక్షణ స్పందనను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది.

ఈ పాటలు, సంభాషణల వినియోగానికి సంబంధించి ఏవైనా ఆంక్షలు లేదా జరిమానాలు విధించడంపై నిర్ణయం తీసుకొనే ముందు మరోసారి ఇరుపక్షాల వాదనలు వినాలని మద్రాసు హైకోర్టు నిర్ణయించింది. సన్ గ్రూప్‌నకు చెందిన సన్‌రైజర్స్ హైదరాబాద్ కూడా ఐపీఎల్‌లో పోటీపడుతోన్న సంగతి తెలిసిందే. మరోవైపు ది హండ్రెడ్ లీగ్‌లో సన్‌రైజర్స్ లీడ్స్ జట్టు పాక్ క్రికెటర్ అబ్రార్ అహ్మద్‌ను తీసుకోవడం విమర్శలకు దారితీసింది. ఇప్పుడు సీఎస్‌కేపై సన్‌టీవీ నెట్‌వర్క్ దావా వేయడం చర్చకు దారితీసింది.

# బీసీసీఐ స్పెషల్ ఫోకస్

## రోహిత్, కోహ్లీలే టార్గెట్‌గా మాస్టర్ ప్లాన్




భారత క్రికెట్ ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో ఉంది. వరుసగా రెండు టీ20 ప్రపంచకప్‌లు గెలవడంతో పాటు ఛాంపియన్స్ ట్రోఫీని కూడా ముద్దాడి వైట్ బాల్ క్రికెట్‌లో తిరుగులేని శక్తిగా ఎదిగింది. అయితే ఇన్ని విజయాలు ఉన్నప్పటికీ టీమ్‌ఇండియాకు ఒక వెలితి మాత్రం అలాగే ఉండిపోయింది. అదే 50 ఓవర్ల వన్డే వరల్డ్ కప్. 2011 తర్వాత భారత్ మళ్లీ ఆ ట్రోఫీని ముద్దాడలేదు. గత టోర్నీలో సొంత గడ్డపై ఫైనల్ వరకు వచ్చినా ఆస్ట్రేలియా చేతిలో ఎదురైన ఓటమి అభిమానులను ఇంకా వేధిస్తూనే ఉంది. ఈ నేపథ్యంలోనే బీసీసీఐ ఇప్పుడు ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. 2027లో జరిగే వన్డే వరల్డ్ కప్ టార్గెట్‌గా ఇప్పటి నుంచే భారీ వ్యూహాలకు పదును పెడుతోంది. అందులో భాగంగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల కోసం ఒక ప్రత్యేక ప్లాన్ సిద్ధం చేసింది. అదేంటంటే?

**రో–కో కోసం స్పెషల్!**

టీమ్‌ఇండియా దిగ్గజాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ప్రస్తుతం వన్డే ఫార్మాట్‌లోనే ఆడుతున్నారు. 2027 వన్డే వరల్డ్ కప్ నాటికి వీరిద్దరూ పూర్తి ఫామ్‌లో ఉండాలని బీసీసీఐ భావిస్తోంది. అందుకే వారిద్దరికీ తగినంత ప్రాక్టీస్ లభించేలా రాబోయే విదేశీ పర్యటనల్లో అదనపు వన్డే మ్యాచులను షెడ్యూల్ చేయాలని నిర్ణయించింది. సాధారణంగా జరిగే మ్యాచుల కంటే ఎక్కువ వన్డేలు ఆడటం వల్ల ఈ ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లు మెగా టోర్నీకి మెరుగ్గా సిద్ధమవడానికి అవకాశం ఉంటుంది.

**ఐపీఎల్ తర్వాత!**

ప్రస్తుతం అందరి దృష్టి ఐపీఎల్ 2026 సీజన్ పైనే ఉన్నప్పటికీ, మే నెలలో లీగ్ ముగిసిన వెంటనే టీమ్‌ఇండియా తన రూటు మార్చుకోనుంది. ఇప్పటివరకు టీ20లకు ఇచ్చిన ప్రాధాన్యతను ఇకపై వన్డే ఫార్మాట్?కు మళ్లించనున్నారు. ఐపీఎల్ తర్వాత భారత జట్టు ఆఫ్గానిస్థాన్‌తో ఒక టెస్ట్, మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. దీని తర్వాత ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లి అక్కడ ఐదు టీ20లతో పాటు మూడు వన్డేలు ఆడేలా షెడ్యూల్ ఉంది. అయితే ఇంగ్లాండ్ పర్యటనలో కూడా మరిన్ని వన్డేలు చేర్చే అవకాశం కనిపిస్తోంది.

**కివీస్, ఇంగ్లాండ్ బోర్డుల నుంచి భారీ ఆఫర్లు**

భారత జట్టుతో సిరీస్ అంటే ఇతర దేశాల బోర్డులకు కూడా భారీ ఆదాయం వస్తుంది. అందుకే న్యూజిలాండ్, ఇంగ్లాండ్ వంటి బోర్డులు తమ పర్యటనల్లో అదనపు వన్డే మ్యాచులను చేర్చాలని బీసీసీఐని కోరుతున్నాయి. కివీస్ బోర్డు ఇప్పటికే మరిన్ని వన్డేల కోసం రిక్వెస్ట్ పంపగా, బీసీసీఐ కూడా సానుకూలంగా స్పందించింది. అలాగే శ్రీలంక, వెస్టిండీస్, బంగ్లాదేశ్ జట్లతో కూడా భారత్ పరిమిత ఓవర్ల సిరీస్‌లు ఆడేలా ప్లాన్ చేస్తోంది. ఈ అదనపు మ్యాచులు ప్రపంచకప్ సన్నాహకాల్లో భాగంగా భారత జట్టుకు ఎంతగానో ఉపయోగపడతాయి.

**కోహ్లీ– రోహిత్ నెట్ ప్రాక్టీస్–వీడియోలు వైరల్**

మరోవైపు విరాట్, రోహిత్ ఇప్పటికే తమ తదుపరి లక్ష్యంపై దృష్టి సారించారు. ఐపీఎల్ 2026 కోసం ప్రాక్టీస్ మొదలు పెట్టేశారు. నెట్స్‌లో తీవ్రంగా శ్రమిస్తున్నారు. దీనికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ వయసులోనూ రో–కో ఫిట్?నెస్?, ఆటపై వాళ్లు చూపిస్తున్న అంకితభావానికి అభిమానులు ఫిదా అవుతున్నారు. వాళ్లు చేస్తున్న ఈ కసరత్తులు కేవలం ఐపీఎల్ కోసమే కాదు, భవిష్యత్తులో రాబోయే వన్డే సిరీస్‌లకు కూడా ఉపయోగపడేలా కనిపిస్తున్నాయని ఫ్యాన్స్ అంటున్నారు.



**బీసీసీఐ పట్టుదల :** 2011లో ధోనీ సారథ్యంలో గెలిచిన వన్డే వరల్డ్ కప్ మళ్లీ భారత్?కు దక్కలేదు. 2023లో చేజారిన ఆ అవకాశాన్ని 2027లో దక్షిణాఫ్రికా వేదికగా ఎలాగైనా అందిపుచ్చుకోవాలని భారత్ భావిస్తోంది. జట్టు అద్భుతంగా ఆడుతున్న తరుణంలో కోహ్లీ, రోహిత్ వంటి సీనియర్స్ అండగా ఉంటే ట్రోఫీని గెలవడం కష్టం కాదని బోర్డు నమ్ముతోంది. అందుకే మ్యాచుల సంఖ్యను పెంచి ఆటగాళ్లను మానసికంగా, శారీరకంగా సిద్ధం చేయడమే బీసీసీఐ ముందున్న ప్రధాన లక్ష్యం. వన్డేల్లో రోహిత్, కోహ్లీలు ఉండడం జట్టుకు పెద్ద బలం. ఈ ఇద్దరు దిగ్గజాలు మైదానంలో ఉంటే ప్రత్యర్థులకు వణుకు పుట్టడం ఖాయం. అదనపు మ్యాచులు ఆడటం ద్వారా వారు తమ ఫామ్ దెబ్బతినకుండా చూసుకోవచ్చు. ఐపీఎల్ తర్వాత జరగబోయే వరుస సిరీస్‌లు యువ ఆటగాళ్లకు కూడా సీనియర్ల నుంచి నేర్చుకునే గొప్ప అవకాశాన్ని కల్పిస్తాయి. మొత్తం మీద చూస్తే 2027 వన్డే వరల్డ్ కప్ కోసం బీసీసీఐ వేస్తున్న అడుగులు పక్కా ప్రణాళికతో ఉన్నట్లు కనిపిస్తున్నాయి. మరి ఈ ప్లాన్స్ ఎంతవరకు సక్సెస్ అవుతాయో చూడాలి.

# క్రికెట్‌పరంగా ఏం నిర్ణయం తీసుకున్నా ధోనీ మద్దతు



ఐపీఎల్ 2026 ఎడిషన్‌కు మరో రెండు వారాలు ఉంది. ఎంఎస్ ధోని ఏ పాత్ర పోషిస్తాడనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. చెన్నై సూపర్ కింగ్స్ తన తొలి మ్యాచ్‌లో మార్చి 30న రాజస్థాన్ రాయల్స్‌తో తలపడనుంది. ఇప్పటికే సీఎస్‌కే యువ క్రికెటర్లు సాధనను మొదలుపెట్టారు. ధోని కూడా ప్రాక్టీస్ చేసిన వీడియోలను సోషల్ మీడియాలో చూశాం.

ఈ క్రమంలో సీఎస్‌కే మాజీ ఆటగాడు సుబ్రమణియన్ బద్రినాథ్ స్పందిస్తూ.. ధోని పాత్ర గురించి మేనేజ్‌మెంట్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అనేది ఆసక్తికరంగా ఉందని తెలిపాడు.

"ధోని అన్ని మ్యాచులను ఆడేందుకు సిద్ధంగా ఉన్నాడని సీఈవో చెప్పడం అడ్మినిస్ట్రేటివ్ నిర్ణయమో కాదో తెలియదు. క్రికెట్‌పరంగా ఏం నిర్ణయం తీసుకున్నా మద్దతు ఇస్తామన్నారు. ధోని వద్దకు ప్రధాన కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ వెళ్లి .. నువ్వు ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడాలి లేదా ఈ మ్యాచ్‌లో నిన్ను పక్కన పెడుతున్నాం అని చెప్పగలడా? అలాంటి అవకాశం లేదని భావిస్తున్నా. అది సాధ్యం కూడా కాదు.

ఫ్లెమింగ్ మాత్రమే కాదు సీఎస్‌కేలో ఎవరూ అలా చెప్పరు. కాబట్టి, ధోని ఈ సీజన్‌లోని అన్ని మ్యాచులనూ ఆడతాడని అనుకోవచ్చు. ధోని కూడా మంచి ఫిట్‌గా ఉన్నాడు. ఐపీఎల్‌లో ఆడేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాడు. అయితే, ఎలాంటి పాత్ర పోషిస్తాడనేది ఇప్పుడు అందరిలోనూ ఆసక్తి కలిగిస్తోన్న అంశం" అని బద్రినాథ్ వెల్లడించాడు.

ఈసారి ఆర్సీబీని ఓడించగలదు..

"రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 18 ఏళ్లలో ఒకే ఒక్క కప్‌ను మాత్రమే సాధించింది. సీఎస్‌కే మాత్రం ఐదు టైటిళ్లను సొంతం చేసుకుంది. కాబట్టి, ఇరు జట్ల మధ్య 'పోటీ' ఉందని అనుకోను. ఇటీవల మ్యాచుల్లో మాత్రం సీఎస్‌కేపై ఆర్సీబీ విజయాలు సాధించింది.

చిన్నస్వామి స్టేడియంలో చెన్నై ఓడింది. అయితే, సీఎస్‌కే తన సామర్థ్యం మేరకు అత్యుత్తమ క్రికెట్ ఆడలేదని చెప్పగలను.

అందుకే, ఈ సీజన్‌లో ఇరు జట్ల మధ్య జరగబోయే మ్యాచ్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నా" అని బద్రినాథ్ తెలిపాడు. ఆర్సీబీతో ఏప్రిల్ 5న బెంగళూరు వేదికగా సీఎస్‌కే తలపడుతోంది.

# ఐపీఎల్‌లో కోహ్లీ మరింత ధాటిగా ఆడతాడు

టీమ్‌ఇండియా మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ .. విరాట్ కోహ్లీని ప్రశంసలతో ముంచెత్తాడు. అతడు వరుసగా రెండోసారి టైటిల్‌ను సొంతం చేసుకోవడం కోసం.. ఐపీఎల్ 2026లో మరింత ధాటిగా ఆడతాడన్నాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తొలిసారిగా 2025లో ఐపీఎల్ ట్రోఫీని గెలిచిన విషయం తెలిసిందే. అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంలో పంజాబ్ కింగ్స్‌ను ఓడించి ఆర్సీబీ విజేతగా నిలిచింది. 'విరాట్ కోహ్లీలో పరుగుల దాహం అలాగే ఉంది. నిజానికి అది గతంలో కంటే మరింత ఎక్కువగా ఉంది. ముఖ్యంగా గత సీజన్‌లో విజేతగా నిలిచిన తర్వాత అది మరింత పెరిగింది. అతడు వరుసగా రెండుసార్లు ట్రోఫీని గెలవాలని భావిస్తున్నాడు. దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌ల్లో విరాట్ అద్భుతంగా రాణించాడు. ఆడుతున్న ప్రతి మ్యాచ్‌లోనూ తనదైన ముద్ర వేయాలనుకుంటాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లోనూ అతడు అదే దృక్పథంతో బరిలోకి దిగి, ధాటిగా ఆడేందుకు ప్రయత్నం చేస్తాడు.' అని ఇర్ఫాన్ పఠాన్ అన్నాడు.

"ధోని లేని సీఎస్‌కే అసంపూర్తిగా అనిపిస్తుంది. ఐపీఎల్ కూడా బోసిపోయినట్లు ఉంటుంది. అతడికిదే చివరి సీజన్ కావచ్చనేది నా అభిప్రాయం. జట్టులో ఈసారి కీలక పాత్ర పోషిస్తాడు. సంజు శాంసన్‌కు బెనిఫిట్. నాయకత్వ బృందంలో చేరే అవకాశం ఉంది. ప్రస్తుతం రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్ అయినప్పటికీ.. భవిష్యత్తు కోసం కనీసం ఇద్దరు లేదా ముగ్గురు సిద్ధం కావాల్సి ఉంటుంది. ధోని ఉండటంతో అవన్నీ సులువుగా జరిగిపోతాయి. అయితే, అతడి బ్యాటింగ్ పొజిషన్, ఫిట్‌నెస్‌పై ప్రశ్నలు వస్తున్నాయి. ఈ విషయంలో సీఎస్‌కే మేనేజ్‌మెంట్ జాగ్రత్తగా నిర్ణయం తీసుకుంటుంది. ఆరో టైటిల్ గెలిచి ధోనికి గొప్ప వీడ్కోలు ఇవ్వాలని ఫ్రాంచైజీ భావిస్తుందని అనుకుంటున్నా" అని పఠాన్ తెలిపాడు.



# టీ20 ప్రపంచకప్‌లో తెలివి తక్కువ జట్టు దక్షిణాఫ్రికా..

ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్.. దక్షిణాఫ్రికాను టీ20 వరల్డ్ కప్ 2026లో తెలివితక్కువ జట్టు అని అభివర్ణించాడు. సూపర్ 8లో భాగంగా వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఓడిపోయి ఉంటే.. భారత్ టోర్నీ నుంచి నిష్క్రమించి ఉండేదన్నాడు. బలమైన జట్టుగా ఉన్న టీమ్‌ఇండియాను వరల్డ్‌కప్ నుంచి బయటకు పంపించి ఉండాల్సిందని అభిప్రాయపడ్డాడు.

'మీకో విషయం చెబుతాను. ఈ టోర్నమెంట్‌లో తెలివితక్కువ జట్టు ఏదో చెప్పనా.. అది దక్షిణాఫ్రికా. ఎందుకంటే సూపర్ 8లో జరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్‌ను గెలవనిస్తే.. భారత్ టోర్నీ నుంచి నిష్క్రమించి ఉండేది. కానీ ఆ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా గెలిచి భారత్ వరల్డ్ కప్‌లో కొనసాగేందుకు అవకాశం కల్పించారు. తర్వాత టీమ్‌ఇండియా, జింబాబ్వే, వెస్టిండీస్‌లపై విజయం సాధించి సెమీఫైనల్‌కు దూసుకువెళ్లింది. అనంతరం సెమీస్‌లో ఇంగ్లాండ్‌ను ఓడించింది' అని మైఖేల్‌వాన్ ఓ పాడ్‌కాస్ట్‌లో అన్నాడు. 'ఇలాంటివి జరగకూడదు. సాధారణంగా జరగవు కూడా. కానీ.. మీరు వరల్డ్ కప్ గెలవాలనుకుంటే.. ఉత్తమ జట్టును తొందరగానే టోర్నీ నుంచి బయటకు పంపాలి' అని అతడు విశ్లేషించాడు.

టీమ్‌ఇండియా సూపర్ 8లో భాగంగా దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో 76 పరుగుల భారీ తేడాతో ఘోర ఓటమిని చవిచూసిన విషయం తెలిసిందే. దీంతో నెట్‌రన్‌రేట్ మైనస్‌కు చేరి, సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంది. ఒకరకంగా తన సెమీస్ అవకాశాలను కష్టతరం చేసుకుంది. కానీ జింబాబ్వే, వెస్టిండీస్‌లతో జరిగిన మ్యాచుల్లో విజయం సాధించి టోర్నీలో ముందుకుసాగింది. ఆఖరుకు ఫైనల్‌లో న్యూజిలాండ్‌ను చిత్తు చేసి వరుసగా రెండుసార్లు టీ20 ప్రపంచకప్‌ను ముద్దాడింది. దక్షిణాఫ్రికా మాత్రం సెమీస్‌లో న్యూజిలాండ్ చేతిలో చిత్తై టోర్నీ నుంచి నిష్క్రమించింది.



సూర్య www.suryaa.com

# సినిమా

## తారక్ తదుపరి చిత్రం?



యంగ్ టైగర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న సినిమా అన్ని పనులు పూర్తి చేసుకుని సెప్టెంబర్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆ రకమైన ప్రణాళికతోనే ప్రశాంత్ నీల్ ముందుకెళుతున్నాడు. అయితే ఈ సినిమా తర్వాత తారక్ ఏ డైరెక్టర్ తో సినిమా చేస్తాడు? అన్నదే మిస్టరీగా మారింది. దీనిపై తారక్ పుట్టిన రోజు సందర్భంగా మే 20న అయినా క్లారిటీ వస్తుందా? అని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. తారక్ అభిమానులకు మే 20 వ తేదీ అంటే ఓ పండగ లాంటిది. అందులోనూ ఈ బర్త్ డే మరింత ప్రత్యేకమని చెప్పాలి. ప్రశాంత్ నీల్ సినిమా నుంచి ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ ఉండే అవకాశం ఉంది. అదీ గ్లింప్స్ లేదా? టీజర్ రూపంలో వచ్చే అవకాశం ఉంది. దీంతో పాటు కొత్త సినిమా వివరాలు కూడా తారక్ అందిస్తారని అభిమానులు అంతే ఆశగా ఎదురు చూస్తున్నారు. సన్నిహిత వర్గాల నుంచి అందుతోన్న సమాచారం చూస్తే? 'డ్రాగన్' తర్వాత ఎన్టీఆర్ లైనప్‌లో ముగ్గురు దిగ్గజ దర్శకుల ప్రముఖంగా కనిపిస్తున్నారు. అందులో ఒకరు త్రివిక్రమ్ కాగా, మరొకరు సందీప్ రెడ్డి వంగా. ఇంకొకరు వెట్రిమారన్. త్రివిక్రమ్ ప్రాజెక్ట్ విషయంలో చాలా గందరగోళం ఉంది. ఆయన రాసిన మైథలాజికల్ స్టోరీ బన్నీ-తారక్ చుట్టూ తిరుగుతుంది. వీరిలో ఎవరు ఫైనల్ అవుతారు? అన్నది అప్పుడే తేలేలా లేదు. తెగించి తారక్ ముందుకొస్తే మే 20న కొత్త అప్ డేట్ అదే అవ్వొచ్చు. అలాగే వెట్రీమారన్ కూడా ఓ పవర్‌ఫుల్ స్క్రిప్ట్ సిద్ధంగా ఉందని ముందుకొస్తున్నట్లు తెలిసింది. మరోవైపు సందీప్ రెడ్డి వంగ తోనూ పని చేయాలని తారక్ ఆసక్తిగా ఉన్నారు. అలాగే లోకేష్ కనగరాజ్ ఎల్ సీయూ లోకి తారక్ ఎంట్రీ ఇస్తారనే ప్రచారం కూడా ఉంది.

## అల్లు ఎంటర్‌టైన్‌మెంట్స్

# 'అల్లు సినిమాస్' ప్రారంభం




ప్రపంచ స్థాయి సాంకేతికతతో కూడిన ప్రీమియం లార్జ్ స్క్రీన్ ఫార్మాట్‌ను 'అల్లు సినిమాస్' హైదరాబాద్‌కు పరిచయం చేస్తోంది. హైదరాబాద్‌కు ఇదొక చారిత్రాత్మక ఘట్టంగా నిలుస్తుంది. నగరంలో తొలి డాల్బీ సినిమా వచ్చింది. హైదరాబాద్‌లోని కోకాపేటలోని 7 ఎకరాల అల్లు స్టూడియోస్ కాంప్లెక్స్‌లో ఉన్న నాలుగు స్క్రీన్‌ల అల్ట్రా-లగ్జరీ మల్టీప్లెక్స్ అల్లు సినిమాస్‌ను ప్రారంభించినట్లు అల్లు ఎంటర్‌టైన్‌మెంట్ గర్వంగా ప్రకటించింది. ఇకపై ల్యాండ్‌మార్క్ వినోద గమ్యస్థానంగా అల్లు సినిమాస్ మారనుంది. హైదరాబాద్‌ను అల్లు సినిమాస్ వరల్డ్ సినిమా మ్యాప్‌లో సరికొత్త స్థాయిలోని నిలబెడుతుంది. హైదరాబాద్‌లో మొట్టమొదటి డాల్బీ సినిమా, ప్రపంచంలోనే అతిపెద్ద డాల్బీ స్క్రీన్‌లలో ఒకటిగా 'అల్లు సినిమాస్' రికార్డ్ క్రియేట్ చేసింది. ఈ మైలురాయి ప్రపంచవ్యాప్తంగా ఎంటర్టైన్మెంట్ రంగంలో కొత్త బెంచ్‌మార్క్‌ను నిర్దేశిస్తుంది. ప్రేక్షకులకు ఈ 'అల్లు సినిమాస్' అత్యాధునిక సాంకేతికత, లగ్జరీ, సౌకర్యవంతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందిస్తుంది. 'అల్లు సినిమాస్' ఇచ్చే ఎక్స్‌పీరియెన్స్ గురించి అల్లు అరవింద్ మీడియాతో ముచ్చటించారు. అల్లు సినిమాస్ ప్రారంభోత్సవ సందర్భంగా అల్లు అరవింద్ మాట్లాడుతూ .. 'రెండేళ్లు కష్టపడి 'అల్లు సినిమాస్'ను నిర్మించాం. 'అల్లు సినిమాస్'ను నిర్మించడానికి మూడు కారణాలున్నాయి. యూవీ వంశీ సూళ్లూరుపేటలో లగ్జరీ థియేటర్‌ను కట్టారు. ఆ థియేటర్లో సినిమాని చూడటానికి పక్క ఊర్ల నుంచి కూడా జనాలు వస్తున్నారు. అది చూసి నాకు కూడా ఓ లగ్జరీ థియేటర్ కట్టాలని అనిపించింది. మిషన్ ఇంపాజిబుల్ 6 కోసం ఓ పెద్ద పారిశ్రామికవేత్త ఐమ్యాక్స్ లార్జ్ స్క్రీన్‌లో టికెట్లు కావాలని, పిల్లలు గోల చేస్తున్నారని, కచ్చితంగా టికెట్లు కావాలని అడిగారు. ఆ టికెట్లు నేను ఆయనకు ఇవ్వడంతో చాలా సంతోషించారు. అంటే పిల్లలు కేవలం సినిమాని చూడకుండా, దాన్ని ఎక్స్‌పీరియెన్స్ చేయాలని అనుకుంటున్నారు. ఆ ఎక్స్‌పీరియెన్స్ కోసం ఎంతైనా ఖర్చు పెట్టేందుకు ప్రేక్షకులు రెడీగా ఉన్నారు. అప్పుడు నాకు కొన్ని ఐడియాలు వచ్చాయి. లార్జ్ ఫార్మాట్, కొత్త ఎక్స్‌పీరియెన్స్ కోసం ఆడియెన్స్ ఎదురుచూస్తున్నారు. అలా మా 'అల్లు సినిమాస్' మొదలైంది. సింగిల్ స్క్రీన్లలో వస్తున్న ఎక్స్‌పీరియెన్స్ ఇప్పుడు జనాలకు సరిపోవడం లేదు. అందుకే ఎక్కువగా మల్టీ ఫ్లెక్స్‌లకు వస్తున్నారు. సినిమా కంటే.. సినిమాని ఎక్స్‌పీరియెన్స్ చేసేందుకు జనాలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. మల్టీప్లెక్సుల కంటే ఎక్కువ ఎక్స్‌పీరియెన్స్ ఇవ్వాలని 'అల్లు సినిమాస్'ను నిర్మించాం.

డాల్బీలో సినిమా చాలా కొత్తగా కనిపిస్తుంది, వినిపిస్తుంది. డాల్బీలోకి మారిన సినిమా విజువల్ పరంగా, సౌండ్ పరంగా అద్భుతంగా ఉంటుంది. 2024లో మేం డాల్బీని సంప్రాదించాం. డాల్బీ సినిమాస్ ఇండియా ప్రతినిధి రాజ్ మాకు ఎంతో సహకరించారు. అమెరికా, జర్మనీ, ఇండియన్ టీం ఇలా అందరం కలిసి ఓ డెబ్బై సార్లు జూమ్ కాల్స్‌లో కలిసి ఉంటాం. ఈ స్క్రీన్‌లో 78 స్పీకర్లు, 165 సౌండ్ ఔట్ లెట్లను బయటకు కనిపించకుండా అమర్చారు అన్నారు.

## 'ఆయా షేర్' కోసం 2.5 ఎకరాల

## భారీ సెట్స్‌లో 'ది ప్యారడైజ్'



'ది ప్యారడైజ్' చిత్రంలోని "ఆయా షేర్" పాట ఈ ఏడాది బిగ్గెస్ట్ హిట్స్ లో ఒకటిగా నిలిచింది. పలు భాషల్లో మిలియన్ల వ్యూస్ సాధించడంతో పాటు, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌లో వైరల్ గా రీక్రియేట్ అవుతోంది. ఈ పాటలో చూపించిన ప్రపంచాన్ని తీర్చిదిద్దేందుకు మేకర్స్ ఒక భారీ స్లమ్ సామ్రాజ్యాన్ని నిర్మించారు. ఇందులో హీరోను స్లమ్‌ల సామ్రాట్‌లా చూపించేలా ప్రత్యేకంగా సెట్స్ రూపొందించారు. టీజర్ విడుదలైనప్పటి నుంచి ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. ప్రేక్షకుల నుంచి వచ్చిన అద్భుతమైన స్పందనతో పాటు సోషల్ మీడియాలో భారీ బజ్ క్రియేట్ చేస్తోంది. ది ప్యారడైజ్ ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ఒకటిగా నిలిచింది. ఇటీవల విడుదలైన "ఆయా షేర్" పాట రా ఎనర్జీ, స్ట్రైకింగ్ విజువల్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ పాటకు వచ్చిన గ్రాండ్ లుక్ వెనుక ప్రధాన కారణం ఆర్ట్ డిపార్ట్‌మెంట్ రూపొందించిన అద్భుతమైన సెట్స్. గ్రాండియర్‌తో పాటు సహజత్వాన్ని కలిపి ఈ సెట్స్ రూపొందించారు. అత్యంత ఆకట్టుకునే సెటప్‌లలో ఒకటి హీరో హౌస్ (కమాన్ సెట్). హీరో పవర్‌ఫుల్ డిప్ మోమెంట్ కోసం ప్రత్యేకంగా ఈ భారీ నిర్మాణాన్ని రూపొందించారు. ఈ నిర్మాణం వెడల్పు 60 అడుగులు, ఎత్తు 45 అడుగులు, లోతు 25 అడుగులతో నిర్మించబడింది. మొదట ఈ సెట్‌ను 30 అడుగుల వెడల్పుతో నిర్మించగా, తర్వాత ఇరువైపులా 15 అడుగుల చొప్పున విస్తరించి మొత్తం వెడల్పును 60 అడుగులకు పెంచారు. దాదాపు 25 మంది కార్మికులు సుమారు 20 రోజుల పాటు శ్రమించి ఈ భారీ నిర్మాణాన్ని పూర్తి చేశారు. సెట్ చుట్టుపక్కల వాతావరణంలో సహజంగా కలిసిపోయేలా ప్రత్యేక ఏజింగ్ టెక్నిక్స్ ఉపయోగించి దాన్ని మరింత సహజంగా కనిపించేలా తీర్చిదిద్దారు. వాటర్ బాడీ విలేజ్ సెట్ మరో హైలెట్. ఇది 2.5 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయబడింది. ఇందులో డమ్మీ నిర్మాణాలు కాకుండా పూర్తిగా నిర్మించిన 60 ఇళ్లు ఉన్నాయి. దాదాపు 50 మంది కార్మికులు 30 రోజుల పాటు శ్రమించి ఈ గ్రామాన్ని నిర్మించారు.

# యూత్ ఫస్ట్ లుక్ పోస్టర్



కెన్ కరునాస్, అనిష్మ అనిల్ కుమార్, దేవదర్శిని చేతన్, సూరజ్ వెంజరముడు, ప్రియాన్షి యాదవ్, మీనాక్షి దినేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తమిళ మూవీ యూత్. ఈ చిత్రాన్ని ఇదే పేరుతో ఈ2సీ బ్యానర్ పై తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు హౌస్ ఫుల్ వినీత్, సందీప్. ఈ చిత్రానికి కెన్ కరునాస్ అండ్ గ్యాంగ్ దర్శకత్వం వహించారు. త్వరలోనే యూత్ మూవీ తెలుగులో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ను హీరో కిరణ్ అబ్బవరం లాంఛ్ చేశారు. యూత్‌మూవీని తెలుగులోకి తీసుకొస్తున్న వినీత్, సందీప్ కిరణ్ అబ్బవరంతో చాలాకాలంగా ట్రావెల్ చేస్తున్నారు. కిరణ్ వారికి సపోర్ట్ గా నిలుస్తూ ఈ మూవీని ప్రమోట్ చేస్తున్నారు. యూత్ ఫస్ట్ లుక్ పోస్టర్ చూస్తుంటే మంచి యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ లా అనిపిస్తోంది. మలయాళ బ్లాక్ బస్టర్ ప్రేమలు తెలుగులోనూ ఘన విజయాన్ని అందుకుంది.
అలాగే ఇలాంటి తరహా కంటెంట్ తోనే వచ్చిన లిటిల్ హార్ట్స్ కూడా పెద్ద సక్సెస్ దక్కించుకుంది. ఇప్పుడు తెలుగు ఆడియెన్స్ కు కావాల్సిన యూత్ ఫుల్ రొమాంటిక్ ఎంటర్ టైనర్ జానర్ లో వస్తున్న యూత్ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ తోనే అలాంటి వైబ్స్ క్రియేట్ చేస్తోంది.

## మా రాముడు అందరివాడు

# నుంచి సాంగ్ లాంఛ్




యంగ్ టాలెంటెడ్ హీరో శ్రీరామ్ నటిస్తున్న కొత్త సినిమా మా రాముడు అందరివాడు. ఈ చిత్రాన్ని అనుముల ప్రొడక్షన్స్, శ్రీరామ్ క్రియేషన్స్ బ్యానర్స్ పై అనుముల లక్ష్మణరావు, పల్లకొండ శ్రీరాములు నిర్మిస్తున్నారు. యద్దనపూడి మైకేల్ దర్శకత్వం వహిస్తున్నారు. నిర్మాత అనుముల లక్ష్మణరావు ఈ చిత్రంలో విలన్ గా నటిస్తున్నారు. శ్రీరామ్ సరసన స్వాతి హీరోయిన్ గా కనిపించనుంది. సుమన్, సమ్మెట గాంధీ, నాగ మహేష్, బాహుబలి ప్రభాకర్, ఆనంద్ భారతి, జబర్దస్ అప్పారావు, చిట్టి బాబు, గడ్డం నవీన్, కీలకపాత్రలు పోషిస్తున్నారు. త్వరలో మా రాముడు అందరివాడు సినిమా పాన్ ఇండియా రిలీజ్ కు రెడీ అవుతోంది. తాజాగా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ చేతుల మీదుగా ఈ సినిమాలోని ఇడిసెల్లిపోయావా.. సాంగ్ లాంఛ్ చేశారు. ఈ పాటకు డైరెక్టర్ యద్దనపూడి మైఖేల్ సాహిత్యాన్ని అందించి, నల్లగొండ గద్దర్ గా ప్రసిద్ధమైన నర్సారెడ్డి తో కలిసి పాడారు. ఇడిసెల్లిపోయావా.. సాంగ్ లాంఛ్ కార్యక్రమంలో హీరో శ్రీరామ్, నిర్మాత, నటుడు అనుముల లక్ష్మణరావు, డైరెక్టర్, సాంగ్ రైటర్ యద్దనపూడి మైఖేల్, సింగర్ నల్లగొండ గద్దర్ నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మా రాముడు అందరివాడు సినిమాలో తండ్రిని కోల్పోయిన కొడుకు అలాగే గొప్ప వ్యక్తిని కోల్పోయామని ఊరి ప్రజలు కలిసి విషాధంతో పాడుకునే ఒక అద్భుతమైన పాట ఇడిసెల్లి పోయావా... ఈ పాట చాలా బాగుందని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారు ప్రశంసించారు. ఇడిసెల్లిపోయావా.. పాటను, పాట పోస్టర్స్ ను ఆయన లాంఛ్ చేసి, సాంగ్ విన్నారు. మా రాముడు అందరివాడు మూవీ మంచి విజయం సాధిస్తుందని ఆయన తన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ – మా రాముడు అందరివాడు సినిమా నుంచి ఇడిసెల్లిపోయావా.. సాంగ్ లాంఛ్ చేయడం సంతోషంగా ఉంది. ఈ పాటను డైరెక్టర్ యద్దనపూడి మైఖేల్ మంచి సాహిత్యంతో రాశారు. నల్లగొండ గద్దర్ నర్సారెడ్డి అన్న బ్రహ్మాండంగా పాడారు. ఇది చాలా మంచి సినిమా. సమాజానికి దిక్సూచిగా నిలిచే సందేశంతో మిమ్మల్ని అలరించే వినోదంతో ఈ సినిమాను తెరకెక్కించారు అన్నారు.




చార్మింగ్ స్టార్ శర్వా మోస్ట్ ఎవైటెడ్ స్పోర్ట్స్ డ్రామా బైకర్ ఏప్రిల్ 3న థియేటర్లలోకి రానుంది. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో, ప్రతిష్టాత్మక బ్యానర్ యు.వి. క్రియేషన్స్ నిర్మాణంలో భారతదేశపు మొట్టమొదటి కంప్లీట్ మోటోక్రాస్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా ప్రతి కొత్త అప్‌డేట్‌తో ఉత్సాహాన్ని పెంచుతూనే ఉంది. క్యారెక్టర్ గ్లింప్స్, సినిమాలోని మొదటి రెండు సింగిల్స్ కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. శర్వా బైకర్ కోసం టాప్ గేర్‌లోకి మారారు. ఆయన ట్రాన్స్‌ఫర్మేషన్

## బైకర్ కోసం శర్వా హై-ఇంటెన్సిటీ ప్రిపరేషన్

వీడియో చూస్తే ఈ ప్రాజెక్ట్ కోసం ఎంత కష్టపడ్డారో స్పష్టంగా తెలుస్తోంది. ఇప్పుడాయన శరీరం మరింత లీన్‌గా, అథ్లెటిక్‌గా కనిపిస్తోంది. చక్కగా తీర్చిదిద్దిన మిడ్‌సెక్షన్, కట్ షోల్డర్స్, డిఫైన్డ్ అప్పర్ బాడీ ఆయన నెలల తరబడి చేసిన కఠినమైన ట్రైనింగ్‌ను చూపిస్తున్నాయి. ఇది కేవలం లుక్ కోసం చేసిన మార్పు కాకుండా, పద్ధతిగా ప్లాన్ చేసిన ఫిట్‌నెస్ ట్రాన్స్‌ఫర్మేషన్. మోటోక్రాస్ రేసింగ్ ప్రపంచాన్ని నిజంగా చూపించేందుకు శర్వా ప్రత్యేకమైన ట్రైనింగ్‌ను తీసుకున్నారు. ఆయన వర్కౌట్స్‌లో స్ట్రెంగ్త్ సర్క్యూట్స్, కోర్ స్టెబిలైజేషన్ ఎక్సర్‌సైజులు, ఎక్స్‌ప్లోసివ్ పవర్ డ్రిల్స్ ఉన్నాయి. మోటార్ సైకిళ్లను వేగంతో నియంత్రించాల్సిన మోటోక్రాస్ రేసింగ్ కి తగినట్లు ఈ ట్రైనింగ్ రూపొందించబడింది.

# భిన్నమైన ఫోజులలో ఫరియా



జాతిరత్నాలు సినిమాలో తన అమాయకత్వంతో చిట్టిగా అందరి మనసులు దోచుకున్న హైదరాబాదీ భామ ఫరియా అబ్దుల్లా ఇప్పుడు రూట్ మార్చింది. ఆరడుగుల పొడవుతో, చూడచక్కని రూపంతో అలరించిన ఈ సుందరి, ఇప్పుడు గ్లామర్ డోస్ పెంచి సోషల్ మీడియాలో సెగలు పుట్టిస్తోంది. పద్ధతిగా కనిపించే చిట్టి సడెన్‌గా గ్లామర్ గేర్ మార్చడంతో నెటిజన్ల ఫ్యూజులు ఎగిరిపోతున్నాయి. టాలెంట్ పుష్కలంగా ఉన్నా, సరైన బ్రేక్ కోసం చూస్తున్న ఈ ముద్దుగుమ్మ చేస్తున్న తాజా ఫోటోషూట్స్ ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. వివరాల్లోకి వెళితే .. చిట్టి ఇన్నోసెన్స్ నుండి గ్లామర్ లుక్స్ దాకా.. ఫరియా మేకోవర్: జాతిరత్నాలు సినిమాతో ఓవర్‌నైట్ స్టార్ అయిపోయిన ఫరియా అబ్దుల్లా, ఆ తర్వాత వరుసగా అవకాశాలు అందుకుంటున్నప్పటికీ ఆశించిన స్థాయిలో సక్సెస్ మాత్రం దక్కడం లేదు. అందుకే కాబోలు, ఈ పొడుగుకాళ్ల సుందరి ఇప్పుడు తనలోని మరో కోణాన్ని ఆవిష్కరిస్తోంది. నిన్న మొన్నటి వరకు హోమ్లీగా కనిపించిన ఫరియా, ఇప్పుడు గ్లామరస్ ఫోటోషూట్లతో కుర్రాళ్ల మతులు పోగొడుతోంది. సోషల్ మీడియాను షేక్ చేస్తున్న ఆమె లేటెస్ట్ షాట్ డ్రెస్ ఫోటోలు చూస్తుంటే, ఇండస్ట్రీ వర్గాలకు సైతం మైండ్ బ్లాక్ అవుతోంది. అవకాశాల కోసం తనని తాను కొత్తగా ప్రెజెంట్ చేసుకునే ప్రయత్నంలో ఫరియా చేస్తున్న ఈ మేకోవర్ కు నెటిజన్లు ఫిదా అవుతున్నారు. టాలెంట్ ఉన్నా కలిసి రాని అదృష్టం: నిజానికి ఫరియా మంచి నటి మాత్రమే కాదు, గ్రేట్ డ్యాన్సర్ కూడా. మోడలింగ్, థియేటర్ ఆర్టిస్ట్‌గా అనుభవం ఉన్న ఈమెకు టాలీవుడ్‌లో ఆశించిన గుర్తింపు రాకపోవడం విచారకరం. మన దగ్గర పరభాషా భామలకు ఇచ్చే ప్రాధాన్యత తెలుగమ్మాయిలకు దక్కడం లేదనే విమర్శలు ఎప్పటి నుండో ఉన్నాయి. మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్, బంగార్రాజు, చివరకు కల్కి 2898 ఎడి వంటి సినిమాల్లో మెరిసినా అవి కేవలం క్యామియో పాత్రలకే పరిమితమయ్యాయి. హీరోయిన్‌గా నటించిన రావణాసుర, ఆ ఒక్కటీ అడక్కు వంటి సినిమాలు నిరాశపరచడంతో, ఈ ముద్దుగుమ్మ ఇప్పుడు గ్లామర్ బాట పట్టి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. కెరీర్ మారే బ్రేక్ ఎప్పుడు?: ఇటీవల వచ్చిన మత్తు వదలరా 2 సినిమాలో ఫరియా నటనకు మంచి మార్కులే పడ్డాయి. ఇక గత ఏడాది వచ్చిన గుర్రం పాపి రెడ్డి సినిమా హిట్ టాక్ తెచ్చుకున్నా, ఆమె కెరీర్ గ్రాఫ్‌ను అమాంతం పెంచేసే స్థాయిలో మాత్రం ఆ ప్రభావం కనిపించడం లేదు. అందుకే ఇప్పుడు తనలోని గ్లామర్ యాంగిల్‌ను బయటకు తీసి పెద్ద హీరోల కంట పడాలని చూస్తోంది. చిన్న హీరోలతో సినిమాలు చేస్తున్నా, స్టార్ హీరోల సరసన ఒక్క ఛాన్స్ దక్కితే ఫరియా రేంజ్ మారిపోవడం ఖాయం

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044